# రచయిత్రి ఆత్మహత్య

- నవల

- జలంధర

శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 209

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి డిసెంబర్ 2019 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

# (ప్రారంభం)

**నాకు కళాకారులంటే** పెద్ద అభిప్రాయం ఏం లేదు. చెప్పద్దూ జీవితంలో సాయంకాలాల్లోకి వచ్చేసినవాడిని. పెద్ద లంపటం లేకుండా వడ్డీ డబ్బు ఓ రెండువేల రూపాయలు వచ్చేటట్లు ఏర్పరచుకుని రికామీగా జీవిస్తున్నాను.

మొదటినుంచీ నేను డిసిప్లిన్‌తో బతకడానికి అలవాటు పడ్డవాణ్ణి. ఏ పనయినా సరిగ్గా ఆయా సమయాల్లోనే చెయ్యడానికి, బాధ్యతాయుతంగా ప్రవరించడానికీ అలవాటయిపోయినవాణ్ణి. ఈ విషయంలో నన్ను చూస్తే నాకే గర్వం.

గిట్టనివాళ్ళు నన్ను 'డబ్బు మనిషి' అంటారు. కానీ, ఏమాత్రం క్రమశిక్షణ లేనివాళ్ళన్నా ఒళ్ళుమంట నాకు. వాళ్ళు జీవితంలో కష్టాలు కొనితెచ్చుకుంటారు.

బాధ్యత మరొకరి మీదకి తోసేస్తారు.

విధి, దేముడు.. ఇవన్నీ ఎక్కడో లేవు. మనచేతుల్లోనే ఉన్నాయని నా నమ్మకం.

ఇలాంటి నాకు కళాకారులంటే మంట ఉండడానికి చాలా కారణాలున్నాయి. "నటవిటగాయకులు పంక్తిబాహ్యులు" అన్నవాడెవడోగానీ మహానుభావుడనే నా ఉద్దేశం. ఈ ఆధునిక యుగంలో ఆ లిస్టులో రచయితలు వగైరాలను కూడా చేరిస్తే మంచిదనే అభిప్రాయం నాది.

నేను ప్రతి విషయం నిష్పక్షపాతంగానే ఆలోచిస్తాను. ఈ నా కచ్చకు కారణం నాజీవితపు అనుభవాలే.

మా తండ్రి ఆస్తినంతా నాటకాలకు, తద్వారా రాగరాగిణులకు తగలేశాడు. మా ఇంట్లో కిరసనాయిలు లేనప్పుడు కూడా నాటకాలకు పెట్రోమాక్స్‌లైట్లు కొనే మనిషి ఆయన. అందుకే జమిందారీగా పరిగణింపబడే మా కుటుంబం మండువా ఇల్లు, బోలెడన్ని అప్పులు, పనికిరాని హోదాలతో మిగిలిపోయింది.

నాన్నపోతూ అప్పచెప్పిన మిగిలిన చెల్లెళ్ళ బాధ్యతలు, ఉమ్మడి అప్పులతో నాకు ఈ ప్రపంచంలోని కళన్నా, ఆ బాపతు మనుషులన్నా మంట రగలడంలో ఆశ్చర్యమేముంది.

ఆ తరవాత నా జీవితంలో తటస్థించిన మనుషులయిన మా బావమరుదులూ, తదితర చుట్టాలు కూడా ఈ దిక్కుమాలిన ఆర్ద్రతలు, స్పందనలతో తడిసి ముప్పందుమై అందర్నీ ఇబ్బంది పెట్టిన వాళ్ళే.

కానీ నా అభిప్రాయాలు నేనేనాడూ బయటికి చెప్పను. లౌక్యంగా బతక్క, అనవసరపు బాధలు తెచ్చుకోవడం నాకు ఇష్టంలేదు. ఎవరయినా పిలిస్తే సభలు అలంకరించడం, పైసా ఖర్చులేకుండా వాళ్ళను పొగిడి మనమొక దుశ్శాలువా కప్పించుకుని బయటపడటం. ఇందులో నష్టమేం లేదు. అందువల్లే అంతర్గతమైన నా కళావిరోధం బయట పడలేదు ఎప్పుడూ. చాలామంది ఈ విషయం నమ్మకపోవచ్చు కూడా. ఎందుకంటే నేను ఆశీర్వచనాలు, అభిప్రాయాలు రాసిచ్చిన పుస్తకాల్లో ఒక్క పేజీకూడా నేను చదవలేదని వాళ్ళకు తెలియదు కాబట్టి "వారి అమూల్యాభిప్రాయం ఇలా శలవిచ్చారు" అని ఆ నా మాటల్ని చాలామంది అవసరార్థం వాడుకుంటూ ఉంటారు. అందులో తప్పేమిటట?

కేవలం అణాపైసల జమా ఖర్చులు తప్ప తెలియని నా స్నేహితుడొకడు ఇన్‌కం టాక్స్ ఎగ్గొట్టాలని సినిమా తీసి, ఆ డైరెక్టర్ పుణ్యమా అని గొప్ప సినిమాగా ప్రశంసించబడినదే తీశాడు.

అతనికి గవర్నమెంటు ఉత్తమాభిరుచులు గల నిర్మాతగా పతకమిచ్చి సత్కరించింది. మరి ఇటువంటి పరిస్థితుల్లో నా అభిప్రాయం మాత్రం 'అమూల్యం' ఎందుకు కాదు?

ఈ నానాజాతి కళా సమున్నతుల్లో అత్యంత ప్రమాదకరమైన వాళ్ళు ప్రస్తుతం రచయితలేనని నా అనుమానం. వీళ్ళు ఎటుపోతున్నారో, ఏమైపోతున్నారో అని నాకు బాధ. కేవల ఓ నాలుగు దస్తాల కాగితాలు, ఒక అర్ధరూపాయి సిరా ఖర్చుతో దేశాన్ని, మనుషుల్ని చెడగొట్టే అధికారం వీళ్ళకెవళ్ళు ఇచ్చారట? అంటే వీళ్ళ రచనలు చదివే దేశం తల్లకిందులైపోతోందనే చవటను కాను నేను. కానీ చెప్పద్దూ. అప్పడప్పుడూ చాలామంది జీవితాలు ప్రభావితమవ్వడానికీ, అనేక కొత్త కష్టాలు కొని తెచ్చుకోవడానికీ ఫలానా రచయితల రచనలు కారణం అని విన్నప్పుడు మాత్రం 'పాపం' అనిపిస్తుంది.

ఇల్లాంటి నాకు పేరెన్నికగన్న రచయిత్రి 'ఉమ' మేనగోడలవడం విచిత్రమే. ఓ నాలుగు నవలలు, ఓ పది కథలు, కాసిన్ని గేయాలు రాసి, మొత్తానికి అదో రచయిత్రిగా సాహిత్యాన్ని ఫీడ్ చేసింది.

ఇక్కడ 'ఉమ' ప్రసక్తి ఎందుకంటే హాయిగా జరిగిపోతున్న రైలు ప్రయాణంలాంటి నా జీవితంలో ఉన్నట్లుండి ఓ సుప్రభాతాన ఓ తలనొప్పి సమస్య వచ్చింది. అది సృష్టించింది మా ఉమే.

తలుపు చప్పుడైంది. పాలపాకెట్టు అబ్బాయేమోనని తీశాను.

ఎదురుగా నా చెల్లెలు వసుంధరా, ఆమె భర్త కేశవరావు. "అన్నయ్యా! ఉమ చచ్చిపోయింది" బావురుమంది చెల్లెలు.

"అదేమిటి? ఎలా? లోపలికి రండి"

నాకు ఖంగారనిపించింది. రెండు రోజుల క్రితం సలక్షణంగా బాంబే మెయిల్ ఎక్కి అత్తగారింటికి బయలుదేరిన పిల్ల చచ్చిపోవడమేమిటి? ఎలా? ఎప్పుడు? ఎక్కడ?

మా బావను చూస్తూ అడిగాను ఆ ప్రశ్న.

"రైల్లో" అన్నాడాయన.

"అదేమిటి? ఏదన్నా అఘాయిత్యం జరిగిందా?"

స్వతంత్ర భారతదేశంలో రైలు ప్రయాణాలు ఎంత భయంకరమైనవో పేపర్లో చదువుతూనే ఉన్నాము. ఎప్పటికప్పుడు 'అవి మనకు రావులే' అనుకోకపోతే ప్రయాణం చెయ్యలేము కూడా.

"లేదు" నేల చూపులు చూస్తూ చెప్పింది చెల్లెలు వసుంధర.

ఒక్కసారి పరీక్షగా చూశాను. జుట్టు రేగిపోయింది. నలిగిన చీర. చేతినిండా ఎర్రగాజులతో కలిపిన బంగారు గాజులు, రవ్వలదిద్దులు మామూలే. అయినా నా చెల్లెల్ని ఇలా చూడలేదెప్పుడూ. చిన్నప్పటినుంచి వాడని పువ్వులా ఉండేది మా బావ ఇన్‌కంటాక్స్ ఆఫీసరై రెండు చేతులా సంపాదించుకోవడంతో పెళ్ళయినా దాని అలవాట్లు, హోదాలు తగ్గించుకోవలసిన అవసరం ఏనాడూ రాలేదు. తన స్నేహితురాళ్ళను, పరిచయాల్ని కూడా సమానస్థాయిలోనే ఉంచుకునే మనిషి. చిన్నప్పుడు అందర్నీ పేరంటానికి పిలిచివచ్చి, "ఆ పూజారి వాళ్ళమ్మాయిని పిలవలేదులే. ఆఁ! చిరుగుల పరికిణీ కట్టుకుని ఏం వస్తుంది లెద్దూ!" అనేది. అటువంటి మనిషి ముఖమంతా కందగడ్డలా వాచి, దుఃఖంతో గొంతు పూడుకుపోయి

చూడలేకపోయాను.

"ఏమైంది బావా?" ఆయననే అడిగాను.

స్థూలకాయం, బట్టతల చేతికి వెంకటేశ్వరస్వామి ఉన్న ఉంగరం, చాలా కాస్ట్లీ రిస్టువాచీ మా బావను చూస్తే ఎవరూ గవర్నమెంటు ఆఫీసరు అనుకోరు. ఏదో పెద్ద బిజినెస్ మాగ్నెట్ అనే అనుకుంటారు.

"స్లీపింగ్ పిల్స్ మింగేసింది"

"ఎప్పుడూ?"

"బహుశా మేమంతా రైలు ఎక్కించి తిరిగి వచ్చాక"

"వెంట ఎవరు వెళ్ళారు?"

"ఎవరు వెళ్ళలేదు బావా! అదే మేం చేసిన పొరపాటు"

"అదేమిటి?"

"అదే పొరపాటు అంటున్నాంగా! అసలిక్కడినుంచి బాంబేకి ఫ్లైట్‌లోనే రమ్మన్నాడు అతను అక్కడినుంచి తీసుకువెళతానన్నాడు"

"అదేమిటి? అరేబియానించి వచ్చిన వాడు బాంబేనించి ఇక్కడికి ఒకపూట వచ్చి పెళ్ళికూతుర్ని తీసుకువెళ్ళలేదూ?" అడిగాను నేను.

"అతనికి ఈ ఫార్మాలిటీస్ అవీ లేవట. అదొక తత్వం. వెధవగోల" విసుక్కుంటూ వెక్కుతూ అంది వసుంధర.

అయితే అక్కడ రెండు చేతులా ఆర్జిస్తున్న ఈ అబ్బాయిని వలలో వేసి చిక్కించుకుని అల్లుణ్ణి చేసుకోడానికి వీళ్ళిద్దరూ ఎంత అవస్థపడ్డారో నాకు తెలుసు. అతను నిశ్చితార్థానికి పెట్టిన డైమండ్ నెక్లెస్ గురించి ఆ తరువాత పదిరోజులు మా వసుంధర నోట్లోనుంచి ఎన్నిసార్లు విన్నామో మాకే గుర్తులేదు.

కానీ అది తప్పుకాదు. ఆడపిల్లలను కన్న ప్రతి తండ్రీ తన కూతురు అత్తవారింట్లో వీలైనంత దర్జాగా బతకాలని కోరుకోవడంలో తప్పులేదు. పైగా వీళ్ళకున్నది ఇద్దరే ఆడపిల్లలు. ఉమ పెళ్ళికి ఫైవ్‌స్టార్ హోటళ్ళలో పెళ్ళి కొడుకు స్నేహితులకు బుక్ చేసిన రూముల ఖర్చు పదిహేనువేలు దాటిందట. పెళ్ళి ఖర్చు చెప్పనే అక్కరలేదు. కళ్యాణ మండపంలో అయిన కరెంటు ఖర్చుతోనూ, అందరి కార్లకూ పోయించిన పెట్రోలు ఖర్చుతోనూ ఓ నాలుగైదు కుటుంబాలు సంవత్సరకాలం హాయిగా బతకవచ్చు. కానీ అల్లాంటి ఖర్చు తప్ప ఇలాంటి అల్లుణ్ణి తేలేదు మరి. ఒకరకమైన బిజినెస్ లాంటిది ఇదంతా. రెండు పక్కలవాళ్ళ బుర్రల్లోనూ లాభనష్టాల బేరీజులూ, వాళ్ళకు చేరే స్టీలు గ్లాసుల ఖరీదు దగ్గరనుంచీ అంచనా ఉండనే ఉంటుంది వీటికే ఆనవాయితీ, సాంప్రదాయం, హోదా అంటూ ఏవేవో అడ్డం పెట్టుకుంటారు. అంతే! ఇది లోకంలో రివాజు.

కానీ, ఇక్కడి పరిస్థితి ఏమిటి?

"పోనీ ఫ్లైట్‌లో పంపకపోయారా?"

"వెళ్ళనంది. దాని బుర్రలో ఏముందో మాకేం తెలుసు చెప్పు. అసలు బైటపడనే లేదాయె. 'అమ్మా! ఇండియా మళ్ళీ ఎప్పుడు చూస్తానో సరదాగా రైల్లో వెళతాను' అంటే నిజమేలే అనుకున్నాం గానీ ఇంత అఘాయిత్యం చేస్తుందని అనుకోలేదు అన్నయ్యా" వెక్కుతూ అంది వసుంధర.

దాని జీవితంలో చెల్లి అంతగా దుఃఖపడటం నేను చూడలేదు. ఎప్పుడూ అందర్నీ లొంగదీసుకుని, తననుకున్న మాటే చెల్లించుకుని బతికిందది. దాని మాట వినేవాడూ, స్థితిపరుడూ అయిన భర్త రావడంతో దాని జాతకం మహర్జాతకం అన్నారంతా.

"అయినా తోడు లేకుండా పంపడం ఏమిటి?" విసుక్కుంటూనే అన్నాను.

"ఆయనకు ఆఫీసు పని ఉందన్నారన్నయ్యా! నేనే వెళ్దామనుకున్నానుగానీ ఎవరూ వద్దమ్మా అంటూనే ఉందది. పైగా ఆ వచ్చిన బహుమతులు అవీ ఇంకా సర్దనే లేదు. బోలెడంత వెండిసామాను ఇంటినిండా. పైగా చుట్టాలు"

"ఇప్పుడు దాచావుగా అన్నీ. దాచుకో ఎవరే చుట్టాలు ఎవరు? మా అక్కయ్యలూ, అమ్మవాళ్ళేగా. వాళ్ళంతా దోచుకుపోతారని నీ భయం. ఇప్పుడు దాచుకో ఎవరికోసరం దాస్తావో" అక్కసుగా అన్నాడు బావ.

మా వసుంధర వాళ్ళింట్లో అడుగు పెట్టిన నాటినుంచీ మా బావ ఎంత సంపాదించినా, ఆయన తరపువాళ్ళకు అరవై రూపాయల చీరలూ, వచ్చిన మూడోరోజు నుంచీ పలకరించకపోవడాలతో ఎవరూ ఆయన ఇంట్లో తలెత్తే అవకాశం రాలేదు. పెళ్ళి కాబట్టి పిలవక తప్పలేదు. మా బావ భార్యను అడ్డం పెట్టుకుని బాధ్యతలు చాలా తప్పించుకున్నాడు. తను చెప్పడానికి మొహమాటపడ్డవి అనేకం. ఆవిడ చేత చెప్పించుకున్నాడు. కానీ, ఇప్పుడు జరిగిన విషాదం వాళ్ళ బిడ్డ గురించి. దాంతో లోపలి బాధ బయటపడింది. అయినా ఆయనా మనిషేగా.

"సర్లెండి కావాలంటే తెచ్చి అందర్నీ నెత్తికెక్కించుకోండి. వద్దన్నానా?" అని ఆయనను ఒక్క విదిలింపు విదిలించి, "అక్కడికీ లక్ష్మణ్‌ను పంపించానన్నయ్యా" అన్నది.

"మరి అతను..?"

"మన కింద క్లర్కు కదా అతను స్లీపర్‌లో ఉన్నాడు. అమ్మాయి ఫస్ట్‌క్లాసులో ఉంది. ఒకసారి దార్లోవచ్చి చూశాడట. నిద్రపోతోందని వెళ్ళిపోయాడట."

"మరి అల్లుడు?"

"ఏముందీ? మాకు ఇలా అని టెలిగ్రాం ఇచ్చి ఉమ బాడీని పోలీసులకు హేండోవర్ చేసి ఆ రోజే వెళ్ళిపోయాడు గల్ఫ్‌కు" మా బావ చెప్పాడు.

"అదేమిటి? కనీసం ఇక్కడికి రాలేదా?"

"అతనికి శలవు లేదట. పైగా కాపురానికి వచ్చే పెళ్ళాం చేతుల్లో శవంలా వాలితే ఏమనిపిస్తుంది చెప్పు అతనికి? ఎవరి మొహం చూడలేక వెళ్ళిపోయి ఉంటాడు. ఇప్పుడు మనం వాళ్ళ వాళ్ళందరికీ ఏం సమాధానం చెప్పాలి? ఏమనుకుంటారు వాళ్ళు? ఎన్ని మాటలు పడాలో? వాళ్ళంతా హోదాల్లో ఉన్నవాళ్ళు"

బిడ్డపోయినా దాని బుర్రలో అల్లుడి జీతం, అతని వాళ్ళ హోదా, ఇచ్చిన అయిదారు లక్షల కట్నం ఇవన్నీ సుళ్ళు తిరుగుతున్నాయి.

"ఛా! నోర్ముయ్. జరిగేది చూడాలి ముందు..."

విసుక్కోలేదు ఇలా. పరిస్థితి ఇది మరి.

"ఇప్పుడేం చేద్దామంటావు?"

"ఏముంది? బాంబే పోలీసులను కాంటాక్ట్ చేసి, శవం పోస్ట్‌మార్టం జరక్కుండా చూడాలి బావా. రంజిత్ వాళ్ళకు టెలిగ్రాం ఇవ్వాలి"

ముందు కేసులు, ఎంక్వైరీలు, పత్రికలవాళ్ళు ఇవన్నీ నా బుర్రలో గిర్రున తిరిగాయి.

నాకు తెలిసిన పోలీసు ఆఫీసర్లకు, మా బావ హోదాలో ఆయన చేయగలిగిన ఇన్‌ఫ్లుయన్సులు, బొంబాయికి ఒక ఇరవై ముప్పై ఎస్.టి.డి కాల్సు, అక్కడే ఉండిపోయిన లక్ష్మణ్‌తో చర్చలు.

ఇవన్నీ మూడురోజుల్లో జరిగాయి. అయినా పోస్ట్‌మార్టం జరక్కుండా ఆపలేకపోయాం. అది ఆత్మహత్య అని బైటకు రాకుండా చేసేందుకు మా బావ భయంకరంగా డబ్బు విరజిమ్మాడు. 'ఏదో హార్ట్ వీక్‌నెస్‌తో పోయింది అని డాక్టర్ స్టేట్‌మెంటు ఇచ్చారు' అని అందరికీ చెపుతున్నాం కానీ, ఎవరికీ నమ్మకం కలిగినట్లు లేదు అలాగని వారికి మాట్లాడే ధైర్యమూ లేదు.

శవాన్ని తీసుకువచ్చిన రోజు విపరీతమైన జనం. పత్రికలవాళ్ళు, ఫోటోగ్రాఫర్లు, బంధువులు, స్నేహితులు. సగం మంది వార్తా సేకరణకు వస్తే, సగం మంది ఉమ రచయిత్రి కాబట్టి వచ్చారని వినేదాకా దాన్ని గురించి జ్ఞాపకమే లేదు. ఇందాకే చెప్పానుకదా! రచయితలు, రచయిత్రులు, కళాకారులు వీళ్ళంటే నాకేం పెద్ద ఇష్టంలేదు. వాళ్ళకు వచ్చే భావావేశాన్నీ, వాళ్ళకు అందని తీయని అనుభవాల్నీ, వాళ్ళు చెయ్యలేని సాహసాల్నీ కాగితాల మీద పెన్ను దులిపి రూపకల్పన చేస్తారు. ఆ కవిత్వానికి, వాళ్ళ జీవితాలకు నాకు తెలిసినంతలో సంబంధం కనబడదు. వాళ్ళకు వచ్చే ఒక మెరుపులాంటి ఆలోచన కథగానో, నవలగానో రూపం దిద్దుకుంటుంది. కానీ వాళ్ళ జీవితం, ఆలోచనలు వేరు. పైగా కాలంకు ఇంత, పేజీకి మరింత అని ప్రోత్సాహం ఇచ్చే పత్రికలుండబట్టి కాస్త చెప్పగలిగిన నేర్పు ఉన్న ప్రతి ఒక్కరు దీన్ని కుటీర పరిశ్రమ చేశారని నా అభిప్రాయం. నేను సినిక్ నన్నా సరే నేను చూసినంతలో, చదివినంతలో నాకు అర్థమైంది ఇదే చాలా గొప్ప రచయితలనేవారు ఏం మిగుల్చుకోలేదు. పేరు, దరిద్రం తప్ప. అయినా కవితాస్వేదాన్ని కాగితాల మీద కుమ్మరించి కన్నీరు తెప్పించే చాలామందికి నిజజీవితంలో కన్నీటి బొట్టుకు విలువ తెలియదు. వారి అనుభవాలు వేరేమోగానీ నా మాటలు ఇవే.

అందుకని ఉమను ఒక రచయిత్రి అనడంకన్నా, నా మేనకోడలు, ఎమ్.ఏ పాస్ అయింది, వీణ వాయిస్తుంది అంటూ ఆలోచించుకోవడం బావుంటుంది నాకు.

చాలా పత్రికలు 'కాలం' కట్టి ఉమ గురించి రాశాయి.

"ప్రఖ్యాత రచయిత్రి ఉమాదేవి ఆత్మహత్య"

చాలా గొప్పగా, అందంగా అందరూ గుర్తించి ఆలోచించేట్లు చేసిన పనేనన్న మాట ఉమ చేసింది.

అరబ్బు దేశాల్లో పనిచేస్తున్న కోటీశ్వరుడైన ఒక అందగాడు, యువకుడు అయిన వ్యక్తి చేత బుద్ధిగా అందరి ఆడపిల్లలలాగే తాళి కట్టించుకుని భర్త దగ్గరకు వెళదామని రైలు ఎక్కి శవంగా అతని చేతిలో వాలిన యువతి కథ.

కానీ అప్పుడు ఆమె శవంలా లేదు. చాలా అందంగా అలంకరించుకుని, తలనిండా పూలతో, ఎర్రగళ్ళ రంగు చీరతో, కళ్ళనిండా కాటుకతో ఆమె భాషలో చెప్పాలంటే 'నేలరాలిన పారిజాతం'లా ఉన్నది ఉమ.

'గ్లామర్ క్వీన్స్ అయిన సినిమా ఆర్టిస్టుల్నే కాదు కొందరు అందగత్తెలు కూడా పత్రికలకు ముఖపత్ర సుందరులుగా పరిగణింపబడవచ్చు' అని నిర్ణయించుకున్న ఒక పత్రిక ఉమ ఫొటో పత్రిక అట్టమీద వేసింది. అందులోనే పై వాక్యాలు రాసింది. చనిపోయిన కారణం ఇంకా తెలియదనీ రాసింది.

కొన్ని పత్రికలు మామూలుగానే వాళ్ళ 'ఊహ'ను 'నిజం'గా రాశాయి. కొన్ని నిజాయితీగల పత్రికలు ఇది మా 'ఊహ' 'నిజం' కావచ్చు అని రాశాయి.

నాకీ మొత్తం గందరగోళంలో నచ్చనిదేమిటంటే, ఎక్కడో అరబ్బు దేశాల్లో ఉన్న ఉమ భర్తమీద వ్యాఖ్యానాలు రాశారు కొంతమంది. మరి కొందరు ఆమెకు అజ్ఞాత ప్రేమ కథ ఉందని రాశారు. ఆమె తల్లీ తండ్రీ ఆమె ఇష్టాన్ని మన్నించలేదు కాబట్టి కసాయివాళ్ళన్నారు. కట్నం విషయంలో తేడా వచ్చిందనీ, అభిజాత్యమున్న ఆడపిల్ల కాబట్టి ఆత్మహత్య చేసుకుందనీ, ఆమె అత్తవార్ని క్రిమినల్ కోడ్ కింద బుక్ చెయ్యాలనీ కొందరన్నారు.

శవదహనం న్యాయంగా ఆమె భర్తే చెయ్యాలి. కానీ, "నాకీ సెంటిమెంట్లు లేవు. నేను రాను" అని స్పష్టంగా చెప్పాడంట ట్రంక్‌కాల్‌లో. సరే, తండ్రి చెయ్యచ్చని బ్రాహ్మలు అడ్జస్ట్‌మెంటూ, అమెండుమెంటూ చేశారు.

ఉమ స్నేహితురాళ్ళూ, ఓ ఐదారు రచయితలూ వచ్చి దుఃఖపడ్డారు. 'నేలరాలిన పారిజాతం' అని అప్పటికప్పుడు కవితాగానం చేశాడు ఒక ఆశుకవి. విపరీతంగా ఏడ్చాడు లక్ష్మణ్.

అర్థంకాని మంత్రాలు, అర్థం చెప్పని ఆచారాలతో పన్నెండు రోజులదాకా క్రతువు సాగుతోంది.

"ఇంటికి పెళ్ళికి వేసిన రంగులు, పెట్టిన ముగ్గులు ఇంకా మాయలేదు వదినా! అప్పుడే ఈ తంతు" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది వసుంధర వియ్యపురాల్ని కౌగిలించుకుని.

అవతలివాళ్ళ మనస్సులో ఏమున్నాయోకానీ, ఒక్కరూ బైటపడటంలేదు. "చక్కగా అంత చదువుకున్నా, కాలికి పారాణి పెట్టించుకుంది. వడ్డాణం, వంకీ పెట్టాం. చక్కటి పిల్ల. ఏం పాపమో" మూసవాయనాలు ఇస్తూ ఏడుస్తున్నారు - వాళ్ళ ఆడబడుచులూ, అత్తగారూ.

ఈ గందరగోళాల మధ్య అప్పుడప్పుడు ఉన్నట్లుండి ఏ పత్రికా విలేఖర్లో దిగి ఆమె తల్లినీ, తండ్రినీ, అత్త మామల్నీ ఇంటర్వ్యూ చేస్తూనే ఉన్నారు.

పన్నెండో రోజున ఈ గందరగోళమంతా చూస్తూ, దూరంగా పడక్కుర్చీ వేసుకుని కూర్చున్న నాకు అరికాలు మంట నెత్తికి వస్తోంది. "చచ్చినవాళ్ళ కళ్ళు చారడేసి" అని చెప్పుకోవాలి కాబట్టి ఊరుకున్నాను గానీ, ఇంత కొట్టు పెట్టి చచ్చిపోయిన ఉమ మీద నాకు చాలా కోపంగా ఉన్నది. 'అదరగణ్ణం పిల్ల' అని తిట్టుకున్నాను కాసేపు. కానీ, వద్దనుకుంటున్నా మనసులో ఎక్కడో కలుక్కుమంటూనే ఉంది ఆ పిల్ల గుర్తుకు రాగానే.

కారణం ఉమను నా చేతుల్తో ఎత్తుకుని పెంచాను. జన ముద్దుపిల్ల అది.

పత్రిక మీద దాని బొమ్మ కనబడింది. ఉమ అందగత్తెలకిందే లెఖ్ఖ. సైడ్ పోజు బొమ్మ వేశారు. మెళ్ళో బంగారు గుళ్ళదండ, కాటుక కళ్ళు, తలనిండా పూవులు, పట్టుదల, పంతం సూచించే గడ్డం చక్కటి పిల్ల. ఆ బొమ్మలో కనబడనిది, ఉమకు మరింత అందం తెచ్చింది బారాటి జుట్టు. ఒక ఛాయ ఎక్కువైన పిల్లే. ఎందుకిలా వడ్డించిన విస్తరిలాంటి జీవితం పాడుచేసుకుంది?

పదమూడో రోజు దీపాలు చూడకుండానే తట్టాబుట్టా సర్దుకుని వెళ్ళిపోతున్న వాళ్ళలో ఒకావిడ నావెంట పడింది.

"ఇదుగో బావగారూ జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని మీ చెల్లెలు రెండో కూతుర్నైనా మా అబ్బాయికి ఇస్తుందేమో కనుక్కోండి. మా అబ్బాయి ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్. వాళ్ళకేం తీసిపోడు. ఎక్కడో అరబ్బు దేశాలు, అమెరికాలు అని ఎచ్చులు పోయారు. ఈ పరిస్థితుల్లో వాళ్ళతో మాట కదలెయ్యడం అంతగా బావుండదు" అని వెళ్ళిపోయింది.

అవాక్కైపోయాను కాసేపు.

**నిజమే...** ఇంత ఆస్తికీ ప్రస్తుతం రమ వారసురాలు. చావులు, పుట్టుకలు, మనుషుల లౌక్యాలు ఆపలేవు... దేని దారి దాందే.

అప్పుడే పరీక్షగా చూశాను రమ ఎక్కడుందా అని.

బెల్ బాటం పాంటుతో మెట్ల మీద క్రోటన్స్ పక్కన కూర్చుని నెయిల్ పాలిష్ కాబోలు వేసుకుంటోంది రమ.

"రమా!" పిలిచాను.

"ఏమిటి మామయ్యా?" ఛెంగున వచ్చి లాన్ లో కుర్చీ లాక్కుంటూ అంది.

పరీక్షగా చూశాను. మొదటి రెండు రోజులు ఏమేడిచిందో గానీ ఆ తరవాత చాలా మామూలుగానే ఉంది.

"ఉమ ఎందుకు చచ్చిపోయిందంటావూ?"

"మామయ్యా... అదో ఫూల్! అంతే! తనకి ఈ పెళ్ళి ఇష్టం లేకపోయినా, ఇంకేదన్నా ఫీల్ అయినా దర్జాగా చెప్పి ఉండచ్చు. ఈ న్యూసెన్స్ ఏమిటి? నాకిదేం నచ్చలేదు" గట్టిగా విసురుగా అనేసింది.

ఖంగుతిన్నాను నేను.

"ఏమిటో మామయ్యా! అక్కయ్య ఇలా చేస్తుందని అనుకోలేదు" అని అది కళ్ళంబడి నీళ్లు పెట్టుకుంటే, సముదాయించే మూడ్ లో ఉన్నాను మరి.

"నిజమేననుకో! నా ఆలోచనా అదే! కానీ, కారణం ఉండాలి కదా!" గడ్డం కింద చెయ్యి పెట్టుకుని సూటిగా చూస్తూ అడిగాను.

"నాకు ఊహాగానాలు చేసే అలవాటు లేదు" కీచుగా అంది చేతులు నిస్సహాయంగా పైకెత్తి.

"అడిగానని కాదు.. ఏదైనా లవ్ ఎఫైర్?"

"ఎవరికి? ఉమకా?" గట్టిగా నవ్వింది.

"ఏమిటి రమా ఆడపిల్లకు ఆ నవ్వు?" ఎక్కడినుంచో వింటోంది కాబోలు అరిచింది అంతకన్న గట్టిగా వసుంధర.

"ఏమిటా అరుపు? ఏమిటా గట్టిగా మాట్లాడ్డం? – అని అంతకన్న గట్టిగా అరిచి చెపుతారు తల్లులు. ఆచరించలేనివి చెప్పడంలో అంత నమ్మకం వాళ్లకు.

"పైకి ఉమ రూముకు పోదాం రా!" అని లేచాను.

"వస్తానుండు మామయ్యా..." అని క్యూటెక్స్ సీసా మూత జాగ్రత్తగా మూసి పట్టుకుని చెంగున మెట్లెక్కింది రమ.

మా బావమరిది చాలా పెద్ద ఇల్లు అధునాతనంగా కట్టించాడు. చాలా చక్కటి ఫర్నిచరు కొన్నాడు. పెయింటరు పేరు తెలియకపోయినా, గొప్ప పెయింటింగ్స్ అని విన్నవి కొని అక్కడక్కడ గోడలకు పెట్టించారు. చలువరాయి మేడ, పాలరాళ్ల బాత్ రూంలు, చాలా ఖరీదైన పూలకుండీలు – అన్నీ ఉన్నాయి. కానీ అలంకరణలో ఎక్కడో అస్తవ్యస్తత ఉందనిపించింది. నేనేం ఇంటీరియర్ డెకరేటర్ ను కాను చెప్పడానికి. చెప్పలేనంత మాత్రం చేత ఫీలవకపోముగా...!

ఉమ గది మూసి ఉంది. తెరిచి లోపలికి అడుగు పెట్టాను. తూర్పువైపు కిటికీలోంచి ఎండ లోపలికి పడుతోంది. చల్లగా ఏర్ కండీషన్ గాడిలా ఉంది. తెల్లటి దుప్పట్లు, గలేబులు – ఒక సైడు పుస్తకాల రాక్, చిన్న ట్రాన్సిస్టర్, ఏదో శిల్పంలో బిగించిన ఆర్టిస్టిక్ గడియారం, మాములు కార్పెట్టు, టేబిల్ మీద మట్టిబొమ్మ... రాధాకృష్ణులు కాబోలు – పది రూపాయలు ఖరీదు కూడా చేయదేమో... అయినా చాలా ఆర్టిస్టిక్ గా ఉంది. గోడకొక కాలెండర్, దానిమీద పొన్నచెట్టు కింద కృష్ణుడు, అతని చేతుల్లో మురళి... దాని వంకే చూస్తూ ఆలోచిస్తున్నట్లున్నాడు అతను.... వెనకాల యమునా నది, దాని కింద 'రాధాభావన' అని రాసి ఉంది. పుస్తాకాలు తిప్పి చూశాను. గొప్ప లిటరేచర్ అనేవి అన్నీ ఉన్నాయి. ఒక మూల స్టాండ్ మీద వీణ. అంతకన్న ప్రత్యేకత ఏం కనపడలేదు నాకు ఆ గదిలో. నిశ్శబ్దంగా ఉంది చుట్టుపక్కల. ఆమె రాసుకునే బల్ల దగ్గర నిలబడ్డాను.

'ఏమైపోయావు ఉమా నువ్వు...' అనుకున్నాను.

'ఇక్కడే ఉన్నాను మామయ్యా!' అని నవ్వినట్లు అనిపించింది.

ఉలిక్కిపడ్డాను. చుట్టూ చూశాను. రమ ఏదో పుస్తకాలు తిప్పుతోంది. ఎవరూ లేరు.

నా భ్రాంతి కాబోలు. ఇంకెక్కడి ఉమ? తలుపు దగ్గరకేసి వస్తూంటే రంగుల పూసలు శబ్దం చేశాయి. వాటికి కట్టిన మువ్వలు కాబోలు రవళించాయి. వీణ ఎవరో శృతి చేసినట్లు మోగింది.

"ఏమిటది రమా?"

"ఏం లేదు మామయ్యా! గాలికేమో..." అంది తలుపు నా వెనకాలే మూసివేస్తూ.

ఇల్లంతా తిరిగాను. ఎందుకో ఉమ గురించే ఆలోచన. ఎలా ఉండేది ఉమ?! ఎప్పుడూ ప్రత్యేకంగా ఆలోచించలేదు నేను. నా చెల్లెలి కూతురు గురించి ఇంకేముంటాయి ఆలోచించడానికి? ఉమ కొంచెం సాత్వీకురాలు. రమ కాస్త అదరగణ్ణం చేసేది. అంతే నాకు తెలుసు.

# 2

మేడ మెట్ల వారగా, కింద వరండాలో లక్ష్మణ్ స్టూలు మీద కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. సామాన్లు ఏవో లెఖ్ఖ చూస్తున్నాడు. మనిషీ బాగా నలిగిపోయాడు. గెడ్డం మాసిపోయింది. భుజం మీద ఒక మాసిన నాప్కిన్ ఉన్నది. పాపం ఈ పదమూడు రోజుల హడావిడి అంతా అతని మీదుగానే జరిగింది. మా వసుంధర దృష్టిలో క్లర్కులు వగైరాలంతా వాళ్లాయనకు, తనకు ఊడిగం చెయ్యడానికి ఉన్నారనే! పాపం వాళ్లూ వాళ్ళ అయ్యగారి దృష్టిలో మంచిగా ఉండటానికి అలాగే పని చేసిపెట్టేవారు. స్వతంత్ర భారతదేశం అంటారు కానీ ఈ సేవాపరాయణత, స్వామి భక్తి వగైరా పాదాల కింద ఆ స్వతంత్రత ఎప్పుడో సమాధి చేయబడింది.

లక్ష్మణ్ విషయం అలా కాదు. ఇట్లాంటి వాళ్లు  నెత్తిన వేసుకుని, అందరి పనులు చూస్తూ వాళ్ల సంకెళ్లు వాళ్లే వేసుకుంటారు. ఈ బాపతు మనుష్యుల్ని ఎవరూ రక్షించలేరు. వాళ్ల ఖర్మ అంతే.

మెల్లిగా వెళ్లి దగ్గరగా నిలబడ్డాను. వంటవాళ్లకు లెఖ్ఖలు కట్టి డబ్బు ఇస్తున్నాడు. "ఇంకొక  ఎక్కువేసి ఇవ్వండి బాబూ!" అంటున్నాడు వంటవాడు.

"సర్లే! అమ్మగారు నన్ను తిడతారు" అంటూనే సర్దుతున్నాడతను.

మా వసుంధర ఇల్లాంటి విషయాల్లో మహా గట్టి. అవసరమున్నవాళ్లకు ఆభరణాలన్నా ఇస్తుంది కానీ, 'అఖ్ఖర్లేదు' అనుకున్నప్పుడు ఐదుపైసలు కూడా లెఖ్ఖ కడుతుంది. బహుశా ఈ పది రూపాయలు లక్ష్మణ్ జేబులోంచి పడినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

"లక్ష్మణ్! నా బట్టలు ఐర్నింగ్ కు ఇచ్చాను. తెప్పించి పెట్టు. రేపటినించీ కాలేజీ" పైకెక్కుతూ అరిచి చెప్పి వెళ్లిపోయింది రమ.

"సరేనండీ" లెక్కలు చూస్తూనే అన్నాడతను.

అతని వంక జాలిగా చూశాను. ఏ ఐదారు వందల జీతంతోనో తన కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు ఆదరించి, ఉద్యోగం వేయించారన్న కృతజ్ఞత ఇతని చేత ఎన్ని పనులు చేయిస్తోంది?! ఇతడు ఒక్కడూ ఎంత బాధ్యతతో పని...

చటుక్కున గుర్తుకు వచ్చింది. ఉమ ఆఖరి ప్రయాణంలో దగ్గర ఉన్నది ఇతనేనని.

"లక్ష్మణ్" పిలిచాను.

"వస్తున్నాను సార్" జమా ఖర్చు పుస్తకాలు సర్దేసి పనివాళ్ళకి ఆదేశాలు ఇచ్చి నా వెనకాలే వచ్చాడు మెల్లిగా. ఇంటి వెనకాల తోటలో సిమెంటు బెంచీ మీద కూర్చున్నాం ఇద్దరం. అరిచెయ్యి చూసుకుంటూ ఆలోచిస్తున్నాడతను.

"ఏమిటి నీ చేతినిండా పసుపు ఆడపిల్లలా?" నవ్వుతూ అన్నాను.

"ఇందాక జాడీలోనించి కిందపడితే వంటవాళ్ళతో పాటు ఎత్తాను సార్" నవ్వుతూ అన్నాడు.

వాతావరణం చల్లగా ఉంది. విరజాజి మొగ్గలు జోగుతున్నాయి. చటుక్కున తలనిండా జాజిపూలతో, కాటుక కళ్ళతో 'ఉమ' గుర్తుకువచ్చింది.

"లక్ష్మణ్! ఉమ ఎందుకు పోయిందంటావ్?" సూటిగా అడిగాను.

ఒక్కసారి తలెత్తి చూసి తల వంచుకున్నాడు. మాట్లాడలేదు. అతనికి తెలిసి ఉండకపోవచ్చు. అయినా అతనికి ఎలా తెలుస్తుంది?

"ఎందుకు చచ్చిపోయిందో?" ఆలోచిస్తూ అన్నాను.

"బతకలేక" ఠపీమని సమాధానమిచ్చాడు.

ఉలిక్కిపడ్డాను. నిజానికి అదేం గొప్ప సమాధానం కాదు. బతకలేకే చచ్చిపోతారు. కానీ లక్ష్మణ్ అలా సమాధానం ఇవ్వడం కొంచెం ఆశ్చర్యమనిపించింది.

పరీక్షగా అతనివంకే చూశాను. సూటిగా నా వంక చూస్తున్నాడు. అతని కళ్ళు నిర్మలంగా ఉన్నా అందులో కన్నీటి పొర.

దూరంగా ఎక్కడినించో అయ్యప్ప భజన తాలూకు విచిత్రమైన సంగీతం వినిపిస్తోంది.

"నిజం సార్! ఆవిడ బతకలేకే చచ్చిపోయారు. ఎలా అని అడక్కండి. నేను చెప్పలేను. నాకు తెలియదు కూడా. కానీ ఇలా ఏదో అవుతుందని మొదటినుంచీ అనుకుంటూనే ఉన్నాన్నేను."

ఆశ్చర్యంగా చూశాను. ఇతను మా వాళ్ళ ఇంట్లో పనిచేసే మామూలు క్లర్క్. కనీసం వాళ్ళింటి గోడల డిస్టెంపర్ కు, కర్టెన్లకు ఉన్న ఖరీదు కూడా చెయ్యని మనిషి అక్కడివాళ్ళ దృష్టిలో. కానీ మనిషి...

"ఎందుకని అలా అనిపించింది లక్ష్మణ్ నీకు?" కుతూహలంగా అడిగాను.

"చెప్పలేను సార్! కారణం ఆమెగారి పట్ల నా..." ఆగిపోయాడు. ఒక్కసారి రెండు అరచేతుల్లోనూ మొఖం దాచుకుని ఏడ్చేశాడు. ఆశ్చర్యంగా చూస్తూ కూర్చున్నాను. కాస్సేపు ఏడవనిచ్చాను.

ఏడిచే మగవాడి మీద నాకు పెద్ద గౌరవం ఏం లేదు. కానీ లక్ష్మణ్ ఏడుపులో ఏదో తెలియనిది, చెప్పలేనిది అయిన బరువు ఉంది. దుఃఖానికి వైబ్రేషన్ ఉందేమో నా కళ్లలోనూ నీరు తిరిగింది.

మెల్లిగా అతని భుజం మీద చెయ్యి వేశాను.

"ఏడవకు లక్ష్మణ్..... పోయిన పిల్ల తిరిగి రాదు. కానీ పిచ్చిపిల్ల. అనవసరంగా చచ్చిపోయింది. అంత ఆవేశం ఏమిటి ఏం జరిగితే మాత్రం? చాలామంది కన్న తాను ఎంత సుఖంగా ఉన్నది? ఆలోచించుకోవద్దూ!" అన్నాను లాలనగా.

"కాదు సార్" తలకాయ అటూ ఇటూ తిప్పుతూ అన్నాడు. "కాదు సార్... ఎలా చెప్పాలి?" ఎర్రటి పెదవి కొరుక్కుంటూ ఎటో చూస్తూ అన్నాడు.

"సార్... ఆ మల్లెతీగకు వేపకాయ కాస్తే ఎలా ఉంటుంది? నాకు కవిత్వం చెప్పడం రాదు సార్. కానీ అంత అసహజంగా ఉండేది ఉమ బతికి ఉండటం. ఆవిడ... ఆవిడ దేవత సార్. ఈ లోకంలో ఉండకూడదు."

"లక్ష్మణ్!" ఎక్కడినుంచో వసుంధర గొంతు వినిపించింది.

"వస్తున్నానండీ! వస్తాను సార్" అని చటుక్కున లేచి పరిగెత్తాడు.

అతను వెళ్ళినవంకే చూస్తూ కూర్చుండిపోయాను. ఏం పిల్లాడితను? ఇతనికి ఉమ అంటే ఎంత గౌరవం? యజమాని కూతురు మీద ఇంత గౌరవం, ప్రేమ.... చటుక్కున ఆగిపోయాను. ఇతనికి ఉమ అంటే ఉన్న ఆరాధన... ఆశ్చర్యం లేదు. చాలాచోట్ల యజమానుల కూతుళ్ళ

మీద తెలియని మమకారాలు పెంచుకుని చెప్పుకోలేక ఆగిపోయినవారు సృష్టిలో చాలామంది ఉన్నారు. అవి శృతి మించి రాగాన పడి అల్లరి పడ్డవాళ్లూ ఉన్నారు. లక్ష్మణ్ తన స్థాయి తనకి తెలిసినవాడు.

లాన్ లో నడుస్తూ వస్తూంటే కాలికి కుక్కపిల్ల తగిలింది. దాని కళ్ళల్లో తెలియని మమకారం. ఉమ చచ్చిపోయిన నాటినుంచీ అది పాలు సరిగ్గా తాగడం లేదుట. బలవంతంగా పడుతున్నారు చచ్చిపోతుందేమోనని.

'మా ఉమకేమయింది?' అని నన్ను ప్రశ్నిస్తున్నట్లు చూస్తోంది.

మెల్లిగా దాన్ని ఎత్తుకుని ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నాను. చేతిలో కుక్కపిల్ల, లక్ష్మణ్ గురించిన ఊహ... కొంపదీసి అటుదిటు కాలేదు కదా! ఒకవేళ ఉమ లక్ష్మణ్ మీద ఆశలేమయినా పెంచుకుని...

ఛా! ఛా! అది వసుంధర కూతురైతే మాత్రం అలా చెయ్యదు.

ఏమో – చెప్పలేని ప్రేమలు, అనుకోకూడని పరితాపాలు ఇవన్నీ మామూలే. అందులో ఈ రచించే జబ్బు ఉన్న పిల్లాయె....

ఇక మెల్లిగా వసుంధరకు చెప్పి ఇంటికి వెళదామని ఆవిడ గదిలోకి వెళ్ళాను.

ఉమ పెళ్ళి చీరలు.. చాలా ఖరీదు చేసేవిలా ఉన్నాయి – తీసి జాగ్రత్త పెడుతోంది.

"రా అన్నయ్యా! చూశావా ఈ చీరలు? ఒక్కొక్కటి ఐదువేలు. ఇవి చూడు – రెండు మూడు వేలు. ఒక్కసారి కూడా కట్టుకోలేదన్నయ్యా ఏమొచ్చి ఇలా అన్యాయం చేసిపోయింది చెప్పు...? మా ఖర్మ. నలుగురి నోళ్ళలో నానాలని నా మొహాన రాసిపెట్టి ఉంది. మా అత్తగారూ వాళ్ళూ ఏమంటున్నారో తెలుసా? దాన్ని నేను డబ్బు మైకంలో అమ్ముకోడానికి కూడా సిద్ధపడ్డానట. అందుకే ఈ కడుపు శోకంట. అసలే పిల్ల పోయి నేనేడుస్తుంటే..." వెక్కులు పెడుతూ మంచం మీద కూలబడిపోయింది.

నాకు జాలేసింది. దగ్గరకు వెళ్లి తల నిమురుతూ "ఏడవకమ్మా" అన్నాను. ఎవరి జీవితంలోనన్నా ఇలాంటి సంఘటనే జరిగితే మా వసుంధర ఏ మాట అంటుందో నాకు తెలుసు. తన అత్తారు తరపు వారిని అది పెట్టిన రట్టుకు వాళ్ళు బదులు తీర్చుకుంటున్నారు సమయం వచ్చిందని. ఇవన్నీ లౌకిక ప్రపంచంలో మామూలే.

"నేను ఇంక ఇంటికి వెళతానమ్మా!" అన్నాను.

"అదేమిటన్నయ్యా! అప్పుడే నీకు ఇది పరాయి ఇల్లయిపోయిందా? నాలుగు రోజులు ఉండి వెళ్ళు. దాని అత్తారు తరపు వాళ్ళతో ఈయన గట్టిగా మాట్లాడలేరు. మనం పెట్టిన నగలు, ఇచ్చిన కట్నం – వీటి సంగతి మాట్లాడేసుకుంటే బావుంటుంది. ఆ తరవాత తెగవు వ్యవహారాలు. నేను మాట్లాడితే ఈ పరిస్థితిలో నానా ´మాటలంటారు. నలుగురి తరపున పెద్దవాడివి నువ్వే తేల్చి వెళ్ళు."

నేను వింటూ నిలబడిపోయాను.

'వసుంధరా! ఈ ఆస్తి ఇలా పెరగడానికి నీ బుర్ర ఎంత కారణమో ఈ జన్మకు మా బావ గ్రహించలేడు' అనుకుంటూ "సరే" అన్నాను.

వ్యవహారాలూ ముగ్గులోకి వచ్చేటప్పటికి గరుడపురాణాలు, పాపపుణ్యాలు, ప్రేమాప్యాయతలు కలికంలోకి లేకుండా పోయాయి.

రంజిత్ తనకు అత్తవారిచ్చిన కట్నం చెల్లెళ్ళిద్దరికీ పంచే ఏర్పాటు చేశాడట. వాళ్ళ కుటుంబ రాజకీయాలు వాళ్ళవి. ఎవరికీ ఏవీ వదులుకోవడం ఇష్టం లేదు. అరుపులూ, గోలలూ, తిట్లూ, ఒక లెవల్ లో శాపనార్థాలు.

"ఎట్లా అన్నా తగలబడమను. నా పిల్ల నాకు తిరిగి వస్తుందా?" అన్నాడు మా బావమరిది విసుగొచ్చి.

"వాళ్ళకేం తక్కువండీ! నెల తిరక్కుండానే మరొక పిల్లను చేసుకుంటారు. మళ్ళీ ఇంత డబ్బు వస్తుంది. పిల్ల, డబ్బు రెండూ మనకెందుకుపోవాలి? కాస్తా కూస్తానా... నాలుగు లక్షలు... ఆ పైవి పోనే పోయాయి..." ఏడుస్తూనే అన్నది వసుంధర.

నాలుగు లక్షలు అన్నమాట సామాన్యం కాదు. మళ్ళీ మా బావ రంగంలోకి వచ్చాడు. నానా గందరగోళాల తరవాత రాజీకి వచ్చి 3 లక్షలు తిరిగి ఇచ్చేటట్లు, నగలు, వెండి సామాను ఇచ్చేసేట్లు – ఏదో మతలబుకి వచ్చారు.

"ఏమిటీ న్యూసెన్స్? ఉమ లేనప్పుడు దాని డబ్బు తీసుకునే రైట్ వాళ్ళకేముందిట... బార్బరస్ పీపుల్..." అని అరిచింది రమ.

గోడకానుకుని ఈ అరిచేవాళ్లకు మధ్య మధ్య కాఫీ, టీలు సప్లయి చేస్తూ జరుగుతున్నదంతా నిర్లిప్తంగా చూస్తున్న లక్ష్మణ్ ను గమనిస్తూనే ఉన్నాను. నాకెందుకో అతని గురించిన అనుమానం పోవడం లేదు.

"ఏమిటి లక్ష్మణ్ అవతలివాళ్ళు ఇలా మాట్లాడుతున్నారు?" అని పరీక్షగా అడిగాను.

"మీకు తెలియనిది ఏముంది సార్? వీళ్ళందరికీ బస్సులు, కార్లు, ప్లేన్ టిక్కెట్లు బుక్ చేసి అన్ని రకాల మర్యాదలు చేసినపుడు కూడా, టైం వస్తే వీళ్ళు ఇలా మాట్లాడతారని మన అమ్మగారికి, సార్ కు తెలియదంటారా? అందరికీ అన్నీ తెలుసు. ఇదంతే" అని నిర్లిప్తంగా వెళ్ళిపోయాడు.

ఏం మాట్లాడలేకపోయాను నేను.

హడావిడి సర్దుకోగానే ఇల్లంతా పొగమంచు వాలినట్లుంది. రంజిత్ తరపువాళ్ళు వీడ్కోలు తీసుకుని 'వీలైతే మీరంతా మా ఊరు రండ'ని మర్యాదకన్నారు. 'పిల్ల లేకపోయినా మీరు వస్తూ పోతూ ఉండాల'ని వీరన్నారు. ఇంక ఎవరూ, ఎక్కడికీ రారని అందరికీ తెలుసు. ఇదంతా ఫార్మాలిటీ. అంతే.

ఆ రాత్రి నాకు నిద్రపట్టడం లేదు. మెల్లిగా లేచి లాన్ లో పచారీలు చేద్దామని వెళ్లాను. అక్కడ ప్లాస్టిక్ వైరు మంచం మీద దిండు కూడా లేకుండా పడుకున్నాడు లక్ష్మణ్. ఇంట్లో అందరికీ పరుపులు, దుప్పట్లు సప్లై చేసిన అతను ఎలా పడుకున్నాడా అని కూడా ఆలోచించదు వసుంధర.

'ఆ! అంత వెతుక్కోడా ఏమన్నా' అనుకుంటుంది.

వెల్లకిలా పడుకుని ఆకాశంలోకి చూస్తున్నాడతను.

"లక్ష్మణ్! ఏమిటి ఆలోచిస్తున్నావు?" మెల్లిగా మంచం మీద కూర్చుంటూ అన్నాను.

"సార్... మీరీపాటి వేళ.... ఇక్కడ..." గభాల్న లేస్తూ అన్నాడు.

"నిద్ర పట్టలేదు... వస్తుంటే నువ్వు కనపడ్డావు... ఫరవాలేదు... పడుకో" అన్నాను నేను.

సాధారణంగా నేను ఇలాంటి పరిస్థితుల్లో పడను. నాకు లక్ష్మణ్ మీద ఒక రకమైన సానుభూతి ఉంది.

"ఏమిటి ఆకాశం వంక చూస్తున్నావు?"

"ఏం లేదు సార్... ఈ చుక్కల్లో ఎక్కడో మన ఉమగారు చుక్కై కనపడతారేమోనని..." రెండు చేతులూ వెనక్కి పెట్టుకుని ఆకాశం వంక చూస్తూ అన్నాడు.

జాలి వేసింది నాకు. ఈ ఇంట్లో పాత్ర సామానుతో సమానమైన అభాగ్యుడు అర్ధరాత్రి చనిపోయిన ఉమ ఆత్మను చుక్కల్లో వెతుకుతున్నాడు.

"జీవి ఈ పదమూడో రోజు తరువాత భూ ఆవరణాలన్నీ దాటి వెళ్లిపోతుందట సార్. పుణ్యలోకాలకు వెళ్లగలిగినవాళ్లు వెళ్లి కర్మానుబంధాన్ని పట్టి వెనుతిరిగి జన్మ ఎత్తుతారట. కర్మానుబంధాన్ని తెంచుకున్నవారు విముక్తాత్మలవుతారట. ఉమ గారు బహుశా ఒక నక్షత్రమై ఆ నక్షత్రమండలంలో ఎక్కడో ఉండి ఉంటారు సార్..."

లక్ష్మణ్ కళ్లల్లో నీరు. నాకెందుకో తెలియని అనుమానం కలుక్కుమంది గుండెల్లో. నిజంగా కాలం, ఖర్మం కలిసివచ్చి ఈ ఇద్దరూ ఒకరి ప్రేమలో ఒకరు పడి ఈ ఇబ్బందికరమైన పరిస్థితులకు బలైపోయారా?!

"లక్ష్మణ్! ఉమ ఇలా ఎందుకు చేసిందంటావ్?"

"చెప్పాను కదా సార్... బతకలేక. అసలు...."

నాకు తెలుసు ఇప్పుడు అతని చేత మాట్లాడించగలనని. చుట్టూ నిశ్శబ్దత, అతని ఒంటరితనం, ఉమ గురించి భావన – ఇవన్నీ అతనిచేత మాట్లాడిస్తాయి. టాప్ చెయ్యడంలోనే ఉంది ప్రజ్ఞ.

"**లక్ష్మణ్**... ఉమ ఎవర్నన్నా ప్రేమించిందంటావా?"

"ప్రేమా! తెలియదు సార్... కానీ ఆమె ప్రేమించదగ్గ వ్యక్తి ఈ ప్రపంచంలో ఉన్నాడని నేననుకోవడంలేదు సార్"

ఇదేమిటి? ఇదే ప్రశ్నకు రమ నవ్వింది. లక్ష్మణ్ ను అనుమానిద్దామనుకుంటే ఈ సమాధానం ఏమిటి? ప్రేమికుడైనవాడు ఇలా సమాధానం చెప్పడే! తనను తాను తక్కువ చేసుకునే వాడెవ్వడూ ఎదటి మనిషి తనదే అనుకునే నమ్మకం తెచ్చుకోడు. ఇదేదో భక్తుడు దేవత గురించి చెప్పే మాటలా ఉందే!

"ఎందుకని లక్ష్మణ్! ఉమ అంత గొప్పదా?"

నాకే నవ్వొచ్చింది ఈ ప్రశ్నకు.

నా మేనగోడలు, నా ముందు గౌన్లు తొడుక్కుని తిరిగిన పిల్ల – దానికి గొప్పతనం ఆపాదించుకుని ఈ అమాయకుడు దుఃఖపడడం, నేను అడగడం... చాలా బావుంది.

ఈ విషయమే కదిలించినపుడు –

"ఏమో... ముదనష్టపు పిల్ల... తలెత్తుకోకుండా చేసింది. ఏం తక్కువ చేశామని?" అని పంచాంగం విప్పింది వసుంధర.

"ఏమో బావా! దానికేం కావాలని మేమెప్పుడూ ఆలోచించలేదేమో! నాకు ఎంతసేపూ డబ్బు సంపాదన, జాగ్రత్త పడడంతోనే సరిపోయింది. తల్లి చూసుకునేది అంతా. ఏమో... అందరు తల్లులూ అమ్మలు కాలేరేమో" తడి అంగవస్త్రం ముఖానికి అడ్డం పెట్టుకుని స్మశానం నించి రాగానే బావురుమన్న బావ గుర్తుకి వచ్చాడు.

ఏమిటీ ఉమ?! ఎవరికీ అర్థం కానిదా? మన మధ్యే ఉన్నా కొన్ని మనకసలు తెలియనివి ఉంటాయి. ఇన్నాళ్లు దాని గురించి ఆలోచించలేదు. ఇప్పుడు ఒప్పుకోక తప్పదేమో మరి.

"అదంతా నాకు తెలియదండీ! ఆమెతో నేను ఎక్కువ మాట్లాడేవాణ్ని కాదు. చెబితే వినేవాణ్ని. ఆవిడకు, ఈ ఇంట్లో మనుషులకు చాలా తేడా ఉంది సార్. ఎన్నోసార్లు నేను ఉద్యోగం వదిలి వెయ్యాలనుకున్నప్పుడు, ఇంట్లో కష్టాలు భరించలేక చచ్చిపోదామనుకున్నప్పుడు ఆమెగారే నన్ను ఆపారండీ! పరిస్థితుల్ని, మనుషుల బలహీనతలను చూసి నవ్వుకోవడం, ఆ తరువాత క్షమించడం ఆమె నేర్పారండీ. దాంతో నాకు కోపం, అర్థం లేని ఆవేశం తగ్గిపోయాయి సార్. మరీ చీప్ గా ప్రవర్తించేవాళ్లను చూస్తే జాలి వేస్తుంది అంతే! అటువంటి ఉమగారు చచ్చిపోతే నేను నా చేతుల మీదుగా ఇదంతా..." పెదవి బిగపట్టి దుఃఖం ఆపుకున్నాడతను.

అతని కళ్లల్లో నీళ్లు. కానీ, మనసు ఏడుస్తుందని అర్థమైంది నాకు.

"కొన్ని కళ్లతో చూడలేము, సాక్షీభూతాలుండవు. కానీ అనుభవం అవుతుంది" అని వేదాంతులు రాసేది ఇదిగో ఇల్లాంటిదే అయ్యుంటుంది.

నేను ఆలోచిస్తున్నాను – లక్ష్మణ్ కు కనబడిన ఉమ నాకు ఎప్పుడూ అలా కనబడలేదే ఎందుకని? నేను చూశానే కానీ పరిశీలించలేదా?!

కానీ, నాకు వెంటనే ఒక ఆలోచన వచ్చింది. ఇంత చనువున్న మనిషి ఆఖరి క్షణాల్లో లక్ష్మణ్ కు ఏం చెప్పి ఉండదా? అదే అడిగాను.

"లేదు సార్! ఆవిడ ఏం చెప్పలేదు. కనీసం తన బాధ కూడా బయటపడనివ్వలేదు. భలే మభ్యపెట్టారండీ అందర్నీ. బహుశ మేమందరం బాధపడడం ఇష్టంలేదేమో..."

ఇతడితో మాట్లాడి ప్రయోజనం లేదు. విషయం బయటకు రాదు. ఇతనికి ఉమ ఏం చేసినా గొప్పగానే ఉంటుంది.

"ఆ భర్త ఏమిటి లక్ష్మణ్? శవాన్ని పోలీసులకి అప్పగించి నిన్ను కాపలా పెట్టి వెళ్లడమేమిటసలు? కనీస మానవత్వం ఉండద్దూ?"

ఈ మాటతో లక్ష్మణ్ లోపలి మనిషి బయటికు రావాలి. కారణం – అతను అంతగా గౌరవించే మనిషి శవంగా మారేటప్పటికి అలా వదిలేసినవాణ్ని భరించలేక నిజాలు మాట్లాడతాడు.

"తప్పులేదు సార్! అతని పరిస్థితిలో, అతని మనస్తత్వంలో అంతకన్న చేసేది ఏం లేదు."

మౌనంగా ఉండిపోయాను. "పడుకో లక్ష్మణ్ ఆలస్యమైంది" అంటూ లేచాను.

మర్నాడు ఒక్క క్షణం కూడా ఉండబుద్ధి కాలేదు ఆ ఇంట్లో. ఏమిటో గజిబిజిగా ఉంది మనసు. ఈ ఇంట్లో మనుషులకు, వాతావరణానికి దూరమైతే తప్ప బతకలేననిపించింది. నా ఇంట్లో నా భార్యావియోగం నన్ను వంటరివాణ్ని చేసినా వంట కుర్రాడు, తోటమాలితో బోలెడు ప్రశాంతంగా ఉంటుంది. ఈ గోలలేవీ మమ్మల్ని అంటవు. ముఖ్యంగా ఉమను మర్చిపోవచ్చు.

కానీ ఇలా అనుకోవడం ఎంత పిచ్చితనమో తరవాత తెలిసింది నాకు.

3

మధ్యాహ్నానికి మా ఇంటికి నేను వచ్చేశాను.

మూడు రోజుల తరవాత కాబోలు సాయంత్రం టీ తాగుతున్నాను. అప్పటికే ఉమ పోయి 16 రోజులు దాటినట్లుంది.

"ఉన్నారాండీ?" గేటు దగ్గర చప్పుడు చేస్తున్నారెవ్వరో. వాకిట్లోకి వచ్చాను. రామేశం గారు.

"రండి రండి" అని ఆహ్వానించాను.

"ఈ మధ్య వచ్చాను. మీరు లేరు. ఒక ఆట వేద్దామా?"

"ఆ! సలక్షణంగా" అంటూనే ఛెస్ బోర్డు, కాయిన్సు తెప్పించాను. అవన్నీ సర్దుతున్నారు. ఆయన వంకే చూస్తున్నాను నేను.

రామేశం గారి పరిచయం చాలా తమాషాగా జరిగింది నాకు.

"బాబుగారూ!" అని ఒక రోజు పొద్దున్నే పిలుపు వినపడింది. చూద్దును కదా – నీర్కావి పంచ, విభూది రేఖలు, పిలక, ఆజానుబాహుడైన మనిషి సాక్షాత్తు శివుడిలా ఉన్నాడు. చేతిలో పూలబుట్ట.

"ఏం కావాలి మీకు? రండి" అన్నాను.

"ఏం లేదు. ఇవ్వాళ మా ఇంట్లో దేవీ పూజ. అదుగో ఆ నాలుగో ఇంట్లో వెనక షెడ్డులో అద్దెకుంటున్నాము మేము. నా పేరు రామేశం అంటారు. మీ ఇంట్లో మందారపువ్వులు కోసుకువెళదామని వచ్చాను. అమ్మవారిని 'జపాకుసుమ భాసురాం' అన్నారు కదండీ అందుకని"

"దానికేమభ్యంతరం? సలక్షణముగా తీసుకువెళ్ళండి" అన్నాను. బుట్టనిండా పువ్వులు తీసుకుని – "అమ్మవారి ఆశీర్వచనం మీకు ఎప్పుడూ ఉండాలి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ తరవాత మరొకసారి నేనే రమ్మనమని ఆహ్వానించాను. మాటల సందర్భంలో ఆయనకు ఛెస్ ఆడడం వచ్చని తెలిసింది. అప్పటినించీ ఆయనే మా ఇంటికి అప్పుడప్పుడు వస్తూ ఉంటారు. ఏదో పత్రికల్లో వాటిల్లో మంత్రశాస్త్రం గురించి రాస్తూ ఉంటాడట. ఆయనా, ఆయన భార్య ఇద్దరే కాబట్టి తృప్తిగా బతికేస్తున్నారు. పిల్లలు ఎక్కడో ఉద్యోగాల్లో ఉన్నారు.

నా పరిధిలోకి వచ్చేవారెవ్వరూ నాతో అతి చనువు తీసుకోనంతకాలం నేను మంచి స్నేహితుణ్ణే. కానీ ఇంట్లో ఆడదిక్కు ఉండదు కదా అని పనివాడి చేత అతిగా కాఫీలు తెప్పించుకోవడం, నేను లేకపోయినా నా ఇంట్లో జొరబడి పేపర్లు వగైరా చదివెయ్యడం, నా వస్తువులు వాడుకోవడం, లేకపోతే ఇంట్లో బాధ్యతలు తప్పించుకోడానికోసరం రోజులో ముప్పాతిక దినం మా ఇంట్లోనే పడివుండి మా ఇల్లు క్లబ్బుగా ఉపయోగించుకుని నాకు ప్రైవసీ లేకుండా చెయ్యడం – ఇవేవీ భరించను నేను. ఇటువంటి పరిచయస్థుల కన్న వంటరితనమే బాగుంటుంది నాకు. కానీ రామేశం గారు వీటిలో ఏ అలవాటూ లేనివాడు, టైమింగ్ మెయింటేన్ చేసేవాడు, తక్కువ మాట్లాడేవాడు. ఆయనకు కాఫీ అలవాటు లేదు కాబట్టి బాధే లేదు. ఎప్పుడన్నా నా బలవంతం మీద మజ్జిగ తీసుకునేవాడు. కానీ ఈయన కూడా నా రూల్సులో అతి ముఖ్యమైనదాన్ని అతిక్రమించాడు. కానీ దానివల్ల నాకు మరింత చేరువై అయ్యాడు.

నాకున్న నియమాల్లో అప్పు అడగకపోవడం, ఇవ్వకపోవడం ముఖ్యమైనది. ఎన్నో సుఖాలు కాదనుకుని అవసరాలను కూడా మానుకుని పైసా పైసా కూడబెట్టి దాచుకున్న డబ్బు చాలా సులభంగా అప్పు తీసుకునేవాళ్ళంటే భరించలేని కోపం నాకు. అలాగే నేను అడిగే పరిస్థితి నాకు రాకూడదనే పట్టుదల నాకు.

అటువంటి నన్ను రామేశం గారు భార్యను హాస్పిటల్ లో చూపించాలని నాలుగు వందల అప్పు అడిగాడు. నేను ఇరకాటాన పడ్డాను.

"మీరు సందేహించద్దు బాబుగారూ! మీ పరిచయాన్ని ఉపయోగించుకుంటున్నాననుకోకండి. 26 గంటల్లో మీ డబ్బు పూవుల్లో పెట్టి తెచ్చి ఇస్తాను" అన్నాడు.

ఇది మామూలు మాటే... తప్పనిసరై ఇచ్చాను ఆయనను నాలుగు తిట్టుకుని.

మర్నాడు లేదు.. మూడో నాడు ఆయన డబ్బు తీసుకుని వచ్చి ఇచ్చాడు... ఖంగు తిన్నాను. ఆయన కొడుకులు పంపించారా?! ఆ విషయమే అడిగాను.

"లేదు బాబుగారూ! రుణమంటే భయం నాకు. పునర్జన్మల మీద నమ్మకమున్నవాణ్ణి. ఈ రుణం నాకు జన్మబంధం నుంచి విముక్తినివ్వదు... తీసుకోండి" అన్నారు.

నేను మాట్లాడలేదు. ఆ తరవాత ఛెస్ ఆడేటప్పుడు ఆయన చేతికి ఉండే బంగారు ఉంగరం లేకపోవడం చూశాను. అప్పుడే కాదు, మరెప్పుడూ కనపడలేదది.

డబ్బెక్కడినుంచి వచ్చిందో నాకు అర్థమైంది. కానీ, నేనేం మాట్లాడలేదు.

ఇదుగో, మనకు నమ్మకమున్నా ఉండకపోయినా ఈ విధి, కర్మ, రుణం, ఇవన్నీ నమ్మేవాళ్ళతో మనకి బోలెడంత సుఖం. మనకు సేవ చేసి 'కృష్ణార్పణం' అనుకుంటారు. వాళ్లకు మనమేమైనా చేస్తే రుణవిముక్తి అని అణాపైసలతో లెఖ్ఖ తేల్చేస్తారు.

అల్లాంటి ఛాందసుడు రామేశం గారు. అందుకే ఆయనతో స్నేహం కుదిరింది నాకు.

"ఏమయ్యారు మీరు? ఇరవై రోజులుగా అయిపు లేరు?" ఆటకట్టిస్తూ అన్నాడు.

"మా మేనకోడలు ఒక పిల్ల పోయిందండీ!"

"అయ్యో ఎంత పని జరిగింది? చెప్పరేమండీ మరి? ఎలా? ఎప్పుడు? మొన్నీ మధ్యే ఒక పిల్ల పెళ్లి జరిగినట్లుంది. ఇప్పుడు...?"

"ఆ పిల్లేనండీ పోయింది"

"శివ శివా! ఎలా జరిగిందండీ?"

ఆయన గొంతులో ఖంగారు, ఆప్యాయతా – వాటిల్లో నిజాయితీ ఉన్నాయి.

మామూలు పరిస్థితులు, ఆయన మరొక రకం వ్యక్తి అయితే డాక్టర్ సర్టిఫికెట్స్, హార్ట్ అటాక్ – ఇవీ చెప్పేవాణ్ణి. ఆ స్థితిలో ఎందుకో రామేశం గారితో అబద్ధం చెప్పలేకపోయాను. పైగా, ఆయన స్కాండల్ మాంగర్ కాదు. నిజాయితీపరుడు.

మెల్లిగా అక్షరం, అక్షరం ఆలోచించి చెప్పాను జరిగిన విషయం.

"అయ్యో పాపం! పిచ్చిపిల్ల. బతకలేక చచ్చిపోయి ఉంటుంది బాబుగారూ!"

ఒళ్ళు మండింది నాకు. ఎవర్ని చూసినా అదే మాట. బతకలేకపోవడమేమిటసలు నాన్సెన్స్! శుభ్రమైన తల్లీ తండ్రీ, బోలెడంత ఆస్థి, స్థితిపరుడు – హోదా గల మొగుడు, ఏది కావాలంటే అది తెచ్చిపెట్టే మనుషులు – ఏంగాదని చచ్చిపోవడానికి! ఏం తక్కువైందని?!అదే ఛడామడా బైటికి అనేశాను రామేశం గారితో.

"బాబుగారూ! మీ దృష్టిలో అత్యంత విలువైనవి ఆ అమ్మాయికి లెఖ్ఖలో లేనివి కావచ్చు. ఇన్ని లౌకిక సుఖాలను వదులుకుని చచ్చిపోయిందంటే, ఆ బిడ్డ ఎంత బాధపడిపోయిందో? పసిపిల్ల అయినా చాలా తెలిసింది అయి ఉంటుంది"

నాకు మళ్ళీ కోపం వచ్చింది. పసిపిల్లట... చాలా తెలిసిందై ఉంటుందట. లక్ష్మణ్ అదే మాట, ఏమీ తెలియని ఈ పిలక శాస్త్రుల్లు అదే మాట. నా మేనగోడలు సుఖంగా కాలేజీకి వెళుతూ హాయిగా చదువుకుంటున్న పిల్లకు అనవసరమైన గొప్పతనాలు, లేనిపోని త్యాగాలు ఆపాదిస్తారేమిటి?

"ఏమీ కాదు! ఒళ్ళు పొగరుతో చచ్చిపోయుంటుంది" కసిగా అన్నాను.

"బాబుగారూ!" కుర్చీ ఒక్కసారి తోసి నిలబడుతూ అన్నారాయన. ఆయన మొహంలో అంత కోపం ఈ నా రెండేళ్ళ పరిచయంలోనూ చూడలేదు.

"ఏం మాట్లాడుతున్నారు మీరు? ఆత్మగౌరవానికి దెబ్బ తగిలినప్పుడు ప్రతిఒక్కటీ గరికపోచ కన్నా విలువలేనిదిగా కనపడుతుంది. నీకు తెలుసా బాబుగారూ.... ఆటలాంటి పరిస్థితిలో మనం ఏం చేస్తున్నామో మరొకరికి అర్థం కాదు. నేనెవర్నో తెలుసా? ఒకప్పుడు ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ని. కేవలం ఒక కేంద్రమంత్రితో వచ్చిన తగవుతో ఆ క్షణాన రిజైన్ చేసేశాను. కారణం? నన్ను ఒక నేరానికి సాక్ష్యాధారం లేకుండా చెయ్యడం కోసరం ఫైలు మాయించెయ్యమన్నారు. అది భయంకరమైన నేరం. దేశపు ఆర్థిక, నైతిక వ్యవస్థలనే కూల్చివేసే నేరం. నేను ఉద్యోగం చేసే నా గవర్నమెంటు అనే యంత్రాంగంలో ఒక ముఖ్యమైన తుప్పు మేకు మూలంగా దేశమే, దేశ క్షేమమే కదిలిపోవడం భరించలేని నేను ఆయన నేరం బయటపెట్టి రిజైన్ ఇచ్చాను. నా జీతం ఆ కాలంలోనే రెండు వేలు. ఈ మీ లెక్కల ప్రకారం 6-7 వేల జీతం ఉండి ఉద్యోగం చేసుకుని ఉండచ్చు. కానీ ఎదురు తిరిగానని ఆ మంత్రి గారు నన్ను నానా బాధలూ పెడతాడనీ తెలుసు. నా దేశం కోసం ఎదురు తిరిగిన నన్ను ప్రభుత్వానికి ద్రోహం చేసినవాడిగా జమకట్టింది ప్రభుత్వం. ఆశ్చర్యం కదూ? అందుకే స్వతంత్రుడిగా వచ్చేశాను. ఆ తరవాత నేను పడ్డ ఆర్థిక న్యూనత మీకు తెలియదు. అయినా ఎంత దుఃఖంలోనూ, కష్టంలోనూ కూడా నేను చేసిన పని తప్పని నా కంఠం మీద కత్తి పెట్టినా ఒప్పుకోను. నా ఆత్మగౌరవం ముందు ఆ ఉద్యోగం తృణప్రాయం"

కాలరుద్రుడిలా ఉన్నాడాయన. కళ్ళు ఎర్రబడిపోయినాయి. అవాక్కైపోయాను నేను. ఏం మనిషి ఈయన? ఏనాడూ ఈ విషయం చెప్పలేదు నాకు. ఆయన చదువు ముందు, హోదా ముందు నేనెంత! నా కళ్ళల్లో భీతి, ఆశ్చర్యం ఆయన గమనించినట్లున్నారు – కొంచెం చల్లబడ్డారు.

"కాబట్టి బాబుగారూ.... సులభంగా మాటలు అనెయ్యకండి. అడ్జెస్ట్ అయిపోయి ఉండచ్చు, గాడెక్కి ఎదురు తిరుగుతారు – లాంటి మాటలన్నీ ఒడ్డున ఉన్నవాళ్లనేవి"

నేనేం మాట్లాడలేకపోయాను. ఏనాడూ నేను పరిశీలించినంత మేరలో ఉమలో ఆత్మగౌరవం బైటపడటం చూడలేదు. ఇంకా రమ కాస్త కజ్జాకోరుది. అనుకున్నవి అయ్యేదాకా నిద్రపోయేది కాదు. కానీ మరి ఉమ చేసింది ఈ పని?

ఛెస్ బోర్డునే తీక్షణంగా చూస్తున్నారు రామేశం గారు.

"ఇవ్వాల్టికి ఎన్నో రోజు?"

"పదహారు"

ఏదో లెక్కలు కట్టారు.

"అమ్మాయి పోయిన తిథి?" మళ్ళీ ఆయనే లెక్క కట్టారు. ఆలోచించారు. వేళ్ళు చాపారు. ముడిచారు. నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను. ఏమిటీ మనిషి?

"జాతకరీత్యా అమ్మాయికి మారకం రోజులే బాబూ! కాస్త ముందుగా ఈ జాతకం తెలిసినా ఈ ప్రయత్నం తప్పించగలిగేవాళ్ళమేమో! కానీ? విధి!" రెండుచేతులూ కట్టుకుని కళ్ళజోడు నుంచి సూటిగా చూస్తూ అన్నారు ఆయన.

నాకు మతిపోయింది. ఏమిటి ఈయన ఉద్దేశ్యం? మృత్యువుని తప్పిద్దామనా? అసలు ఆ మాటేమిటి? కొంపదీసి ఈయన పిచ్చివాడు కాదుకదా? ఏముందీ! ఇంటలెక్చువల్ కెపాసిటీలు, పనికిరాని పరిజ్ఞానాలు ఎక్కువైనా పిచ్చివాళ్లే అవుతారు. వాళ్లకి వాళ్ళు ఉపయోగించరు. మరొకరికి బాధ కలిగిస్తారు. కానీ కాసేపు ఈ అహంభావితో ఆడుకోవాలనిపించింది.

"ఏం చేసేవారు రామేశం గారూ ముందుగా తెలిస్తే?"

మెల్లిగా తలెత్తి సూటిగా చూశారు ఆయన.

"ఈ మృత్యుఘడియలు తప్పించగలిగేవాళ్ళమేమో! అంతా ఆ తల్లి దయ ఉంటే... ఆ తరవాత పద్దెనిమిదేళ్లు ఢోకా లేకుండా బతికేది"

నాకు అరికాలు మంట నెత్తికి వచ్చింది.

"ఎలా?" కోపం అణుచుకుంటూ వ్యంగ్యంగా అడిగాను.

"ఎలా అంటే... ఆ ఆ సమయాల్లో సరిగ్గా లేని గ్రహాలకు శాంతి చేసి దేవిని ప్రసన్నురాలిని చేసుకుని ఆ కృపతో ఆపగలిగేవాళ్ళమేమో కానీ కాలేదుగా.." ఆ గొంతులో నిస్పృహ.

సందేహం లేదు. ఈయనకు పిచ్చన్నా ఉండాలి లేదా నేను పిచ్చివెధవలాగా కనబడన్నా ఉండాలి.

అయినా నేను వదలదలుచుకోలేదు.

**"బాబుగారూ!** గ్రహాలూ అవీ ఆకాశంలో రూపుదాల్చి, పీటం వేసుకుని కూర్చుని ఏదీ... ఈ మనుషులిచ్చే తర్పణం కోసరం, నైవేద్యాల కోసరం ఎదురుచూస్తూ ఉంటాయంటారు. పోనీ, కాసేపు అదీ నిజమేననుకుందాము. కానీ ఒక్కొక్క గ్రహం ఒక్కొక్క మనిషి పన్లే చూస్తూ ఉంటే, మిగతా జనాభా గతి ఏమిటిట?! అది సరే... ఒక్క ఇండియాకేనా ఈ నమ్మకాల పీడ?! ప్రపంచంలో ఇవన్నీ ఏమాత్రం నమ్మని గాంగు శుభ్రంగా బతికేస్తున్నారే? వాళ్ళను ఈ గ్రహాలేం చెయ్యవా? బావుంది మీరు చెప్పేది. సమయం వచ్చింది. చచ్చిపోయింది. ఎటొచ్చీ బలవంతంగా పోయింది. అదే కాస్త బాధ... అంతేకానీ, మృత్యువునే మీరు ఆపగలిగితే బాబుగారూ మీ ఇల్లు తిరణాల అయ్యేది. ప్రపంచంలో చావు తప్పించుకుందామనుకోనివాడు లేదు. ఈ పిచ్చి మాటలు నాకు

చెప్తే చెప్పారు కానీ, ఇంకెవరి దగ్గరా అనకండి" నిర్మొహమాటంగా నాకు అనాలనిపించిన నాలుగూ అన్నాను. నాకేం భయం...? అంతగా అయితే రేపటినించీ రాడు ఆయన. అంతే!

కానీ ఈ మాటలకు ఆయన బాధ పడినట్లు లేరు. నా వంకే చూస్తున్నారు. ఆ కళ్ళల్లో భావం చూడగానే నాకు మరీ మండిపోయింది. ఏదో కుర్రకుంక అల్లరిని తల్లి సహించినట్లు, పేద్ద హైనా ఉడతపిల్లను చూసినట్లు చూస్తున్నారు. నాకు చిర్రెత్తినట్లైంది. ఏదో అనబోయేటంతలో–

"శంకరం గారూ! మీరు నాస్తికులా?" మెల్లిగా అడిగారు.

"అంటే?"

"దైవశక్తి నాస్తి అనుకుంటున్నారా?"

మాట్లాడలేదు నేను. ఏమనాలి? అప్పుడప్పుడూ తిరుపతీ అదీ వెళ్ళొస్తుంటాను. శనివారం ఒకపూట ఉపోషం ఉంటాను. మా ఆవిడ బ్రతికున్న రోజుల్లో సత్యనారాయణ వ్రతం అదీ చేసేవాళ్ళం. ఇప్పుడు అప్పుడప్పుడు దేవుడి గొడుగులనీ, అయ్యప్ప భజనలనీ ఏదో వచ్చినప్పుడల్లా ఐదో, పదో దానం చేస్తూనే ఉంటాను.

ఈ ప్రశ్న నన్ను ఇంత ఇరకాటాన పడేస్తుందనుకోలేదు నేను. నన్ను నేను ఎప్పుడూ ఈ ప్రశ్న వేసుకోలేదు.

"చెప్పండీ?" ఆయన గొంతు ఖంగుమంది.

"కాదు... అవును. రెండూనూ"

"అంటే?"

"అంటే నేను ఏదో శక్తి ఉందని నమ్ముతాను. అంతేకానీ..."

"అంతేకానీ?"

"దాని చేతుల్లోనే అంతా ఉందని అనుకోను. దానికి ఒక ఊహ కల్పించి మనం మన ఊహగా చూసి, మరొకడూ మరొకటిగా చూసి, పైత్యంలో పడి... ఇవన్నీ నేను నమ్మను."

"మరి అది మన శక్తే. దైవం ఎందుకు మధ్యన"

నిజమే! ఎందుకు? నేను ఆలోచిస్తే బలహీనమైపోతానని,

"అన్నీ మన చేతుల్లో ఉన్నాయనుకోను నేను. కొన్ని కొన్ని సమయాల్లో మన ప్రయత్నాలు వ్యర్థమవుతాయి. అప్పుడు విధి ఒకటి ఉందనిపిస్తుంది."

"అది సరే, మరి అది విధి అయినప్పుడు ఇంక దాన్ని గురించి ఆలోచించంగా. అది మార్చడానికి ప్రయత్నం కూడా చెయ్యం. అప్పుడు ఈ నమ్మకాలు, మొక్కుబళ్లు, జాతర్లు – ఇవన్నీ అజ్ఞానుల వంతు గానీ మనకెందుకుట" రామేశం గారు నవ్వు దాచుకుంటూ అన్నారు.

నాకు మండింది.

"అలా కాదు... నా చేతుల్లో లేదు ఈ పని, విధికి  అనిపించినప్పుడు దేముదు జ్ఞాపకానికి వస్తాడు. ఏదో మొక్కుకుంటాము. అహ... మొక్కుకున్నంత మాత్రం చేత అవుతుందనీ, ఈ రాతిబొమ్మలు వింటాయనీ కాదు. అదొక ఆత్మస్థైర్యం ఇస్తుంది. దానితో మనకు కొత్త ధైర్యం వస్తుంది. మన పని సులువవుతుంది. ఇంతకన్న దేవుడి గురించి కన్సెప్షన్ ఇంకేం లేదు" తేల్చిపారేస్తూ అన్నాను.

అమ్మయ్య. ఇలా చెప్పగలగడం వల్ల నా ప్రాణం ఎంతో హాయిగా ఉంది. అయినా కొన్ని కొన్ని ప్రశ్నలు మనని మనం ప్రశ్నించుకోం ఎప్పుడూ. ఆచరిస్తాం. అర్థం ఆలోచించం. వాచీ ఎడం చేతికే ఎందుకు పెట్టుకోవాలి? అన్నం కుడిచేత్తోనే ఎందుకు తినాలి? ఇవన్నీ ఎలాగో దేముడిని ఎందుకు నమ్మాలి అన్న ప్రశ్న కూడా నా వరకూ అంతే మరి.

"కాబట్టి మన చేతుల్లో విషయం లేదని ఒకటి ఒప్పుకున్నారు. మీరు మాట్లాడే విధిని దారి మార్చగల దైవం లేదా నమ్మకం ఒకటుందన్నారు. అంతవరకూ నిజమేనా?!"

"నేను దైవం ఉన్నాడనడం లేదు. ఆ ఆలోచన నాకు ధైర్యాన్నిస్తుందంటున్నాను" మొండిగా అన్నాను.

"అంటే లేనిది ఉందని ఆత్మవంచన చేసుకుంటున్నారన్నమాట. మరి ఈ రాముడి ఫోటో, ఈ హనుమంతుడి ఫోటో – ఇవన్నీ ఏమిటిట?"

అటు చూశాను. నిజమే. రాముడి ఫోటో ఇంట్లో ఉంటే శాంతి అని మా ఆవిడ ఉంచిందది. ఆవిడ పోయిన తరవాత కూడా అలాగే ఉంచేశాను. అదెందుకందో ఆ మాట?! హనుమంతుడి పటం అంటారూ...? ఒంటరిగా ఉంటాను. ఏదో గాలి, ధూళీ ఇవన్నీ రాకుండా వాయుపుత్రుడు కాపాడతాడంటారుగా. అందుకని రాముడి  హనుమంతుడున్నాడనుకోండి. అయినా విడిగా ఉంటే కొంచెం పవర్ ఎక్కువ ఉంటుందని... కానీ ఈ మాటలన్నీ బైటకు అంటే ఈ రామేశం గారు ఆత్మవంచన అంటారు. ఎలా?

"తీసెయ్యండి ఆ ఫోటోలు. పోనీ నేను తీసెయ్యనా?" గభాల్న లేస్తూ అన్నారు.

"అయ్యో వద్దండీ. అవి ఇప్పటివి కావు" గబుక్కున లేస్తూ అన్నాను. ఈ ముసలాడు అసలే తిక్కమనిషి కూడా.

"ఏమిటండీ ఆ ఖంగారు! ఆఫ్టాల్ అవి కాలెండర్ బొమ్మలండీ. మీరు ఫ్రేం కట్టించారు కాబట్టి పటాలయ్యాయి. మూడు రూపాయలు పెడితే మళ్ళీ దొరుకుతాయి..." లేస్తూ అన్నారు.

"అది కాదు... అది నేను రోజూ దణ్ణం పెట్టుకునేది..."

"అంటే దేనికి దణ్ణం? ఈ కాలెండరుకా? పోయిన సంవత్సరం ఈ బొమ్మలు వేసిన కంపెనీ వాళ్ళు, ఈ సంవత్సరం అర్ధనగ్న సుందరిని వేశారు. కాబట్టి ఆర్టిస్టులోనో, కాలెండరులోనో దేముడు లేడు. మరి మీ పూజ ఎవరికట?"

"నాకు నమ్మకమున్న అజ్ఞాత శక్తికి!"

"అంటే అది వచ్చి ఈ కాలెండరులో కూర్చుంటుందా?"

"నా వరకు అంతే" మొండిగా అన్నాను.

"దానికేం పనిలేదా? ప్రపంచం మొత్తం వదలి మీ కాలెండర్లో కూర్చుని మిమ్మల్ని రక్షించడమేనా?"

"ఏమో! నాకు మొక్కుకుని వెళితే అనుకున్న పని అవుతుంది. అంతే!"

"ఓహో! అంటే మీ దృష్టి ప్రకారం సృష్టిశక్తో, అజ్ఞాత శక్తో ఏదో ఎంత చీపంటే – మీ మాటలు విని, మీ కోరికలు ఎట్లాంటివైనా సరే తీర్చి మీ కొబ్బరికాయలు, మొక్కుబడులు ఆస్వాదించి, మిమ్మల్ని రక్షించి, మీ వెనుకాలే వచ్చి మీ పనులు చేసి పెడుతున్నదన్నమాట. ఇదేనా భగవంతుడంటే మీ కన్సెప్షన్?" ఆయన మాటలు మంచు కత్తి ఝుళిపిస్తున్నట్లున్నాయి.

"అలా అంటే ఏమో కానీ...." అయోమయంలో పడుతూ అన్నాను నేను.

మా బామ్మగారు చిన్నప్పుడు ఊరు వెళ్ళి వస్తే చాలు – రాసులు కొద్దీ వండి నైవేద్యం చేసేది. ఎందుకంటే, తనంత శ్రద్ధగా ఎవరూ పెట్టకపోవడం వల్ల దేముడు పస్తు పడున్నాడట. ఇలా తింటూ పోతే పాపం ఆ దేముడి గతి?! నవ్వొస్తుంది నిజమే. కానీ, నేను చేస్తున్న పని మాత్రం?!

"మీకన్న నాస్తికులు కోట్ల రెట్లు నయం శంకరం గారూ! వారి సంఘర్షణలో, పట్టుదల్లో, మూర్ఖత్వాన్ని ఎదిరించి మూఢనమ్మకాలను ఎదుర్కొనే ప్రయత్నంలో నాకు సర్వేశ్వరుడు కనపడతాడు. మీరేం చేస్తున్నారో, ఎందుకు నమ్ముతున్నారో మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోకుండా, సనాతనత్వం కింద తల దాల్చుకుని దణ్ణంపెట్టి యాచించుకోవడం వక్కపొడి తిన్నంత సులభంగా అలవాటు చేసుకున్న మీకన్న వాళ్లంటేనే ముచ్చట నాకు. నాకు తెలిసిన భగవంతుడు తప్పకుండా ఇక్కడ లేడు. వాళ్ల ప్రయత్నాలలోనూ, అన్వేషణలోనూ, తెలుసుకునే జ్ఞానంలోనూ ఉన్నాడు" ఆయన గొంతులో ఆవేశం పదును తేలింది.

నాకు అంతా అయోమయం అయిపోయింది. ఏమిటిదంతా? ఈయనేమిటి? ఈయన వాదనేమిటి? ఎటు ఈడుస్తున్నాడు నన్ను? అయినా, ఉమ గోలంతా వదిలి ఇదేమిటి?

"అరిషడ్వర్గాలను అరికట్టుకోడానికి, పాపాన్ని పెరగనీయకుండా ఉండటానికి, సాధించే పని మీద ఏకాగ్రత కుదరడానికి, నీలో కొంత ప్రక్షాళన కలగడానికి ఏర్పడినవి ఈ ముడుపులు, జాతర్లు, నియమాలు. ఒకసారి సర్వేశ్వరాన్వేషణలో పడ్డ వ్యక్తి ఒక్కొక్క బంధాన్నే ఛేదించుకుంటూ పై మెట్టుకు రావడానికి ఏర్పడినవి ఈ శమదమ నియమాదులు. అంతే కానీ, ఏదో ఎగ్జిబిషన్ చూసొచ్చినట్లు దేవాలయానికి వెళ్లి రావడం, ఏ అయ్యప్ప దర్శనానికో నలభై రోజులు నియమంగా ఉండి వెళ్లి వచ్చి విస్కీ బాటిల్స్ ఓపెన్ చెయ్యడం, తద్వారా ఇన్ని ఔన్సుల పుణ్యం మూటకట్టుకున్నామని ఆత్మవంచన చేసుకోవడం – ఇదంతా ఏమిటంటే... భగవద్గీత తల కింద పెట్టుకుని నిద్రపోయి మోక్షాన్ని కోరుకోడం లాంటిది. ఇదంతా అహం సంతృప్తి పడటానికి. అంతే."

"ఇంతకీ ఏమంటారు మీరు?" నాకు మాడున తపీతపీల్మని నూనె అంటినట్లుంది.

"నేనేమంటాను అన్నది కాదు ముఖ్యం. నేనెప్పుడూ ఒకటే అంటాను. మీరేమంటారు అన్నది ముఖ్యం. ఆలోచించుకోండి బాగా. ఆలోచిస్తే – మీరు ఆచరించే ఆచారాలు, మీరు మొక్కుకునే మొక్కుబళ్లు, మీ దిక్కుమాలిన ఊహల్తో రూపొందించే భయంకర మూర్తి – ఇవన్నీ మీకే అర్థమవుతాయి. వస్తాను. టైం అయింది" మెల్లిగా లేచి పై ఉత్తరీయం దులుపుకుని వెళ్ళిపోయారు ఆయన. అటే చూస్తూ కూర్చున్నాను నేను.

4

ఆ తరువాత వారం పదిరోజులు నేను ఆలోచిస్తూనే గడిపాను. నాకు ఏదో తెలిసీ తెలియని స్థితి. రామేశం గారు మొత్తానికి నాలో ఏవో మూసివున్న తలుపును బలవంతంగా తోసి తెరిచి వెళ్లిపోయారు.

ఒక మధ్యాహ్నం ఎవరో తలుపు కొడుతున్నారు. నాకు తెలియకుండానే అంతర్గతంగా రామేశంగారి రాక కోరుకుంటున్నాను. అందుకే గభాలున లేచి తలుపు తీశాను.

ఉప్పెనగాలిలా ఒకామె, ఆమె వెనక ఎవరో వ్యక్తి లోపలికి వచ్చారు.

ఆమె చేతిలో ఉమ ఫోటో ముఖపత్రంగా ఉన్న 'ఈతరం' తెలుగు వీక్లీ ఉంది.

ఆవిడే చొరవగా లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుని పరిచయాలు ప్రారంభించేసింది.

అతను 'ఈతరం' పత్రిక సంపాదకుడు. పేరెన్నికగన్న రచయిత, జర్నలిస్ట్... పేరు రాఘవట. ఆమె శ్రీమతి సుధా రాఘవ. మాట్లాడ్డానికి ఏం లేనట్లు అతను పొడిపొడిగా మాట్లాడుతున్నాడు.

కానీ ఆమె మాత్రం చాలా గట్టిది.

నమస్కారాలు, పరిచయాలు అవగానే ఆవిడ అసలు విషయానికి వచ్చేసింది.

ఉమ కథలను, కవితలను ఎక్కువగా ఎంకరేజ్ చేసేది అతని పత్రికేనట. ఆమె కథలకు ఎక్కువగా బొమ్మలు అవీ వేసిన ఆర్టిస్టు విరించిట. అతను, రాఘవ ప్రాణస్నేహితులు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ ఉమ చనిపోయిన పదిహేను రోజుల తరవాత ఉమ రాసిన ఆఖరి ఉత్తరం... అదీ విరించికి రాసింది తీసుకుని అతను రాఘవ దగ్గరకు వచ్చాడట.

"ఏమిటీ? ఉమకు, అతనికి కొంపదీసి ఏమైనా...?" అడగలేక అడిగాను ఆ ప్రశ్న.

"అలా అయినా బావుండిపోను. వాళ్ళిద్దరు కలిసి ఏమయ్యేవారో... బ్రహ్మచారి... అతనిదేముంది? అదికాదు విషయం" గబగబా అంది ఆమె.

"మరి?" అనుమానంగా అడిగాను.

కాస్సేపు మాట్లాడలేదామె. ఏదో చెప్పలేకపోతోంది. నేను రాఘవ వంక చూశాను. అతను చటుక్కున లేచి వెళ్లి కిటికీ దగ్గర నిలబడి బైటకు చూడటం మొదలుపెట్టాడు.

నాకు ఒళ్లు మండింది. ఇదుగో ఈ భావుకుల ముఠా అంటే నాకందుకే కోపం. విషయం ఎంత పెద్దది? చర్చ ఏమిటో ఇంకా తెలియదు. ఎదటివాళ్ళ భావాలు వాళ్ళకనవసరం – వాళ్ళ భావుకత బాధ తప్ప. ఆ కిటికీలోంచి ఏమీ కనబడదు – ఎండిపోయిన చెట్టు, మబ్బుల్లేని ఆకాశం తప్ప. అయినా అతన్నేమీ అనే పరిస్థితి కాదు కాబట్టి.

"మీరు చెప్పండి రాఘవా..." నేనింకా మాట పూర్తి చెయ్యనేలేదు.

"నేనే చెబుదామనుకుంటున్నాను శంకరం గారూ! ఆ ఉత్తరాన్ని బట్టి..."

"ఊ...!"

"ఆమె నన్ను గాఢంగా ప్రేమించారనీ, నన్ను దూరం చేసుకుని బతకలేక చనిపోయారనీ వీళ్ళు అర్థం చేసుకుని రభస చేస్తున్నారు"

ఒక్క క్షణం నాకు నోట మాట రాలేదు.

ఏమిటీ కొత్త ట్విస్ట్? అతనివంక పరీక్షగా చూశాను. ఈ ముప్పావుగంట నించీ అతను నాకు సుధారాఘవ గారి భర్తగా దర్శనమిస్తున్నాడే కానీ ఒక ప్రత్యేక వ్యక్తిగా, అందులో మా ఉమ ప్రేమించదగ్గ వ్యక్తిగా కనిపించడం లేదు. అయినా ఈ ప్రేమ అనేది పైత్యప్రకోపం లాంటిది. దానికి అర్థమేం లేదు. సరే... ఈ గందరగోళమేమిటసలు?

"మీకు, ఉమకు అంత పరిచయం ఉందా?" సూటిగా అడిగాను తేరుకుని.

అతను ఏదో మాట్లాడబోయాడు.

"ఆ విషయం నేను మొదట అడిగానండీ. ఆయన ఒక ఎడిటర్. ఆమె పత్రికకు వచ్చి కథలూ అవీ ఇచ్చేవారట. అప్పుడప్పుడూ ఏదో రచయితల మీటింగ్స్ లో కలుసుకునేవారట. సహజంగా పరిచయమవుతుంది కదా! పైగా ఆవిడ కథలు, భావాలు అవీ బావుంటాయని ఈయన మెచ్చుకుని ఎంకరేజ్ చేసేవారట. ఇదంతా పత్రికల వాళ్లకు సహజమేనండీ. అంతమాత్రం చేత ఆ పిల్ల ఇలా పైత్యాన పడితే ఎలా?"

ఓరగా అతణ్ణే చూస్తూ అంది ఆమె. అతని వంక చూశాను. జవాబు చెప్పే స్థితిలో లేడు.

ఉమ ఇంత బలహీనురాలా? ఇదే నిజమైతే, ఈ కాలం పిల్లలకు చదువు గట్రా ఇవన్నీ మాన్పించి అంట్లు తోమించడం రైటు. పనిమనిషి ఖర్చంనా తప్పుతుంది. సుధారాఘవ గారి చెప్పుచేతల్లో ఉన్నట్లు కనబడుతున్న ఈ వ్యక్తిని ప్రేమించి ఉమ అంత డ్రమటిక్ గా ఆత్మహత్య చేసుకున్నదంటే, నాకు ఒక్కసారిగా ఆడజాతి మీదే సానుభూతి పోయింది. పైగా అతను తెలియదు మొర్రో అంటుంటే.

"అసలు ఈ విరించి ఎవరు?"

"ఈయనా, అతనూ ప్రాణస్నేహితులు లెండి. ఇదుగో ఈయనకు ఆఫీసు, ఆ తరువాత అతని గది – ఇవ్వే జీవితం. మా ఆయనే అతనికి ఉద్యోగం ఇప్పించింది కూడా! కూరలు తేవాలన్నా, సరుకులు తేవాలన్నా అదుగో అతను తోడు. ఆ పెద్దమనిషి నిన్న సాయంత్రం మా ఇంటికి వచ్చి 'నువ్వే కారం ఆమె చావుకు' అంటూ ఈ ఉత్తరం చూపిస్తే ఏమనాలి చెప్పండి?"

కొంగుతో విసురుకుంటూ అంది సుధారాఘవ. ఆమెది కొంచెం స్థూలకాయమేమో ఫాన్ గాలి సరిపోవటం లేదు.

హతోస్మి. మరీ పెళ్ళాం మాటలు విని కూరల సంచీ మడిచి, సరుకులూ అవీ మోసుకొచ్చే మనిషిని సుకుమారంగా, నాజూగ్గా అమెరికన్ జార్జెట్టు చీరలు అవీ కట్టుకుని ఉండే మా ఉమ ప్రేమించిందా?

ఏం... ప్రేమికుడు కూరలు తేకూడదని ఉందా? తెలుగు సినిమా హీరోలా చొక్కా నలక్కుండా కూలీ చేసినట్లు కనబడాలని ఉందా? అతనికి మాత్రం ఆకలి, అవసరాలు ఉండవా? నా మనస్సు ఎదురు తిరిగింది.

ఏదైనా ఈ ప్రేమ గురించి నాకు తెలియదు. ఇంక ఇప్పుడు తెలుసుకోవాలని కూడా లేదు.

"ఇప్పుడేమిటంటారు?" ఆలోచిస్తూ అడిగాను.

"అయిందేదో అయిపోయింది. మీ పిల్ల మీకు తిరిగి రానే రాదు. జరిగినదానికి ఆమె మొండితనం తప్ప తగిన కారణం కనిపించడం లేదు. ప్రేమించడానికి ఆవిడ ఇష్టమేనా? అయినా, ప్రేమించేటప్పుడు తెలియదా ఆయనకు పెళ్లైందని?! మా పెళ్ళై పదిహేనేళ్ళు బాబుగారూ... ఈ పత్రికలో ఉదోయగం రాకముందు ఈ మనిషితోనూ, ఈయన ఊహాలోకాల్తోనూ నేను పడిన యాతన అంతా ఇంతా కాదు. ఊహలు అన్నం పెట్టవు కదండీ! మా పుట్టింటినించి డబ్బు తెప్పించుకుని ఇల్లు ఎంత గుట్టుగా గడిపానో ఆ పరాత్పరుడికి ఎరుక. ఏదో ఇప్పుడు కాస్త పచ్చగా ఉన్నాము. ఈ మనిషి కాస్త నిలకడగా ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇప్పుడీ అనవసరమైన దుమారం రేగిందంటే ఈ కాస్త ఉద్యోగం కూడా..."

ఏదో చప్పుడైంది.

తలుపు సిన్నితంగా మూసుకుంది. పత్రిక పట్టుకుని బైటకు అడుగుపెట్టాడు రాఘవ.

"ఎక్కడికీ?" దీర్ఘం తీస్తూ అడిగింది.

"సిగరెట్టుకు" వెళ్ళిపోయాడు.

మిగిలిన ఇద్దరం కొంచెంసేపు మాట్లాడుకోలేదు.

"ఊఁ! చెప్పండి..." అన్నాను నేను.

ఇదేదో తేలిపోతే బావుండునని ఉంది నాకూ!

"అసలు మా ఆయనకు ఈ ప్రేమలూ వగైరాలు తెలుసనీ నేననుకోను. అందుకని ఇప్పుడు మళ్ళీ ఈ విషయం తీగ లాగితే డొంక కదిలినట్లు బైటకు పొక్కకుండా ఉంటే మీకూ మంచిది, మాకూ మంచిది" తేల్చి చెప్పేసింది.

అంత టెన్షన్ లోనూ నాకా మనిషిని ఏడిపించాలనిపించింది.

"అదేమిటండీ! ఆంధ్రదేశం అంతా అలజడి కలిగించిన వార్త మీరూ, నేనూ కాదంటే ఆగుతుందా! బైటకు రాక తప్పదు."

కానీ ఆవిడేం భయపడలేదు.

"అందుకనే విరించిని పట్టుకుని ఆ ఉత్తరం తీసేసుకోండి. దానితో ఆ కాస్త ఆధారం పోతుంది."

ఒక్కసారి ఆవిడను సూటిగా చూశాను – ఈ ఆడవాళ్ళలో లౌక్యం ఎంత ఉంటుందా అని. ఈ మనిషికి సమాధానం చెప్పుకుంటూ, సంసారం చేస్తూ, సినిమాలకు తీసుకువెళ్తూ జీవితం గడపడం అంటే ఏ బిజినెస్ లైన్ లో ఉన్నవాడికో తీరును కానీ, భావనా జగత్తులో ఉండేవాళ్ళకు బాధే పాపం. ఈవిడకూ బాధే ఒక రకంగా.

"నాకు విరించి తెలియదే?"

"సాయంత్రం మీ ఇంటికి వస్తాడట. అందుకే ఈ లోపల నేను ఈయనను తీసుకుని విషయం మీకు చెప్పిపోదామని వచ్చాను... వస్తాను."

"అదేమిటి? మీ ఆయన వచ్చేదాకా ఉండండి."

"ఆఁ! ఏ పార్కులోనో కూర్చుని ఇంటికి వస్తారులెండి నేను వెళ్ళొస్తాను... నమస్కారం..."

వెళ్ళిపోయింది ఆవిడ. పెద్ద తుఫాను తేలిపోయినట్లైంది. గట్టిగా ఊపిరి పీల్చుకున్నాను.

ఆలోచిస్తూంటే, కొన్ని చిక్కుముడులు విడివడటం లేదు. నేనింకా ఒప్పుకోలేని విషయం ఏమిటంటే, ఉమకు, రాఘవకు మధ్య సున్నితమైన అనుబంధం ఏదో ఉందని. సానుభూతో, గౌరవమో అయితే వేరు. అన్నీ సలక్షణమైన జీవితాన్ని కాలదన్నుకుని, చచ్చిపోయేటంత

ఆవేశం తెచ్చిన ఆ బాధ పేరేమిటి? ఇదే ప్రేమా? ఇంత బాధపెట్టే ఆ దిక్కుమాలిన ప్రేమ ఎవరికీ ఒద్దు గాక ఒద్దు. ప్రేమించడానికి కొంచెం అమాయకత్వం ఉండాలి. మనుషుల మీద నమ్మకముండాలి. అసలు మొదటినించీ నాకు ఎదుటివాళ్ళ మీద నమ్మకం తక్కువ. అందుకని ఈ సబ్జెక్టు గురించి నేను మాట్లాడలేను.

ఏమైనా శ్రీమతి సుధారాఘవ చెప్పింది కొంచెం జాణతనంగా ఉన్నా నిజం. ఆవిడ సంసారం రట్టు కాకుండా ఆవిడ ప్రయత్నించడంలో తప్పు లేదు. ఇప్పుడు ఈ అనవసరపు ప్రేమకథలు ఏమైనా బయటపడ్డా, అవి నాబోటివాడికి సిల్లీగా ఉన్నా, బంధుజనానికి విందు భోజనం. అందులో వాస్తవానికి ఒకటే రూపం – ఊహకు బోలెడు రూపాలు.... ఆమె చెప్పింది ఒప్పుకోక తప్పదు. అసలు అటువంటి భార్య లేకపోతే ఈ రాఘవ లాంటివాళ్లు ఏమౌతారు?

వెంటనే చెప్పులేసుకుని వెళ్లి దగ్గరున్న పుస్తకాల షాపులో రాఘవ రాసిన కథల సంపుటిలు, పాతపత్రికలు కొన్ని, నవల ఒకటి తీసుకు వచ్చాను.

సాయంత్రం వస్తానన్న విరించి రాలేదు. కానీ, ఆ రాత్రి ఆఖరు ఝాము లోపల రాఘవ నాకు చాలా విధాల అర్థమయ్యాడు. అతని కవిత్వంలో గుప్పెటతో గుండెను అదిమివేసే శక్తి ఏదో ఉంది....

కవిత్వం వేరు – జీవితం వేరు అన్న వాళ్లెవరో కానీ, వాళ్లంటే నాకు చాలా ఇష్టం. కానీ, ఈ గందరగోళం వల్ల కవిత్వం రాసేవాడి జీవితం ఏమిటి అని ఆలోచించాల్సి వచ్చింది.

రాఘవ కవిత్వంలో వేడి, బాధ చాలా ఉంది. అతని జీవితం, అతని కవిత్వం సమాంతర రేఖలు... ఒప్పుకోక తప్పదు ఇప్పుడు.

"ఇతని కవిత్వంలో సౌకుమార్యం, హృదయ తంత్రులను అతి సున్నితంగా మీటి ఆ శరచ్చంద్రికా స్నానాభినివేశాన్ని గొప్ప రేఖాచిత్రంగా మలుస్తుంది. ఆ సౌందర్య భావనా చిత్రంలో అక్షరలక్ష్మిని పట్టమహిషిగా నిలబెట్టిన ఈతను ధన్యుడు" అన్నారు ఒక పుస్తకపు ఆశీర్వచనంలో ఒక పేరెన్నికగన్న కవి.

సమకాలీకులు మెచ్చరు కవిత్వాన్ని అన్న కవి సాంప్రదాయంలో, ఒక మహాకవి తన వయసులో సహం వయసు లేనివాడికి ఇంతటి ఆశీర్వచనాశీస్సులు ఇచ్చాడంటే ఈ రచయితల జాతంతా చాలా ఉన్నతులైనవారై ఉండాలి.

మరి ఉమ సంగతేమిటి?! రాస్తుందని తెలుసు కానీ పాపం చదవమని నన్నేనాడూ బలవంతపెట్టి ఎరగదు. వెతుకుదామంటే పాతపత్రికలు కూడా లేవు ఇంట్లో.

ఆ సాయంత్రం వచ్చాడు విరించి. లేతగా, తమలపాకు తీగలా ఉన్నాడు. ఇంకా ప్రపంచపు దారుణాలు అతని జీవితం మీద ముద్రలు వేయలేదు కాబోలు గబగబా మాట్లాడుతున్నాడు. ఆలోచన కన్న ముందు దాన్ని మాటగా మార్చేద్దామని ప్రయత్నించే ఆవేశం ఉంది అతనికి. ప్రపంచంలో ఏ మూలో మునిగిపోతూంటే తను తప్ప రక్షించే వాళ్ళెవరూ లేరన్నంత స్పీడ్ గా పరిగెత్తే లక్షణం ఉన్న మనిషి. అతడు తనను తాను పరిచయం చేసుకున్న పది నిమిషాలలో అతను అమాయకంగా కనబడుతున్నా, అవసరం వచ్చినప్పుడు ఉద్రేకం, కోపం వచ్చినప్పుడు మధ్యాహ్న మార్తాండునిలా మారిపోతాడనిపించింది.

ఇతని చేతుల్లో ఉమ జీవిత రహస్యముందంటే బాధ అనిపించింది నాకు.

"ఏమైనా సార్... ఈ విషయం ప్రపంచానికి తెలియవలసిందే. ఆ ఉత్తరం ఒక గొప్ప చరిత్ర సార్. దీని కోసరం నా జీవితం, నా కెరియర్ పణంగా ఒడ్డమన్నా ఒడ్డుతాను" అనవసరంగా చేతులు ఎక్కువ చాచి మాట్లాడుతాడు ఆవేశం వస్తే.

నవ్వొచ్చింది నాకు. ఆరిసీ అఘాయిత్యం. ఇరవై ఏళ్ళు నిండని ఇతనికి పణంగా ఒడ్డేందుకు ఏముందనో?! ఈ కళాకారులంతా తమ జీవితాలకు తాము చాలా ప్రాముఖ్యత ఇచ్చుకుంటారు పాపం.

"ఇంతకీ ఆ ఉత్తరం ఏది?" అతి మెల్లిగా అడిగాను.

"ఇదుగో సార్.... తీసుకోండి"

"పన్లో పని మా ఉమ రాసినవేమన్నా ఉన్నాయా నీ దగ్గర?"

"ఉన్నాయి సార్. ఇదిగో. నా దగ్గర ఆవిడ రాసిన కటింగ్స్ కొన్ని ఉన్నాయి. నేనొక రకంగా ఆవిడ ఫాన్ ను సార్. మీరు చదువుతూ ఉండండి. నాకు పక్క స్ట్రీట్ లో కొద్దిగా పనుంది. ఇప్పుడే వస్తాను. ఆ ఉత్తరం జాగ్రత్తండీ" సుడిగాలిలా బైటకు పోబోయాడు. నాకు నవ్వొచ్చింది...

"విరించీ!"

"ఏమిటి సార్?" గుమ్మం పట్టుకు వేలాడుతూ లోపలికి వంగి అడిగాడు.

"నేనెవరో తెలియదు. నా మీద మాత్రం నీకు నమ్మకమేమిటి ఇది మాయం చెయ్యనని?"

"ఎందుకు సార్? దానికి జిరాక్స్ కాపీలు తీయించి ఉంచాను. అయినా మీరు అలా చెయ్యరులెండి సార్. మీ మీద నాకా నమ్మకముంది" వెళ్ళిపోయాడు.

ఆరిసీ. అతను తెలివితక్కువవాడనుకోవడం ఎంత అమాయకత్వం?! అయినా అతనిలో ద్వంద ప్రకృతి ఉన్నది. నా లాయర్ బుర్ర పనిచెయ్యడం ప్రారంభించింది.

మొదట ఆ ఉత్తరం విప్పగానే చెయ్యి ఒణికింది. ముందు సంబోధనా, తరవాత సంతకం చూశాను. ఆ తరవాత చదవడం ప్రారంభించాను.

**డియర్ విరించీ!**

ఈ ఉత్తరం నీకు చేరేటప్పటికి ఉమ ఈ లోకంలో ఉండదు.

స్వప్న ప్రపంచాల సౌగంధికాస్వాదనంలో ఉంటుంది. కలగా మిగిలిపోయిన నా అనుభూతులన్నీ తిరగబడిన దేవతల్లా నా ప్రాణాల్ని దిగంతాల వైపుకు తరుముతున్నాయి.

అసలు మృత్యువు అంటే ఏమిటి విరించీ! నీ జీవితం, అనుభవమూ కూడా చాలా చిన్నది. ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేదు. జీవి ఈ దేహాన్ని వదిలి, అదృష్టవంతులైతే అమృతత్వంలోకి వెళ్ళిపోవడమే కదూ! మరి చావు ఏమిటంటావు? ఎందుకు ఏడుపు? ఈ చేదునిజాలు, బాధానుభవాలు ఈ కట్టెవి; స్వప్నసౌందర్యాలు, నిర్హేతుక జాయమాన మాధుర్యాలు ఆత్మవే అయితే, ఈ పీడకల లాంటి శరీరాన్ని వదిలి నేను తప్పు చేస్తున్నానంటావా? నాకు తెలుసు నువ్వు ఏడుస్తావు. కానీ అర్థం చేసుకోడానికి ప్రయత్నించు.

బతకలేక వెళ్ళిపోతున్నాను. విసుగే మృత్యువైతే నాకు ఇరవై ఐదేళ్ళకే విసుగు వచ్చేసింది తమ్ముడూ. చాలు జీవితం అనిపించింది. ఇది నైరాశ్యం విజృంభించి నరనరాలా పాకి, ఏ బలహీన క్షణాన్నో నా ప్రాణాల్ని లాక్కుపోతున్న అపస్మారక దశ కాదు. ఆలోచించి ఆలోచించి రాజీపడలేక, మిథ్యాప్రపంచికత కోసరం ఆత్మను తాకట్టు పెట్టుకుని జీవచ్ఛవంలా బతకలేక వెళ్ళిపోతున్నాను.

నువ్వు, నేను, రాఘవ.... మరి కొందరు... మనలా ప్రపంచాన్ని ఎదగలేని ఎత్తుల్లోకి హృదయాన్ని సంధించి ఆత్మావలోకనం చెయ్యగలిగిన వ్యక్తితో మనకొక సంబంధం ఏర్పడుతుంది. ఒక వేవ్ లెన్త్ లో ఆలోచించే ప్రతి వ్యక్తి మనకు ఆత్మబంధువే. ఈ స్నేహంలో నైత్యం, కోరిక, పతనం, పసితనం ఉండవు తమ్ముడూ... అనుభవమే ఉంటుంది. తద్వారా ఆనందముంటుంది. ఇది నా అనుభవమే కాదు – చాలామంది భావం కూడా.

నీకు తెలుసు 'రాఘవ' నాకే సొంతం కాలేదని... కాదని. హృదయం సంధించి విడిచిన బాణం గమ్యం చేరాలని రూలు లేదు తమ్ముడూ. ఒక్కొక్కసారి లక్ష్యం తప్పుతుంది. అతను చెప్పకపోయినా అతని బాధానురాగాలకు ఆరాధ్య దేవతను నేనని, అతని సౌందర్యస్వప్నాల రంగవల్లులలో అధిష్టించిన అనురాగ దీపాన్ని నేనని అతని అక్షరాల్లో, అలంకారాల్లో, ఆవేదనలో అతను నాకు చెబుతూనే ఉన్నాడు.

కానీ అతన్ని పోగొట్టుకున్న దుఃఖంతో చచ్చిపోతున్నాననుకోకు. అంత అమాయకురాల్ని కాను. అతన్ని ఏనాడు పొందానని? అతని చేరువలో లేనని వెళ్ళిపోతున్నాననుకోకు – ఏనాడు దూరమయ్యానని?

ఈ చేరువులు, దూరాలు, పొందడాలు, పోగొట్టుకోవడాలు – అన్నీ ఒక పరిధి దాకనే. ఆ తరవాత అంతా శూన్యం. అందులో తేజస్సు... అది అణువణువు పునీతం చేస్తుంది తమ్ముడూ! కవిత్వాలకు, ఆనందాలకు, దుఃఖాలకు, విభిన్నత్వాలకు, సౌందర్యాలకు, స్వప్నాలకు అది పతాకానుభవం.

'ఎపుడో కల్పాంతాల క్రితం విడిపోయాం. అయినా క్షణం కూడా దూరంగా లేము. నిత్యం పరస్పరం ఎదురవుతూనే ఉన్నా ఏనాడూ కలువనేలేదు' అనే సూక్తి ఎంత నిజం. అంతలో ఎంత ఊహ?

కానీ ఈ రాఘవ, ఈ ఉమ వీటన్నింటికన్నా అతీతమైన జగత్తు. ఈ నామ రూపాలు పరిధులు విధించలేని పునీతమైనది ఉన్నది తమ్ముడూ. అది తెలిస్తే ఈ లోకం, ఈ స్వార్థం, ఈ కచ్చ, ఈ కోపం, సంకెళ్ళు, శిక్షలు చాలా అర్థం లేనివిగా ఉంటాయి.

రాఘవ వ్యక్తిగా నాకు మామూలు మనిషే కానీ అతని ఊహ, కవిత్వం, ఆరాధన ఇవే నాలో రాగరాగిణత్వాన్ని నిద్రలేపాయి.

'చీకటి చిరుదారుల్లో, చుక్కల దీవుల్లో దిక్కుతోచని పయనంలో చిక్కుకున్న చిన్నారి మనసుకు అనుభవాల సంకెళ్ళు వేసి వాస్తవంలోకి లాగనా? అనుభూతుల ఆర్ద్ర పవనాలతో అవతలి ఒడ్డుకు పంపనా? ప్రపంచం నన్ను రమ్మంటోంది చెలీ, నీ ఊహ నన్ను పొమ్మంటోంది' అని

కాప్షన్ రాసి అతను పంపిన బర్త్‌డే కార్డు గుర్తుంది నాకు. నా మదిలో, హరిచందనాల పెట్టెలో, కర్పూర మాలలతో, పొగడ పూవుల జాడలతో దాచుకున్నాను తమ్ముడూ. అది నా జ్ఞాపకాల పేటిక.

అక్షరాలు, కాగితాలు – అవి మనుషులకు దొరికితే మాలిన్యాలు అంటగడతారు. అందుకే నా హృదయాంతరాళాల్లో కర్పూర సుమాల మధ్య దాచుకున్నాను.

కాబట్టి అతను వద్దు నాకు. అతని ఆత్మావలోకనంలో ఎప్పుడూ నే ఉంటాను.

రాఘవలా లౌకిక ప్రపంచపు పరిధుల్లో మామూలుగా బతకడానికి నాకభ్యంతరం లేదు. ఒప్పుకున్నాను. ఆత్మకు, ఊహకు అందమైన అనుభూతి చాలు. కానీ శరీరానికి కాదే?

ఏదో కొంత ఇవ్వగలిగితే కానీ రవ్వంత పొందలేని లౌకిక ప్రపంచం ఇది. కానీ, నా కాలి పారాణి ఆరలేదింకా. 'నాకు ఈ ఆచారాలు, ఈ అలంకారాలు అంటే అసహ్యం' అన్నారు నా భర్త. అవును మరి. అతనుండేది నాగరికతల ఒయాసిస్సులో, అక్కడ గంగావతరణమేమిటి?

'కవిత్వమంటే అసహ్యం నాకు. వేదాంతమంటే మంట. జీవితాన్ని అనుభవించకుండా ముడుపుకట్టే ఈ ట్రెడిషన్స్ మారాలి' అంటూ విసిరి పుచ్చుకుని నా చేతిలోనుంచి రవీంద్రుడి కవిత్వాన్ని విసిరేశారు. చిరిగిపోయిన కాగితాలను, విరిగిపోయిన ఆలోచనలను దాచుకున్నాను.

సౌకుమార్యం, సౌందర్యం, భావుకత ఇవన్నీ ఆడపిల్లల్లో ఎంత ఉండాలో అంతే ఉండాలేమో? నా కన్నె జీవితపు మొదటి రాత్రి. భౌతిక శరీరమనే వీణను శృతి చేయించకుండానే రుద్రవీణగా చేసి వాయించారు నా భర్త. బాధ చెప్పుకోగూడదు తమ్ముడూ! ఇది సంసారం.

ఆ నాలుగురోజుల్లో నాకు నానా రకాల బహుమతులు కురిపించారు. నేనిస్తున్న దేనికో అవి పణంగా కనిపించాయేమో కానీ 'నావి' అనిపించలేదు.

అతడు ఉండే చోటున ఆడది పరదాల్లో ఉంటుంది. మొగవాడి భోగవస్తువు. తనువు తప్ప ఆత్మలే ఉండకూడని ఆ నిశ్శబ్ద ప్రపంచంలో, నిరూహతో, నిస్తేజంతో, నిద్రబుచ్చుతున్న మనసు నిద్రలేస్తుందేమోనన్న భయంతో అతనింటికి అలంకారంగా, అతని సుఖానికి శయ్యగా, అతని అలంకారానికి హరిచందనగా, అతను అనుభవాల గదిలో అగరు వత్తిగా బతకాలట తమ్ముడూ. అర్థమైంది జీవితం నాకు.

అతను కొన్న చీరలను, పెట్టిన నగలను, అతని కళ్ళల్లో మాదకతను 'ప్రేమ'గా అర్థం చేసుకున్న ఈ మనుషులకు నా పరిస్థితి అర్థంకాదు. దీనికి తోడు అతని పొసెసివ్‌నెస్ ఒకటి. అది ఆరాధనతో కూడినదైతే అద్భుతంగా ఉంటుందేమో కానీ, అధికారంతో వచ్చింది. నా అస్తిత్వం మీద అతనికి అపనమ్మకం. నామీద మరొకరి నీడను కూడా భరించలేడతను. అతను వినే సంగీతంలో మృగత్వం, అతని మనసులో అనుభవాల కోసం పరితపించే కాళ నాట్యం, అతని శారీరక అనుభవాలు, అతని గర్ల్ ఫ్రెండ్స్ – అవన్నీ వింటున్న కొద్దీ నా శరీరం వణికింది తమ్ముడూ. మనస్సు కరిగి, చుక్కలు చుక్కలుగా కంటినించి వచ్చే నీరు కన్నీరు తమ్ముడూ. మనసే కరిగితే దాని పేరేమిటి?

అతనితో జీవితం పంచుకోవడమే వరం అనుకునేవారు చాలామంది ఉన్నారు. కానీ దానికి 'ఉమ' అక్ఖర్లేదు.

అతని ఊహల్లో తప్పులేదు. మా ఇద్దరి కలయికలోనే ఉంది తప్పంతా. సుస్వరమైన రాగంలో కూడని అక్షరం కలిస్తే అపస్వరమౌతుంది. మహామంత్రానికి చేరకూడని బీజాక్షరం కలిస్తే భయంకరమౌతుంది. అందుకే తప్పుకుంటున్నాను తమ్ముడూ. అతణ్ణి ద్వేషించలేను. అందుకే దూరమౌతున్నాను.

అమ్మా నాన్నా ఈ నా నిష్క్రమణకు తట్టుకోలేరు. వారికి కూతురుగా తప్ప, 'ఉమ'గా ఏనాడూ నేను తెలియను. అతని దగ్గర ఉండగా ఈ నా మృత్యువు సంభవిస్తే నింద అతని మీద పడుతుందేమో?

అతనున్న అరబ్బు దేశానికి తీసుకుపోవడానికి మార్గ మధ్యంలో కలుసుకుంటానన్నారు నా భర్త. అందుకే కదులుతున్న ప్రకృతి అశాశ్వతమనుకుంటూ, నాతోపాటు వచ్చే చంద్రుడికి నా నిర్వేదం చెప్పుకుంటూ ఈ లౌకిక ప్రపంచం నుంచీ శలవు తీసుకుంటున్నాను.

నా ఈ మృత్యువుకు కారణాలు వెతుకుతుంది ప్రపంచం. ఏమర్థం చేసుకుంటుంది? వీరందరిలో నువ్వు పడే తపన నాకు తెలుసు. రాఘవలా కన్నీళ్ళు దాచుకుని కలంతో వర్షించడం చేతకాదు నీకు. నీ పట్ల నాకుండే ఇష్టం నాచేత ఈ ఉత్తరం రాయిస్తోంది. జీవి 84 లక్షల జన్మలు ఎత్తాలట ముక్తి పొందడానికి. ఈ నా గమ్యానికి నేనెంత దూరంలో ఉన్నానో తెలియదు నాకు.

చచ్చిపోయేముందు స్నేహితురాలు 'ఉమ'గా ఒక్కటి కోరుకుంటున్నాను విరించీ.

నేను చదివిన కవిత్వం, వేదాంతం ఈ మిధ్యా ప్రపంచపు వాదాల్ని దాటి చీకటి చిట్టడవుల్లో నీరెండను వెతుక్కునేటట్లు చేసింది. ఈ జన్మకు నేను నేర్చుకున్న జీవన సారాంశం ఇదే.

ఏ పని వెనకాలైనా దేముడో, కాస్మిక్ ఎనర్జీయో, మరొకటో ఏదో తెలియని స్ఫూర్తి ఒకటే 'థాట్!' సర్వ భౌతిక ప్రపంచపు సృష్టికి కారణం మన ఆలోచన. కన్ను మూస్తే మరుగయ్యే ఈ ప్రపంచం, కన్ను తెరుస్తే రూపు కట్టుకునేది కేవలం 'ఈ థాట్ పవర్ 'తోనే. దానికి రకరకాల ద్వేషాలు, అనురాగాల బట్టలు కట్టి, స్వరూపాన్నిచ్చి, ప్రపంచాన్ని మన కోణంలోనించి ఆలోచించి అనుభూతుల్ని అలికి స్వరూపమే మార్చడంకంటే< దేన్ని దానిగా చూడటం, నెగిటివ్ థింకింగ్‌తో 'థాట్ 'ను మలినపరచకుండా ఉండటం జరిగితే ప్రపంచం ఇంత ఇరుకుగా కనిపించదేమో? మన స్వార్థం, అసూయ, క్రౌర్యం మన థాట్‌ను అపవిత్రం చెయ్యగానే తద్వారా మాటా చేతా కూడా మరింత మలినమై పోతున్నాయి. దయచేసి ఈ అద్భుత అవలోక నా జ్ఞానాన్ని మరుగుపరచకండి. చేసే ప్రతి పని వెనకాలా ఈ జ్ఞానం వర్ధిల్లి మాటతో జతగూడితే ఇప్పుడున్న మామూలు మానవత్వపు వైతరిణి దాటి సుస్నాతకతతో అవతలి ఒడ్డు చేరుకోగలమనిపిస్తుంది.

రాఘవతో చెప్పు విరించీ ఉమ నీ అవలోకిక జ్ఞాన ఊహాసింహాసనంలో రాణిలా దర్శనమిస్తుందని, అతని కర్తవ్యం వెనకాల నిజాయితీ నీడలో ఉంటుందని.

ప్రపంచపు అజ్ఞానపు చిరునీడల వెనకాల నిలిచే నిశ్శబ్ధపు తేజస్సు జ్ఞానావలోకమే తమ్ముడూ.

నా బతుకొక చెదిరిపోయిన ముత్యాలదండ తమ్ముడూ. అన్నీ మంచివికావేమో? ఏరుకున్న ఏ కొద్దివాటిలోనో జీవన సత్యాలు ప్రతిఫలించవా?

కనబడని మౌక్తికాలను కలల ప్రపంచాన్నించీ ఏరి మీకు కానుకగా ఇచ్చి వెళ్ళిపోతున్నా.

**మీ ఉమ.**

ఈ ఉత్తరం చదవగానే నాకే తెలియకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గుండెలు చిక్కపట్టినట్టె ఒక్కసారిగా భళ్ళున బద్దలౌతుందేమోననిపించింది. కళ్ళు మూసుకుని పడక కుర్చీలో వెనక్కు వాలాను. నా ఊహల్లో, నా దుఃఖంలో, నా గుండెల్లో ఉమ రూపం. "మామయ్యా! నన్నెరుగుదువు కదూ ఇప్పుడూ?" అని అడుగుతున్నట్లే అనిపించింది.

నా కళ్ళముందు గౌన్లు వేసుకుని తిరిగే పాప, పెళ్ళిలో బుద్దిగా వంగి కాళ్ళకు దణ్ణం పెట్టిన ఉమ ఈ లోపలి మనిషి ఇదా? నిజంగా ఈ ప్రపంచంలో ఈ పాంటు షర్టు వెనకాల, పట్టు చీరల వెనకాల, చర్మం, అస్థిపంజరాల వెనకాల అసలు మనుషులు ఏమిటట? వాళ్ళెవరు? ఎలా ఉమారు?

రమణ మహర్షి 'నిన్ను నువ్వు తెలుసుకో' అన్నారంటే అదే నా అర్థం?

నాలో ఏదో తెలియని బాధ, గుండెల్లో ఏదో రొద. ఇదెలా తీరుతుంది? అటూ ఇటూ కాస్సేపు తిరిగాను. పనివాడిచేత కాఫీ కలిపించుకుని తాగాను. ఈ పరిస్థితి ఏనాడూ ఎరుగను. నా ఆలోచనలు, పరిస్థితులు నా అదుపుదాటి ఏనాడూ వెళ్ళలేదు. నా భార్య చితికి నిప్పుపెడుతూ కూడా నేను రాబోయే ఎల్.ఐ.సి పాలసీ తాలూకు డబ్బు గురించే ఆలోచించాను. అది అర్థంలేనిదిగా, అసహ్యకరంగా మీకు అనిపించవచ్చు. నేను బయటకు చెప్పాను కానీ, చాలామంది ఆలోచనలు అప్పటికప్పుడు టీవీలోలా బహిర్గతం అయితే, ఈ ప్రపంచంలో ఒక్క క్షణం నిలబడలేము ఎవరమూ కూడా.

"ఏమిటి సార్ చదివేశారా?" హడావిడిగా లోపలికి వస్తూ అన్నాడు విరించి.

ఉలిక్కిపడ్డాను.

అతనివంకే చూశాను కన్నార్పకుండా. ఎవరీ కుర్రాడు? ప్రశ్నార్థకంతో వచ్చాడు. ఏం చెప్పాలి ఇప్పుడు?

"కూర్చో విరించి" అంటూ కాఫీ తెమ్మని కుర్రాడికి చెప్పాను.

"సార్ అసలు ఆవిడ రచనలు చూశారా ఎంత సున్నితత్వం. సార్ ఎలాగయినా ఇది ఒక గొప్ప నవలకు ప్రాతిపదిక సార్"

"నేను ఆవిడ ఉత్తరం మాత్రమే చదివాను విరించీ"

"అదేమిటండీ?" నీరసంగా అన్నాడు.

"అది చాలు. చాలా కథ చెప్పింది. అదుగో కాఫీ వచ్చింది తీసుకో"

మొహమాటం లేకుండా తీసుకున్నాడు.

"సార్ అసలు"

"విరించీ"

"ఏమిటండీ?"

"అసలు నీకూ, మా ఉమకు, రాఘువకు ఎలా పరిచయం??"

"అదా సార్ చాలా పెద్ద కథ సార్. గభాల్న కప్పు అడుగున ఉన్న కాఫీ నోట్లో పోసేసుకుని కప్పు కిందపెట్టేస్తూ అన్నాడు.

నేను మళ్ళీ అడగక్కరలేకుండానే చెపుతాడని నాకు తెలుసు.

శంకరంగారు వింటున్నారు. విరించి మాటలు పేరుస్తున్నాడు. అసలు జరిగిందేమిటంటే

"జీవితంలో అవ్యాజమయిన కరుణావాహిని అంతర్వాహినిగా ప్రవహిస్తూనే ఉంటుంది. కానీ, మనిషి దాన్ని గుర్తించకుండా నీహారికల వెంట పరుగులు తీస్తాడు. కష్టాల ఎడార్లలో మెటీరియలిస్టిక్ అస్తిత్వం కోసరం అర్థం తెలియని ప్రయాణం. టాల్‌స్టాయ్ రాసిన సూర్యాస్తమయం లోపల దొరికే భూమి కోస్మ పరుగెడుతూ ప్రాణాలు బలిఇచ్చిన వ్యక్తి కథ గుర్తుకు వస్తుంది."

ఈ మాటలు ఎవరో చదివి "మీ ఎడిటోరియల్ చాలా అద్భుతంగా ఉంది రాఘవా!" అంటున్నారు.

అది ఒక జర్నలిస్ట్ కం ఆర్టిస్టు ఇంట్లో చిన్న గెట్ టు గెదర్. ఒక ప్రముఖ పత్రికలో పనిచేస్తున్న అతనికి కథకుల్ని, రచయితల్ని, అందమయిన వాళ్ళను, బాగా మాట్లాడేవాళ్ళను ఒకచోట చేర్చి కాస్త టీలాంటిది పోసి మాట్లాడించడం మహా సరదా. కానీ కోరికలో ఉన్న బలం తీరడంలో లేదు. అతనికెప్పుడూ ఈ సమావేశాలు పూర్తి అయిన తరువాత, తలకాయనొప్పి మిగిలి 'మళ్ళీ పిలవకూడదు బాబూ' అనిపించేట్లు చేస్తాయి. అయినా మానడు. ఆ మీటింగ్స్‌కు "మానసవీణ" అని పేరు పెట్టాడు.

"ఇది మోగించడానికి ఇక్కడికి రానక్కరలేదు" అని వెకిలినవ్వు నవ్వే గొప్ప రచయితల దగ్గరనుంచి "నా గుండెల్లో రుధిరాగ్ని నీ వేలుకొనల వెలుతురా ప్రేయసీ" అని గాలిబ్ కాపీ అయినా కవిత్వంగా కూర్చుకువచ్చి చదివేద్దామనుకునే కుర్రకారుల వరకు అందరూ అతనికి పరిచయస్థులే.

ఆ జర్నలిస్ట్ పేరు విరించి. అతని అసలు పేరేమోకానీ, ప్రపంచానికి అతని పేరు అదే ఏ మాత్రం జర్నలిజం ఒంటబట్టకపోయినా, మేధస్సు జ్వలించకపోయినా, తెలివితేటలుండి పలుకుబడిలేని సబ్ ఎడిటర్ల మధ్య తలకాయ దూర్చి, బొప్పిలు కట్టించుకుని, దుఃఖపడి ఓదార్చుకుని "నాకు ఈ పేరే సరి. బ్రహ్మలా నాలుగు తలకాయలు చాలవసలు ఈ దిక్కుమాలిన ఉద్యోగానికి" అని తిట్టుకుని, సిగరెట్టు కాల్చేసి రిజిగ్నేషన్ లెటర్ రాసి, పొద్దున్నే లేచి చించేసి ఆఫీసుకు పోతూ ఉంటాడతను.

ఆంధ్రదేశపు ఓ పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన అతని సౌందర్యారాధన ఎక్కువే కానీ, బతకడానికి అది ఒక్కటే పనికిరాదు.

కాలవలో నీరెండ దరహాసాలు చూస్తూ, చింతచెట్టు కింద కూర్చుని వెదురుతో వేణువు చేద్దామని ప్రయత్నిస్తూంటే, ముసలి తాతమ్మగారి మునిమనుమరాలు విసిరేసిన జామకాయ తగిలి తలెత్తి చూశాడు.

అంతలావు శరీరంతో పిట్టగోడ మీదుగా ఒంగి చూస్తూ కన్ను కొట్టింది ఆ పిల్ల.

ఒళ్ళంతా జలదరించి పారిపోయి ఇంటికి వచ్చేశాడు. కానీ ఆ తరవాత ఆ పిల్లే విరించి తననేదో చెయ్యబోయాడని కావాలని యాగీ చేసుకుంది. విస్తుపోయాడతను ఆ పిల్లకు ఈ నిందలో ఉన్న ఈగో శాటిస్‌ఫాక్షన్‌కు.

"అదేమిటి వదినా? ఆ పిల్ల అసలు" వదినగారి వెనకాలే ఆపకుండా మాట్లాడుతూనే వంట ఇంట్లోకి వెళ్ళాడు విరించి.

"సర్లేవయ్యా కూర్చో భోజనానికి" అంది సుభద్ర నవ్వుతూ.

"ఎండలో చెడ తిరిగి ఇప్పుడొచ్చాడా అన్నానికి? వెధవ" గొణుగుతోంది అతని తల్లి దుర్గమ్మ గదిలోనించి.

కానీ, సుభద్రకు ఈ అల్లరి మరిదంటే విపరీతమైన సానుభూతి. ఆమె పెళ్ళికి అతను అడ్డాల్లో బిడ్డ.

అసలు మన సాంఘిక వ్యవస్థలోనే ఒక విచిత్రమున్నది. సున్నతము, సుకుమారము. నిరంతర చైతన్య స్ఫూర్తితో స్పందించే స్త్రీత్వం ఒక్కసారి ఒళ్ళు విరుచుకుంటే ఏమౌతుందో గ్రహించి సంఘం ఉలిక్కిపడి ఉంటుంది. సృష్టికర్త అంతర్ముఖుడైనప్పుడు ప్రకృతి శివత్వాన్ని పొందితే, విలయము, ప్రళయము నిద్రలేస్తుందేమో? అందులో కూడా భయద సౌందర్యం ఉంటుంది చూసే కళ్ళకు. కానీ, యోగి, నిశ్చలాత్ముడు అయిన వ్యక్తికి తప్ప, ఆ సంపూర్ణ స్త్రీత్వం అర్థం కాదు. మిగతా ప్రపంచం ఆ విలాసతీహాసానికి మూర్ఛిల్లుతుందేమోనని, సౌందర్యానికి సౌకుమార్యము స్త్రీత్వానికి మాతృత్వము, ఉగ్రనరసింహుడుకి చందనపు పూతలా, తిల్లై కాళికి మంచినూనె, కుంకుమాభిషేకంలా ఏర్పడి పోయి ఉంటుంది.

పసుపు రాసిన పాదాలు, శుక్రవారం అని కాబోలు కాశీపోసి కట్టుకున్న రేషన్ పట్టుచీర, పాంజేబులు, ఎర్రటి కుంకుమ, కంటి ఆర్ద్రతతో తడిసి కరిగిందా అనిపించే కాటుక, ఒంటి రాయిముక్కుపుడక "ఏమిటయ్యా అలా చూస్తున్నావు? మంచినీళ్ళు ఇవిగో" అన్నది సుభద్ర.

వదిన దేవత. ఆవిడ కళ్ళలో ఎప్పుడూ ఆప్యాయతా సౌందర్యాలు. వదిన అన్నయ్యవంక ఎలా చూస్తుందో గమనించాల్సిందే

ఛీ అని తన చిలిపి ఆలోచనకు మనసులోనే లెంపలేసుకుంటూ భోజనం ముగించి చెయ్యి కడుక్కుని లేచాడు. అసలు ఆడది పుడుతూనే మహానటి. "ఈ ప్రపంచమే ఒక రంగస్థలి. మనం అందరం మన పాత్రలు నటించిపోవడానికి వచ్చామన్న" షేక్స్‌ఫియర్ చాలా కరెక్ట్‌గా చెప్పాడు. అది ఆడవాళ్ళ విషయంలో మరీ కరెక్ట్.

స్త్రీ చూసే చూపులోనే ఆమె ఆంతర్యం ప్రతిబింబిస్తుంది. స్వచ్ఛమైన నీటిపై వెన్నెలలా స్పష్టంగా తనకు తోచింది చెప్పేస్తుంది చూపులతో. కానీ, ఆమె భర్తను ఒకరకంగా బిడ్డను మరొకరకంగా, పరాయి వారిని ఇంకొకరకంగా ఇలా క్షణక్షణం చూసే చూపుతో తన జీవన నాటకంలో యవనికలు వేసుకునే స్త్రీమూర్తి కన్న మహానటి ఎవరు?

"అసలు ఈ స్త్రీ హృదయం అనేది నాకు పెద్ద ప్రశ్నార్థకం అనిపిస్తుంది" గబుక్కున ఆలోచిస్తూ బయటకు అనేశాడు విరించి.

నవ్వేసింది వదిన. "ఆ! ప్రతివాడికీ ఈ ప్రశ్న ఉదయిస్తే బోలెడు కాలక్షేపం. ఈ ఆలోచనలు సరేకానీ, ఆ పిల్ల సంగతి ఎక్కడా బయటపెట్టకు. అసలే అల్లరైపోయింది ఆ కుటుంబం" వక్కపొడి పెడుతూ మందలింపుగా అని అక్కడే స్థంభానికానుకుని కూర్చుంది ఆమె.

అలా ఆమె స్థిమితంగా కూర్చోవడం సాధారణంగా చూడడు విరించి. అలా కూర్చుందంటే ఏదో చెప్పాలనే.

"ఏమిటి వదినా?"

"ఏదైనా ఉద్యోగం చూసుకోరాదూ! అన్నయ్యగారు కేకలేస్తున్నారు" ఎటో చూస్తూ అన్నది. చేతినుండే ఎర్రగాజుల మీద తలుపు సందునుంచి ఎండదూసుకు వచ్చి పడుతోంది.

తలెత్తి చూశాడు. వదిన.. సుభద్ర. ఆమెకు చాలా కథ ఉన్నది. నిండు గంగానదిలా తొణకనట్లు ఉండే ఆమె ఆంతర్యంలో ఆనాటి పతివ్రతల అభిజాత్యం, అభాగినుల ఆవేదన, ఋషిపత్నుల వైరాగ్యం ఉన్నాయి. ఆ తరువాత జీవితంలో ఎక్కడా అలాంటి దృశ్యం మద్రాసులో ఈ దిక్కుమాలిన ఇరుకు వీధుల్లో ఒంటిరాయి మేడమీద పాకలో అద్దెకుంటున్నప్పుడు తారసపడ్డ అరవ ఆడబడుచుల్లో కానీ, సాయంత్రాలు సముద్రపు ఒడ్డున కనపడే నార్త్‌ఇండియన్ ఆడపిల్లల్లో కానీ, సినిమా ప్రపంచపు మేకప్ సౌందర్య రాజ్ఞుల మధ్యకానీ ఎంతమందిని చూసినా వదినలాంటి పరిపూర్ణ స్త్రీమూర్తి తారసపడలేదు.

చెప్పవలసిన మాటేదో అనేసి మాట్లాడకుండా కొంగుపరచుకుని స్థంభం వారగా తలక్రింద చెయ్యిపెట్టుకుని పడుకుంది ఆమె.

వదిన అలిసిపోయింది. ఎందుకో అతనికి దుఃఖం వచ్చింది. వదినలాంటి వాళ్ళు ఈ దేశంలో ఎంతమందో? ఈ నాలుగు నిట్టాళ్ళ పురాతన ధర్మమనే గ్రహానికి నిజమైన ప్రాతిపదికలు ఈ స్త్రీమూర్తులు. కానీ, వీళ్ళను చాలా తేలిగ్గా, సులభంగా వీరి ఆంతర్యాన్ని, అనుభవాలను అణిచేసి కేవలం ఒక పసుపుతాడుతో కట్టెయ్యగలదు ఈ సంఘం. వారు తిరగబడరు. ఇదేమిటని అడగరు. దీనికి, వాళ్ళలో జీవన్మరణ రేఖల మధ్య సున్నితంగా కదిలే ఆత్మార్పణే కారణం.

సుభద్ర పెద్దగా ఉన్న వాళ్ళింటి పిల్లేమీకాదు. రెండువేల కట్నం, లాంఛనాలతో సహా ఇచ్చి చెయ్యి కడుక్కున్నాడు. ఆమె తరువాత ఐదుగుర్ని కన్న ఆ తండ్రి.

దివాణంలాంటి ఇంట్లో పెద్ద కోడలుగా అడుగుపెట్టిన సుభద్రకు ఈ ఐశ్వర్యం, అది ఆ మనుషులకిచ్చిన అర్థంలేని అహంకారం చూసేటప్పటికి ఆ పదిహేనేళ్ళ పిల్లకి తమ ఊరి ఏటి ఒడ్డున బంతిపూల చెట్లమధ్యనున్న వేణుగోపాలస్వామి ఆలయానికి పారిపోవాలనిపించింది. ఇక్కడ అందరికీ తెలిసింది డబ్బు, అది ఇచ్చే అహం. వాళ్ళకు తెలియనిది ఆప్యాయత ఆదరణ. ఎవరితో మాట్లాడినా వాళ్ళ తాలూకు ఆస్థిని, మెళ్ళో నగలను బేరీజు వేస్తూ బతికేవారు వాళ్ళు. వాళ్ళందరికీ సరి అయిన ప్రతినిధి తన అత్తగారు. కుండ ఓటిదని తెలిసీ కోడలిచేత కడిగించి విరిగిందని తిట్టే మనస్థత్వం ఆమెకి. తెలియనివి తెలుసుకుందామనే ప్రయత్నంలో ఉంటారు జిజ్ఞాసువులు. తెలిసింది లౌకిక జీవితానికి అడ్డంపడకూడదని అనుకుంటాడు అజ్ఞాని, ఆమె చాలా మందిలా రెండవ కోవకు చెందిన మనిషి. ఆమె అసంతృప్తికి కోడలు ఒక ఆటబొమ్మ.

"శుక్రవారం తులసికి పసుపు పుయ్యాలని తెలియదూ? ఆడదానివి కాదూ?" అంటూ పొద్దున్నే భయంకరంగా రంకెలు వేస్తూన్న అత్తగార్ని చూసి ఆశ్చర్యపోలేదు సుభద్ర. అది అలవాటైపోయింది ఆమెకు. అంతకుముందువారం తులసి కోటకు పసుపు రాస్తూంటే "అంత చేటూ పాటూ తెలియని సంసారమైతే ఎలా? దరిద్రురాలికి ఐశ్వర్యం పడితే ఇంతేమరి. కట్ట తెగినట్లే. తులసి చెట్టుకు కాస్త పసుపు కుంకుమ పెడితే సరిపోతుంది. ప్రతివారం మెత్తక్కర్లేదు" అంటూ ఆవిడ చేతులూ కాళ్ళూ తిప్పుతూ చేసిన అభినయం ఇంకా గుర్తుంది సుభద్రకు. మళ్ళీ ఈ వారం ఇలా..

ఆవిడకు కావలసింది మాట చెల్లడం. ఆ మాటల వెనకాల ఔచిత్యం లేదు. శుక్రవారం పూట ముత్తైదువై ఉండీ భర్తను శాపనార్థాలు పెట్టి శోకాలు తీయడం, ఇంటి మధ్యలో కూర్చుని పేలు తీసుకోవడం ఇవన్నీ ఏ కులస్త్రీ లక్షణాలు అని ఆవిడను అడిగేవారు లేరు. వయస్సుతో గౌరవాన్ని తెచ్చుకున్న వాళ్ళతో సమాజం పడేబాధలు కోకొల్లలు. ఆ పల్లెటూరిలో మెడనిండా కాసులపేర్లతో చారెడు పసుపు, చారెడు కుంకుమతో మెరిసిపోయే దుర్గమ్మ అదృష్టవంతురాలు, పెద్ద ముత్తైదువ అందరికీ. అక్కడి అమాయకులకు, అక్షరం రానివాళ్ళకు ఆమె ప్రైమరీ స్కూలు చదువు ఎక్కువ. కర్మ సిద్ధాంతం నమ్మే మనుషులు ఆమె ఎంత పుణ్యాత్మురాలు కాబోతే అంత అదృష్టవంతురాలౌతుంది అని ఆమెను అందలం ఎక్కించడానికి అలవాటైంది. కానీ, అదే నిజమైతే, వచ్చే జన్మకు ఏందాచుకుంటున్నావని ఆమెను అడిగేవారు లేరు మరి. ఆమె భర్త ఈ భార్య గద్దరితనంతో ఏనాడో వేదాంతిలా అయిపోయి ఉంటాడు. ఏమన్నా మాట్లాడడు.

సర్వశోభాయమానంగా ఉండే ఇళ్ళల్లో ఈ దౌర్భాగ్యపు అహంకార పూరితులైన ఆడవారి వల్ల, వారి అజ్ఞానంవల్ల కొన్ని తరాలు తీరని శాపాలకు గురిఅవుతున్నాయి. పైగా వీరి అజ్ఞానం, అహంకారం కేవలం ఇల్లాలితనం చాటున దాక్కుని దిక్కులేని వాళ్ళందరికీ అక్రమ సంబంధాలు, దరిద్రులందరికీ దొంగతనాలు అంటగట్టగలవు. దేముడు, వేదాంతం, పురాణాలు, కర్మసిద్ధాంతం - ఇవన్నీ వీళ్ళకు ఉపోషాలకు, పిండివంటలకు, పదిమందిలో మేము అధికులమనిపించుకునే భయంకరడాంభికత్వానికి ఉపయోగపడతాయి కానీ, తమలో నిరంతరం జ్వలించే ఆత్మజ్యోతి దర్శనానికి ఎంతమాత్రం ఉపయోగించడంలేదు. 'దేవుడు లేడు' అనుకోవడం భయమేమో కానీ ఉన్నాడు అనుకోవడం అడ్డం వాళ్ళకు.

ఈ అజ్ఞానాంధకారాల మధ్య మరీ అయోమయంగా కనిపించేవాడు భర్త ఆమెకు. ఆ తల్లి ఎన్ని తిట్టినా మాట్లాడడు. తనకు తోచింది చాతనైనది అయిన పనిచేసేవాడు. అతడు చేసే కరిణీకపు పనీ అదేమంత కష్టమైనది కాదు.

"నువ్వు నోరు మూస్తావా లేదా?" ఒకరోజు అసుర సంధ్యవేళ తెగ తిట్టిపోస్తున్న దుర్గమ్మను చూసి నేరుగా ఇంట్లోకి వస్తూ ఒక్క అరుపు అరిచాడు రఘు. ఉలిక్కిపడింది సుభద్ర దేముడికి దీపం పెడుతూ. ఇంటిల్లిపాదీ అదురుకున్నారు.

"ఏమన్నావురా?" మీది మీదికి వస్తూ అడిగింది దుర్గమ్మ కళ్ళు ఎర్రన జేస్తూ. అంతటి మనిషి అలా అరిచేటప్పటికి ఒణికిపోయింది సుభద్ర.

"సిగ్గులేదూ? ఆడదానివి కాదూ? రోడ్డుమీదికి వినిపించేటట్లు ఆ అరుపులేమిటి? ఛీ.." ఒక్క విదిలింపు విదిలించి, దొడ్లోకి కాళ్ళు కడుక్కోవడానికి వెళ్ళిపోయాడు సుభద్ర పెద్ద మరిది రఘు.

**ఇంటిల్లిపాదీ** అవాక్కైపోయారు. పటిక బెల్లం కోసరం దేముడి గూడు దగ్గరకొచ్చిన విరించి వదినగారి కొంగు ముఖం చుట్టూ కప్పేసుకున్నాడు, భయంతో కుచించుకుపోతున్న అతణ్ణి దగ్గరగా తీసుకున్నది సుభద్ర.

నేరుగా వచ్చి పీట వేసుకుని, మూత పెట్టిన దిబ్బరొట్టె కంచంలో పెట్టుకుని, "వదినా! ఆవకాయ వెయ్యి" అని అరిచి అది తిని వెళ్ళిపోయాడు రఘు.

కానీ, ఆరోజు మొట్టమొదటిసారిగా ఆ ఇంట్లో విప్లవం తలెత్తిందనీ, దానికి పరోక్షంగా సుభద్ర బలైపోతుందనీ కల్లోకూడా అనుకోలేదు ఎవరూ.

ఆ రాత్రి దుర్గమ్మగారి పెడబొబ్బలు, శాపనార్థాలు, మామగారి మౌనం, ఆడబిడ్డల సతాయింపు - వీటన్నింటి నుంచీ పారిపోయి ఇంటి పెరట్లో కాస్త దూరంగా ఉన్న వేపచెట్టు దగ్గర మంచం వేసుకుని చీకట్లో కూర్చుంది సుభద్ర. ఆమె మనస్సు తడిసి ఉబ్బిన దేవదారు చెక్కలా బరువుగా ఉంది.

"ఇదుగో తీసుకో" ఆ చీకట్లో ఒక చెయ్యి ఆమె మంచం మీదికి వంగింది. భయపడి ఒక్క అరుపు అరవబోయింది. "నేనే వదినా! రఘుని. తీసుకో నీకు నేరేడు పళ్ళు ఇష్టమని తెచ్చాను" అవాక్కయి అలాగే చీకట్లో అప్పుడే రూపుదిద్దుకుంటున్న ఆ పదహారేళ్ళ పిల్లాడిని చూస్తూ కూర్చుండిపోయింది.

ఎక్కడినుంచో నెగడు చుట్టూ లంబాడీలు నృత్యం చేస్తున్న సంగీతం పసిబిడ్డ ఏడుపు కాపుల ఇంట్లోనుంచి పొగ చవితి చంద్రుడు.

"సుభద్రా" భర్త పొలంనుంచి వచ్చినట్లున్నాడు. గబుక్కున లేచి వెళ్ళి పోయింది లోపలికి. ఆ రాత్రి రఘు భోజనానికి రాలేదు.

"ఎక్కడ తిరుగుతున్నాడో వెధవ. రానీ" అత్తగారి అరుపులకు సమాధానం చెప్పలేదు సుభద్ర. అంతకుముందే తను చూశానంటే ఏం ముప్పోనని మాట్లాడకుండా వంటిల్లు కడిగి ముగ్గుపెట్టి బయటపడింది. పుట్టిన మూడు నెలలకే తల్లికి మళ్ళీ నెల తప్పితే, తలచెడిన మేనత్త తీసుకువెళ్ళింది రఘును పెంచడానికి.

కృష్ణాజిల్లా పల్లెటూర్లో మోదుగచెట్టునానుకుని ఉన్న పెంకుటింట్లో, సాయం సంధ్య వేళ దీపపు బుడ్డి వెలిగించుకుని, తాటాకు విసనకర్రతో విసురుకుంటూ తత్వాలు పాడే ఆ మేనత్త అంటే చాలా ఇష్టం రఘుకు. ఆమె మహా సౌందర్యవతి. ఆమె కంటి రెప్పలపైన తెలుపు, గులాబీరంగు కలిసిన వర్ణం, కాటుక పెట్టినట్లుండే కళ్ళు, గులాబీ పెదవులు, తీర్చిదిద్దినట్లుండే పలువరుస. మరొకసారి చూడాలనిపించే మనిషి ఆమె. పొట్టు పొయ్యిలో పంట కాలవనించి తెచ్చే నీళ్ళూ - ఈ కష్టాలేవీ ఆమెను కదిలించలేదు. ఎందుకో ఆమె భర్తపోయిన తరువాత మనోవర్తి నాలుగెకరాలతో విడిగా వేరే ఊర్లో ఉండేది. అంతేకానీ, అన్నగారింటిని ఆశ్రయించలేదు. ఆమె దగ్గర మతిభ్రష్టుడైన ఒక వ్యక్తి ఉండేవాడు. వయస్సులో ఆమె కన్నా ఇరవై ఏళ్ళు పెద్దయిన ఆయన ఆమె భర్తకు సవతి అన్నగారట. అత్తగారి ఆస్తికి మిగిలిన ఏకైక వారసుడు అతని పిచ్చి ఏమంత ప్రమాదకరమైనది కాదు. ఎవర్నీ బాధించేది కాదు. పొలాల గట్టున తిరుగుతూ, సైకతలింగాలు చేస్తూ, స్నానాలు, జపాలు చేస్తూ తిరిగేవాడు. ఆమెకు, ఆయనకు ఏమిటి అనుబంధం అంటే సమాధానం లేదు. ఆయన లోకంలో ఆయనుంటే, ఆమె ఆయనను చూస్తూ కూర్చునేది.

"ఆ పిచ్చీ లేదు ఏం లేదు ఆ ముదనష్టపోడికి దాని రంకు మొగుడు. మాకు తెలియదా ఏమిటి? హాయిగా ఆ నాలుగెకరాల కొండ మీద ఐవేజుతొ ఇక్కడ మా దగ్గరుండచ్చుగా. రంకు నేర్చినమ్మ బొంకు నేర్వదా అని" దుర్గమ్మగారు చేతులు రెండు గాలిలో తిప్పుతూ దుమ్మెత్తిపోసేది. ఆడబడుచు గుర్తుకువచ్చినప్పుడల్లా.

కొంచెం పెద్దవాడైన తరువాత రఘు, "అత్తయ్యా! ఆయన ఎవరూ?" అని అడిగితే ఆకాశం, కొండా కలిసేచోటు చూస్తూ నవ్వి ఊరుకునేది ఆవిడ. పసిబిడ్డగా ఉన్నప్పటినుంచీ రఘును ప్రాణంగా పెంచేది ఆవిడ.

వెచ్చటి ఆవిడ స్పర్శలో తత్వాలు వింటూ హాయిగా నిద్రపోయేవాడు రఘు. ఆమె మంచితనం, సౌందర్యం, స్వాతంత్ర్యం అతని వ్యక్తిత్వంపై చెరగని ముద్రవేశాయి.

ఎప్పుడైనా ఆవిడతో తల్లిగారి ఊరుకు వచ్చినా, తల్లి ఏదో ఒక రకంగా ఆవిడతో తగూవేసుకోడం చూసి చిరాకు పుట్టేదతనికి. కానీ, మేనత్త మాత్రం దుర్గమ్మగారిని చూసి మూర్ఖపు పసిబిడ్డమీద జాలిపడుతున్నట్లు నవ్వేది. ఆవిడ మరింత రెచ్చిపోయేది. తల్లిమీద అంతర్లీనంగా పరమ భయంకరమైన జుగుప్స పెరిగిపోయింది రఘుకు. కారణం ఇది అని చెప్పలేక పోయేవాడు. ఏ ఆడదీ తల్లిలా మాత్రం ఉండకూడదనిపించేదతనికి.

హాయిగా సాగిపోతున్న రఘుజీవితంలో అత్తయ్య పిచ్చిబావగారి మరణం చెరగని ముద్రవేసింది.

వాళ్ళు ముగ్గురు దాయమాడేవారు. ఆ పెద్దాయన పక్షాన పందాలు కూడా తానే వేసి న్యాయంగా ఆడేది అత్తయ్య. ఓడిన వాళ్ళు గెలిచినవాళ్ళకు కర్జూరపు పండు ఇచ్చుకోవాలి. అవి కూడా ఆమె అందరి తరపున తెచ్చిపెట్టేది కంచంలో.

ఆ రోజు ఆట చూస్తూ ఏదో పిచ్చి నవ్వు నవ్వుకుంటున్నాడు ఆయన.

"రంగా! నువ్వే గెలిచావు" అంటూ తలెత్తిందామె. ఆమె వంక సూటిగా చూస్తూ, సన్నగా నవ్వి, పక్కకు జారిపోయాడు ఆయన. గబుక్కున ఆ మనిషిని గుండెలకు హత్తుకున్నది అత్తయ్య.

ఆయన వెర్రిచూపు, ఆమె కన్నీరు, శేషించిపోతున్న వెన్నెల, మిణుకు మిణుకు మంటున్న దీపం, దూరంగా ఎక్కడో పెళ్ళి భజంత్రీలు, ఇంటినానుకునున్న సరస్సులో కప్పల జీవస్మరణ సమీక్ష. అవన్నీ ఎప్పుడూ మర్చిపోలేకపోయాడు రఘు. ఆ తరువాత అతను చూసిన అనేక కృత్రిమ జీవన సరళులలో విరామ సంగీతంలా ఆ రాత్రి ఎప్పుడూ గుర్తుకు వస్తుంది అతనికి.

ఆ తరువాత ఆమె ఇల్లు అమ్మేసి, పొలం రఘు పేర రాసి వెళ్ళిపోయింది ఎక్కడికో. కొంతమంది "కాశీకి" అన్నారు.

దాదాపు పదిహేనేళ్ళ ప్రాయంలో అపరిచితుడిలా తన సొంత ఇంటికి వచ్చాడు రఘు. కొన్ని మధ్య తరగతి జీవితాల్లో డబ్బు ఇచ్చే హోదా, అధికారం చిన్నప్పుడే తెలుస్తుంది. రఘుకు ఇపుడు అందరికన్నా నాలుగు ఎకరాలు అధికం ఉన్నది.

"వాడు నా పోలిక ఎప్పుడూ అదృష్టవంతుడే" ఆడబడుచు పొడగిట్టకపోయినా, ఆవిడ ఆస్థిమీద ఏ మాత్రం అసహ్యం లేని దుర్గమ్మగారు రఘురాగానే మిగతా బిడ్డలకన్నా అతనికి ప్రత్యేకత ఇచ్చి, గారాబం చేసి నెత్తికెక్కించుకుంది. ఆ ధోరణితో మరింత బెట్టుగా ఉండేవాడు రఘు. ఆ పిల్లాడంటే ఒక రకమైన భయం ఉండేది సుభద్రకు. చూపుల్లో ఎర్రజీర, మితభాషిత్వం ఆమెను మరీ భయపెట్టేవి.

ఒకనాడు సాయంత్రం దొడ్లో మల్లెపందిరి దగ్గర నీళ్ళు పోసుకుని, ఇంట్లో ఎవరూ లేరుకదా అని గభాల్న చీర చుట్టుకు వచ్చేసింది సుభద్ర. గుమ్మం దగ్గర నిలబడి ఉన్నాడు రఘు. ఆమె ప్రాణం చచ్చిపోయింది 'ఎప్పటినుంచి అక్కడున్నాడో అయినా తన భర్త ఉన్నా, పాలేర్లు ఉన్నా, విరించి ఉన్నా రాని బెరుకు ఈ అబ్బాయిని చూస్తే కలుగుతుందేం' అనుకుని లోపలికి పారిపోయింది. ఒక రోజంతా తప్పించుకు తిరిగింది. మర్నాడు భర్తకు చెప్పి పాలారు చేత తడికల్తో స్నానాలదొడ్డి కట్టించుకున్నది.

"ఏనాడైనా ఎరుగుదుమా ఇట్లా మాట సాగించుకోవడం?" నవ్వుతూనే దెప్పింది ఆఖరి ఆడబడుచు జడవేయించుకుంటూ.

శుక్రవారమని తులసి దగ్గర దీపారాధన చేస్తోంది ఒంగి. వెలిగించిన దీపం ఆమె ముఖం మీద వింత కాంతి వలయం ఏర్పరుస్తోంది.

"వెంకన్నా! పెద్దమ్మగార్నడిగి కర్పూరం పట్టా మర్చిపోయి వచ్చాను" అంది సుభద్ర కరివేపాకు చెట్టు నీడలో ఉన్న మనిషిని చూడకుండానే.

మరునిమిషం మెల్లిగా, అరచేతిలో కర్పూరంతో నిలబడి సూటిగా చూస్తున్నాడు రఘు. ఉలిక్కిపడింది సుభద్ర. ఆ చూపుల వెనకాల అర్థాలు? ఆమె ఆలోచించడానికి కూడా భయపడింది. ఆమె పెద్ద చదువులు చదువుకున్నది కాదు. కాఫ్ లవ్, ఆడొలెసెంట్ ప్రేమలు ఆమెకు తెలియవు. కానీ, వాటన్నింటిని మించిన జ్ఞానం ఉన్నది. ఆమె స్త్రీ తరతరాల నారీ హృదయాల్లో స్పందించే రాగ రంజితత్వానికి ఎక్కడ తెరదించాలో ఆమెకెవరూ చెప్పక్కర్లేదు. అందుకే చటుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

అతణ్ణి తప్పించుకుని తిరిగేది. పలకరిస్తే ముక్తసరిగా మాట్లాడేది. కానీ, దూరం ఆ వయసులో మరింత దగ్గరతనాన్ని పెంచుతుందని ఆమెకు తెలియదు.

"వరుసగా మూడురోజులుగా అన్నానికి రావడంలా! ఈ చచ్చినాడికేమైందో?" తిడుతూనే బాధపడుతోంది అత్తగారి మాతృహృదయం.

పరీక్ష కోసరం ఆ రాత్రి వడ్డనకు రోజులా తప్పించుకోకుండా తాను వచ్చింది. ఎక్కడో తిరిగి వచ్చి, కాళ్ళూ చేతులు కడుక్కుని లోపలికి పోబోతున్న అతన్ని చూస్తూ, "అన్నానికిరా రఘూ! నీకిష్టమని కందిపచ్చడి చేశాను," అన్నది.

సూటిగా చూసి, మాట్లాడకుండా కంచం దగ్గర కూర్చున్నాడు అతను అర్థమైపోయింది సుభద్రకు. తనెంత జాగ్రత్తగా ఉండాలో కూడా అర్థమైంది.

"రేపు శ్రావణ శుక్రవారం చెర్లో తామర పువ్వులు తెమ్మనండత్తయ్యా! పూజ చేసుకుందాం" చెప్పింది అత్తగారికి.

"ఆఁ! ఎవరు తెస్తారే పాలేరు పక్కూరు తిరనాళ్ళకు పోయాడు. చూద్దాంలే" అంది దుర్గమ్మ మజ్జిగ చేస్తూ.

మర్నాటి పొద్దునకల్లా తామరపూవులతో వచ్చాడు పాలేరు. బోలెడంత సంబరపడిపోయింది సుభద్ర. అమ్మవారే కరుణించింది అనిపించింది. లేకపోతే, వాడికి ఈ ఆలోచన వచ్చి తీసుకురావడమేమిటి?

పూజ, భోజనాలు అయి పాలేరుకు అన్నం పెడుతూంటే, "ఆ తామర పూలకోసరం పోయి రఘుబాబు ముళ్ళకంచ మీద పడ్డారమ్మా. బాగా గీసుకుపోయింది. మీకెవరికీ చెప్పవద్దన్నారు" అన్నవాడి మాటలకు అవాక్కైపోయింది సుభద్ర.

పనంతా అయిన తరువాత, ఇల్లంతా వెదికి కొంచెం దూది, టించరు పట్టుకెళ్ళింది.

వడ్ల కొట్లో తలమీద చెయ్యి పట్టుకుని పడుకున్నాడతను. జాలేసింది సుభద్రకు.

"ఇదుగో ఇక్కడ పెడుతున్నాను. మందు వేసుకో" అంది గుమ్మమ దగ్గర నిలబడి.

చటుక్కున కళ్ళకు చెయ్యి అడ్డం తీశాడు. తలంటిపోసుకుని జారవిడిచిన జుట్టు, తాంబూలంతో పండిన ఎర్రటి పెదవులు, మామిడి చిగురు కుంకుమ, మెళ్ళో చంద్రహారం, చేతికి ఆకుపచ్చగాజులు కలసి అతని కళ్ళ మెరుపులో కనబడ్డ ప్రశంసలో ఏదో ప్రలోభం.

చటుక్కున వెనుదిరిగింది సుభద్ర. ఆమె గుండెల్లో ఏదో దడ, రక్తంలో ఏదో ఝరి.

"చిన్నమ్మగారు ఇయ్యాల చాలా బావున్నారు. కొత్తచీరేంటి?" పలకరించింది చాకలి రత్తి ఆ తర్వాత. ఆడదాన్లో నిద్రిస్తున్న సౌందర్యం మెరుపై అంబరమై, మహోర్ణవమై ప్రజ్వరిల్లి తటిల్లతా సౌందర్య దీప్తిగా వెలగడానికి కేవలం కొత్తచీర సరిపోదని తెలియదు పాపం దానికి.

ఆ రోజునుంచీ జీవితంలో కొత్త మలుపులు ఎక్కువైనాయి సుభద్రకు. ఆమె పూజకు అడక్కుండానే పూవులు వచ్చేవి. ఆమె ఇంటిపని చేసుకుని నడుం వాల్చే సమయానికి తాటిముంజులు ఆమె గది గుమ్మం ముందు ఒలిచిపెట్టి ఉండేవి ప్లేట్లో. తోటలోని మల్లెపూవులు సాయంత్రానికల్లా అరిటాకులో ఆమెకు అందచెయ్యబడేవి. వీటన్నింటి వెనకాల ఉన్న అదృశ్య హృదయం ఆమెకు అర్థమయ్యేది కానీ, అదిచ్చే గర్వంకన్నా, రానున్న పరిణామాల భయం ఆమెకు ఎక్కువై పోయింది. భర్తలోని అమాయకత్వం, నిశ్చింతా ఆమె బాధ్యతను మరింత ఎక్కువ చేసేవి.

"నేను ఈ ఇంటి పెద్దకోడలిని. దుఃఖమైనా, సుఖమైనా, కష్టమైనా, నిష్ఠూరమైనా ఈ కుటుంబ సుఖశాంతులు, మిగతావారి నైతిక విలువలు నామీద ఆధారపడి ఉంటాయి 'అమ్మా! అన్నపూర్ణా! నాకు ఆత్మశక్తి ప్రసాదించు. ఏ ప్రలోభాలకూ లొంగకుండా నీలో కలిసిపోయే అనుభూతి నాకు ప్రసాదించు' అని వెండికుందుల్లో దీపాలు వెలిగించి, ఎర్రమందారాలతో దేవిని అలంకరించి ప్రార్థించేది సుభద్ర.

"ఏమిటి నీ పిండాకూడు చాదస్తం. ఎంతకీ తెమలదేం ఆ పూజ? ఛస్తున్నాం. పిల్లలు అన్నాలకని కడబట్టిపోతున్నారు" అని అరచింది అత్తగారు ఓ రోజు.

ఎక్కడినుంచి వచ్చాడో మరొకసారి. తగూపెట్టుకున్నాడు రఘు. సుభద్రకు తెలుసు. తనను ఎవరేమన్నా అతను ఊరుకోడని. కానీ ఎలా అతన్ని ఆపడం? ఆమె చిన్న బుర్రకు ఈ సమస్యకు పరిష్కారం తెలియలేదు ఇది మరొకరకం ఆడదాని సమస్య అయితే, పరిష్కారం ఎలా ఉండేదోకానీ, ఆ వ్యక్తి సుభద్ర అవడంవల్ల సమస్య.

రఘుకు పద్దెనిమిదేళ్ళు దాటాయి. యవ్వనం అతనిలో మరింత విప్లవాన్ని రేపుతోంది. ఎక్కడెక్కడి తగాదాల్లోనూ తలదూర్చేవాడు. ఏ పని చేసినా అతిగా చేసేవాడు. పొద్దున్నే చెర్లో దూకితే సాయంత్రందాకా ఈదేవాడు. పట్నానికి సినిమాలకు పోతే మూడాటలు చూసి కానీ వచ్చేవాడు కాదు. తగాదాలకు దిగితే, ఎదుటి మనిషికి స్పృహ తప్పేదాకా కొట్టేవాడు.

ఎన్ని విషయాలు విన్నా ఏమనేది కాదు సుభద్ర. ఆమె వినాలనీ, ఏదో అనాలనీ మరీచేసేవాడు.

"చిన్నబాబును కాస్త కేకలెయ్యండమ్మా! ఆ సుబ్బారాయుడిగారి కోడలితో ఏటిఒడ్డున కనబడ్డాడట. ఆవిడ చెయ్యి పట్టుకోవడం చూశారట ఎవరో. అసలే ఆ మనిషి నీతీ జాతీలేని మనిషి" కబురు అందించి చల్లపోసి వెళ్ళిపోయింది రంగి. స్థాణువులా నిలబడిపోయింది సుభద్ర. అత్తగారు శాపనార్థాలు ప్రారంభించింది. రఘును, అతణ్ణి పెంచిన అత్తయ్యను అందర్నీ తిట్టింది. సుబ్బారాయుడిగారి కోడల్ని, ఆవిడ వంశాన్ని గుంటలో పెట్టి లేవనెత్తింది.

ఆవిడ బాధలో అర్థముందనిపించింది సుభద్రకు. రఘు వస్తాడేమోనని భయపడుతుండగా రానేవచ్చాడతను. తల్లి తిట్లన్నీ విన్నాడు. కానీ, చాలా విచిత్రంగా నోరు మెదపలేదు. సుభద్రను ఒక్కచూపు చూసి లోపలికి వెళ్ళిపోయాడు. ఆ కళ్ళల్లో వెటకారానికి ఒళ్ళుమండిపోయింది సుభద్రకు. ఒళ్ళు మర్చిపోయేటంత కోపమొచ్చింది. నేరుగా అతనితోపాటు గదిలోకి వెళ్ళి నిలబడి, "ఏమిటి నీ ఉద్దేశం? ఆ మనిషి ఎట్లాంటిదో తెలుసా?" గట్టిగా అడిగింది.

ఒక్కసారి ఆమెవంక చూసి, గడ్డం మీద చెయ్యి పెట్టుకుని రాసుకుంటూ ఎటో చూస్తున్నాడు అతడు. వచ్చే నవ్వు అణుచుకుంటున్నాడు. అది అసలు భరించలేని విషయం. భగ్గుమంది సుభద్రకు.

"మాట్లాడవేం?" సన్నటి ఆమె గొంతులో చాలా పదునుంది.

"ఊఁ! అందరూ సుభద్రలుకారుగా. తప్పుకో వదినా స్నానానికి వెళ్ళాలి."

అంత మెత్తగా చెప్పి అవాక్కయి నిలబడ్డ ఆమెను తప్పించుకుని స్నానానికి వెళ్ళిపోయాడు.

ఇలా ఈ జీవన్నాటకం ముగిస్తే ఎలా ఉండేదో కానీ, సుభద్ర అంత అదృష్టవంతురాలేం కాదు.

"పూర్ణం బూరెలు మీ ముఖంలా ఉన్నాయి. ఏమిటివి?" మామగారు కేకలేస్తున్నారు. అవిచేసింది చిన్నాడబడుచు. ఆ విషయం తెలియదు పాపం ఆయనకు. విస్తట్లోనుంచి దూరంగా పెట్టాడు రఘు.

"సుభద్రే చేసిండే పాపం పాకం కుదిరివుండదు" చిన్నాడబడుచు చటుక్కున అన్నది.

అప్పటిదాకా విడిగ తీసిపెట్టినవి నెయ్యి వేయించుకుని తింటున్నాడు రఘు.

"ఏం వదిన పేరు చెప్పగానే ఎక్కుతున్నాయేం రఘూ?"

అవాక్కైపోయింది సుభద్ర. ఆవిడ మాటల్లో వెటకారం, మరేవో అర్థాలు.

**బర్మామడి,** ఆర్టిఫిషియల్ దుద్దులు, తెల్లటి ఛాయ, మొహానికి రాసే రోజారంగు పౌడరు ఇవన్నీ బస్తీలో ఉండివచ్చే ఆవిడ లక్షణాలు. ఆవిడకు యావత్తు ప్రపంచం మీదా ఎందుకో తెలియని అసూయ. ఎప్పుడూ ముక్కు చిట్లించి కళ్ళద్దాలలోనించి చూస్తూ తప్పులు వెదకడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. ముగ్గురు పిల్లలు, మంచి భర్త ఉన్నా ఆవిడ ఎప్పుడూ ఎవరిమీదో ఒకరి మీద తన అసూయ గుమ్మరిస్తూనే ఉంటుంది. ఒక దీపావళి పండక్కి పులిహోర కలిపితే, చాటుగా ఆవిడ అందులో గుప్పెడు ఉప్పు కలపడం చూసింది సుభద్ర. ఎవరికి చెపుతుంది? దాని వెనుక వస్తువు పాడవడం కన్నా, మరో ఆడదానికి పేరు రాకూడదనే అసూయ ఉంది. ఆవిడ పుట్టింటికి వచ్చినప్పుడల్లా ఆమె పట్ల బహు జాగ్రత్తగానే ఉంటుంది సుభద్ర. ఆమె ఉన్నన్నాళ్ళూ ఆమెకన్నా నదరుగా ఎక్కడ కనిపిస్తానోనని వేలిముడిలోనూ, జిడ్డు ముఖంతోనూ ఉంటుంది. "ఏమిటా మడ్డి స్వరూపం? నా కూతురు చూడు" అని అత్తగారు కేకలేసినా లక్ష్యపెట్టదు. ఈ మాటలకన్నా ఆడబడుచు అసూయ సహింపలేనిది. అటువంటి మనిషి ఇవ్వాళ భళ్ళున ఒక మాట అన్నది. ఆ మాట అప్పుడు ఎవరూ పట్టించుకోనట్లున్నా అనుమాన బీజాలు మాత్రం నాటబడ్డాయి.

"నీతి జాతీలేని ఆడవాళ్ళ వల్ల కొంపలు కూలాయమ్మా" అని దీర్ఘాలు తీస్తూ మాట్లాడేది అత్తగారు.

"రఘు భోజనానికి రావడంలేదు. పిలువమ్మా" అతి వంకరగా అనేది ఆడబడుచు.

అది గ్రహించింది సుభద్ర. ఎవరూ బైటపడకపోయినా ఆ గాలిలో, ఆ గుసుగుసల్లో తన చుట్టూ ఏదో కథ అల్లుతున్నారని చెప్పకుండానే అర్థమయ్యేది సుభద్రకు.

అందుకే, వాళ్ళుండగా అతనితో జనాంతికంగా మాట్లాడేది. వాళ్ళు లేనప్పుడు అసలు పట్టించుకునేది కాదు. అది తెలివితక్కువ నిర్ణయమని ఆమెకు అప్పుడు తెలియదు. మనుషులు నింద వెయ్యడానికి ఆధారమక్కర్లేదని, రఘులో ఎందుకో పుట్టిన ఈ కార్చిచ్చు తను నిర్లక్ష్యం చేయడంవల్ల మరింత భగ్గుమంటోందని ఆమెకు అర్థం కావడానికి కొద్దిరోజులు పట్టింది.

కార్తీకమాస స్నానాలతో, మనసుకు, శరీరానికి కూడా అలుపుతో జ్వరమొచ్చింది సుభద్రకు. ఆమెను పెద్దగా పట్టించుకున్నవారెవ్వరూ లేరు. జ్వరం ఉన్నన్నాళ్ళూ లంఖణాలు, ఆ తరవాత చింతకాయ పచ్చడితో పథ్యం ఇది మామూలే ఆ రాత్రి ఆమెకు విపరీతమైన జ్వరం. భర్త పనిమీద బైటకు వెళ్ళాడు.

ఆమె చెయ్యిని ఎవరో ముట్టుకున్నట్లయింది. చటుక్కున లేచింది కాళిలా. రఘు ఆమె జ్వరం చెయ్యిని కళ్ళకు ఆనించుకున్నాడు. ఒక్కసారి గుండె గుభేలుమంది 'ఇంటిఇండా జనం. ఈ రాత్రి వేళ ఇతన్ని ఎవరైనా చూస్తే? అయినా ఈ అబ్బాయికి నా గురించి పట్టదా?' అనుకున్నది. ఒక్కసారిగా చెయ్యి గుంజుకున్నది. దుఃఖం, రోషం ఆమె ఏం చేస్తోందో ఆమెకే తెలియదు. కుంపటి మీదనించి పాలు దించి, అట్లకాడ కాల్చి ఆ చేతిమీద వాత పెట్టుకున్నది. ఆ చెయ్యి కోసేయాలన్నంత కచ్చ. వెనకాలే వచినట్లున్నాడతను "వదినా!" అని ఒక్క అరుపు అరిచి చటుక్కున అట్లకాడ లాక్కున్నాడు.

లైటు వెలిగింది.

"ఏవమ్మా? ఏమిటీ రాసక్రీడలూ.. అసలే జ్వరం కదా?" ఆడబడుచు కళ్ళల్లో రాక్షసానందం, ఏదో కూడని పని చూశానన్న శాడిస్టిక్ తృప్తి. ఏమైందో తెలియకుండానే సుభద్ర కళ్ళు తిరిగి పడిపోయింది. ఆమెకు మామూలు తెలివి తెలిసేటప్పటికి రెండురోజులైంది. ఇంటిల్లిపాదీ ఆమెను దోషిని చూస్తున్నట్లు చూస్తున్నారు.

తులసికోటకు తలవాల్చి, జుట్టు విరబోసుకుని ఆకాశంలోకి చూస్తూ కూర్చుంది సుభద్ర. 'భగవంతుడా ఏమిటీ పరీక్ష నాకు?' ఆమె గుండెలు మండిపోతున్నాయి.

అప్పటికి పదిరోజులుగా భర్త పొలం వెళ్ళిపోతున్నాడు రాత్రిళ్ళు. పొడి పొడిగా మాట్లాడుతున్నాడు.

ఆ రాత్రి చెప్పులు వేసుకుని వెళుతున్నవాడిని మెల్లగా ఆపింది.

కలంకారీ చీరలో కళ్ళకాటుకతో దేవతలా ఉన్నది ఆమె. కానీ, అతనికి పెద్ద చెల్లెలు, తల్లి చెప్పిన మాటలు వంటబట్టాయి. వాళ్ళు కాలక్షేపానికి అన్నట్లుగా రాద్ధాంతం చేసినా, ఆమె జీవితాన్ని ఆ మాటలు కాలనాగుల్లా కాటు వేశాయి.

"నువ్వేమనుకోకు. వాళ్ళు ఏవేవో అన్నారు. అయినా నేను నీకేం లోపం చేశాను? ఏమైనా నా మనసు సమాధానపరచుకునేదాకా నిన్ను ముట్టుకోలేను" గోడ పట్టుకుని ఎటో చూస్తూ నాలుగు మాటలు మాట్లాడి, చీకట్లో బేటరీలైటు తీసుకుని వెళ్ళిపోతున్న అతన్ని చూస్తూ గోడకు అలాగే చేరగిలపడిపోయింది ఆమె. "దేవుడా! నేనేం పాపం చేశానని నాకీ శిక్ష?" అని గుండెలవిసేలా ఏడిచింది. చచ్చిపోదామనుకున్నది చచ్చిపోతే తన నేరం మరింత ఎక్కువగా చిత్రీకరిస్తారేమో అని ఆగింది.

అంత దుఃఖంలో కూడా 'పాపం రఘు ఈ విషయం వింటే చచ్చిపోతాడు' అనుకున్నది.

'చావనీ నాకేం అసలు ఇదంతా అతని మూర్ఖత్వం మూలంగా కాదూ?'

ఆలోచిస్తూ దుఃఖపడుతూ నరకం అనుభవిస్తోంది ఆమె. నేను ఏ తప్పూ, ఏ పాపం ఎరుగనని భర్తకు ఎలా చెప్పాలి? దేముడిలాంటి ఆ మనిషిని బాధ పెట్టి నేనేం బావుకుంటానని? భగవంతుడా! నాకేదన్నా శిక్షవెయ్యి. ఇలా ఆలోచిస్తోందామె.

అదే ఈ గడ్డమీద పుట్టిన స్త్రీలోని విచిత్రం? ఆమెలో నీతి ఎంత మత్తులా పని చేస్తుందంటే, చెయ్యని తప్పుని ఆపాదించుకుని శిక్ష విధించుకోగల శక్తి ఆమెకు ఉంటుంది. మరి ఇది చూసిన సర్వేశ్వరి గుళ్ళో దీపం వెలుగుతూనే ఉన్నది. నదీ నదాలు ప్రవహిస్తూనే ఉన్నాయి. పువ్వులు, వెన్నెల వికశిస్తూ వెలుగుతూనే ఉన్నాయి. వీటన్నింటి ఆంతర్యం రంగరించుకుని, పవిత్రత కోసరం చందనపు కట్టెలలో సజీవ దహనమయ్యే స్త్రీమూర్తి ఆత్మాహుతి ఏ ధూళిగా మారి ఆ ఈశ్వరత్వాన్ని చేరుతుందో?

ఆంతర్యం నిద్రలేచిందంటే అది కార్చిచ్చు. తనను తాను చెయ్యని తప్పుకు హారతిగా అర్పణ చేసుకుంటున్న ఆమెకు, అమాయకుడైన తన భర్తను రక్షించమని ప్రార్థించి ఉపవాసాలు చేస్తున్న ఆమెకు, ఒక రోజు మధ్యాహ్నం వడ్లగది పక్కన పాలేరు పెళ్ళాం రంగితో తప్పుచేస్తూ కనపడిన భర్తను చూడగానే, చరచరా ప్రపంచం వణికి ముక్కలైపోయినట్లనిపించింది. ఆమెలో రక్తం గడ్డ కట్టుకుపోయింది. గిరుక్కున వెనుదిరిగి గదిలో కుప్పకూలిపోయింది. "ఆడదే కట్టుదాటుతున్నప్పుడు, ఉప్పూకారం తినే మొగవాడు

చస్తాడా?" అత్తగారికి తెలుసుకాబోలు ఆమె వినేట్లు అంటోంది. పొయ్యి కట్టెల మంటలో ఎసరులా కుతకుతలాడుతోంది మెదడు కాలిపోతున్నట్లనిపిస్తోంది. గడ్డం మోకాలు కానించి అలాగే కూర్చుండిపోయింది.

"రఘు నీకేమన్నా చెప్పాడే అమ్మాయీ?" మెల్లిగా తలెత్తి చూసింది. అత్తగారి మాటల్లో ఎన్నో అర్థాలు.

"ఊరెళ్ళాడు. కాలేజీలో చేరతాడట. ఇప్పుడప్పుడే రాను. నా పొలం డబ్బు పంపించమని రాశాడు" చెప్తోంది ఆవిడ. విని ఊరుకున్నది సుభద్ర. ఎంత హాయిగా వెళ్ళిపోయాడు. కానీ ఆలోచిస్తున్న కొద్దీ అతనిమీద కోపం రావడం లేదామెకు. శరీరాన్ని, మనసును అప్పగించిన భర్త, చాకిరి పొందుతున్న అత్తగారి కుటుంబం వీళ్ళలో ఎవరికి నిజాయితీ ఉందని? ఎవరు తన దుఃఖాన్ని పంచుకుంటున్నారను?

ఆ వెలుతురులేని తాటాకు వంటవసారాలో ఆమె కన్నీళ్ళు అలికిన నేలకు, ఆ అగ్ని దేముడికి అంకితమైపోయాయి.

ఎన్నో రాత్రులు అలా శూన్యంలోకి చూస్తూ పడుకున్నది. కళ్ళు నెప్పులు పుట్టేదాకా నక్షత్రాలు లెక్కపెట్టేది. మనసు నిద్రపోయేదాకా నక్షత్రాలు లెక్కపెట్టేది. మనసు నిద్రపోయేదాకా పంచాక్షరీ మంత్రం చదివేది. ఎక్కడో ఈ అండాండంలోని పవిత్ర భారతదేశంలో, ఆంధ్ర రాష్ట్రంలో మారుమూల పల్లెటూళ్ళో దురదృష్టవంతురాలైన ఒక స్త్రీమూర్తి దుఃఖంలో చేసే ఆ పంచాక్షరీ జపం ఆ పరమ శివుడికి వినబడిందో లేదో కానీ అర్ధరాత్రివేళ ఆమె భుజం మీద పడ్డ బరువైన చేతి స్పర్శకు ఉలిక్కిపడి లేచింది భర్త.

నా పవిత్రత మీద నమ్మకమొచ్చిందా? నాకన్నా పవిత్రులైన ఎంతమందిని ముట్టుకున్న తరువాత ఈ నమ్మకమొచ్చింది? నేను నీ భార్యనా? వాళ్ళలో ఒకదాన్నా? నేనేరకంగా నీకు ఎక్కువ?'

ఇన్ని మాటలు ఒక్కసారిగా సంధించిన బాణాల్లా ఆమెలో ఎక్కుపెట్టి నిలబడ్డాయి. పరా, పశ్యంతీ మధ్యమా ఇవిదాటిన ఆ మాటలు మంత్రాక్షరాలై వైఖరీ రూపం ధరించలేదు. కారణం అవి సంఘ స్వరూపాన్ని కూకటివేళ్ళతో కదిలించి, యాసిడ్‌తో కాలుస్తాయి. అంతపని ఆమెలో క్షమ కలిగిన నారీత్వం చెయ్యనివ్వదు. సంఘం పూజించే నైరాస్య దేవతలు, కర్మమూర్తులు ఎప్పటికప్పుడు స్త్రీలోని లావాను అణిచి, ఆత్మాభిమానాన్ని జోకొట్టి, సాంప్రదాయాల పొరలమధ్య సమాధికట్టి పూజచేసి గౌరవించాం పొమ్మంటారు. అందుకే ఆ రాత్రి సుభద్ర నిర్లిప్తంగా లొంగిపోయింది. కానీ తన చేతుల్లో నలుగుతున్నది చిలిపిగా, సౌందర్యదీప్తితో ఆత్మ సౌందర్యంతో వెలిగే స్వర్ణమూర్తి సుభద్రకాదనీ, సర్వస్వాన్ని ఈశ్వరార్పణం చేసి, కేవలం పాంచభౌతిక శరీరాన్ని కోరికలు తీర్చే సమిధిగా మారిన సుభద్ర అని అతనికి తెలియదు. కనీస్మ ఆ ఆలోచన కూడా రాలేదు.

కామం శ్మశానాగ్ని లాంటిది. దానికి చందనపు కట్టెలా, పన్నీటి పువ్వులా, తుమ్మచెక్కలా అని ఆలోచన ఉండదు. కాల్చడం ఒక్కటే తెలుసు. సగటు మగవాడి కోరికకూ అంతే తెలుసుమరి.

సుభద్రలో అన్నీ చచ్చిపోయినా, ఆప్యాయత అణిగిపోలేదు. ప్రతి ఒక్కరినీ అదే ఆప్యాతతతో ఆదరించేది. ఇంతకథకూ ఎదుగుతున్న విరించి ప్రత్యక్షసాక్షి. అతనికి ఈ కథలో చాలావంతు తెలుసు. అందుకే వదిన దేవత అతనికి. ప్రతి స్త్రీమూర్తిలోనూ ఆవిడను దర్శించడానికి ప్రయత్నించేవాడు. అప్పుడప్పుడు రఘు డబ్బుకోసరం వచ్చి రెండు రోజులు ఉండిపోయేవాడు. కాలగర్భంలో అనుమానాలు, కావేషాలు కలిసిపోయినా, సుభద్రలో వెనకటి ఆ సజీవమూర్తి లేదు. రఘు ఆమెతో మాట్లాడేవాడు కాదు.

పట్నంలో చదువు పూర్తిచేసుకోగానే అక్కడే ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నానని ఇంటికి పిడుగులాంటి ఉత్తరం రాశాడు రఘు.

ఇంట్లో అందరూ ఏకమై చాలాసేపు చర్చించుకున్నారు. కానీ ఆర్థికంగా స్వతంత్రుడూ, మొండివాడు అయిన అతన్ని ఇదేమిటి అని ఎవరూ అడగలేరు. ఆ కోపం ఆ పెళ్ళికూతురు మీదికి తిప్పుకుని 'ఎలాంటిదో, ఏ మత్తు పెట్టి వల్లో వేసుకుందో. సినిమా పిల్లేమో' అంటూ రకరకాల వ్యాఖ్యానాలు చేసి తృప్తిపడ్డారు. సుభద్ర ఏ విషయంలోనూ కల్పించుకోలేదు.

రఘు పెళ్ళైందని తెలియగానే పనిగట్టుకుని చూడ్డానికి వెళ్ళాడు విరించి. తెల్లగా, నాజూగ్గా, ఒంకుల జుట్టుతో చాలా బావుంది చిన్న వదిన లక్ష్మి. రెండురోజుల్లోనే ఆమె చాలా అర్థమైపోయింది అతనికి. ఆమెకు కోపం ఎక్కువ. మెటీరియలిష్టిక్ వర్ల్డ్ మీద విపరీతమైన కోరిక, డబ్బున్న అహం, అనాగరికత అంటే అసహ్యం ఇవన్నీ నచ్చలేదు విరించికి. ఆ మాట అనలేదుకానీ రఘుతో "ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంత తొందరపడ్డావేమిటిరా?" అని మాత్రం అన్నాడు.

"ఏమని చెప్పాలి? అయినా ఎందుకు చెప్పాలిరా? చాలు ముందు కారు, ఇల్లు బ్యాంకు బాలన్స్ ఉన్న పిల్లకావాలనుకున్నాను. దొరికింది. అంతే తండ్రి తప్ప ఎవడు లేరు. ఆయన రిజిష్టర్ మారేజీకి ఒప్పుకున్నారు జరిగిపోయింది."

"నీకు మేం అందరం ఉన్నాం కదరా" కొంచెం బాధ అనిపించింది విరించికి రఘుమాటలకు.

"ఒరేయ్ ఒక విషయం చెప్పనా విరించీ? ఈ పదేళ్ళు ఇంటికి దూరంగా ఈ మహాపట్నంలో ఉండి చాలా నేర్చుకున్నాను నేను. అన్నీ బావుంటే అందరూ ఉంటారు. కానీ మనకేం కావాలో ఎవరికీ అక్కర్లేదు. ఎంతసేపూ వాళ్ళ లెక్కల ప్రకారం మనం ఉండాలనుకుంటారు. ఆ రకంగా మనని వాళ్ళ చట్రాల్లో బిగించి సుఖపెడదామనుకుంటారు. మనం దొరక్క తప్పించుకుంటే ఎదురు తిరిగామని ఏడుస్తారు. ఈ బంధుత్వాలు, ఆప్యాయతలు, ఈ వ్యవస్థ" అతని ఆవేశానికి నవ్వుకున్నాడు విరించి.

"చిన్నక్కయ్య నువ్వు తన పెళ్ళికి లాంఛనాలివ్వలేదని గోలచేస్తోందిరా" నవ్వుతూ అన్నాడు.

"ఆవిడకా! ఆఁ ఇస్తాను లాంఛనాలు రమ్మనమను. ఒరేయ్ ఒక విషయం. వీళ్ళెవరూ నాకు కనబడకుండా ఉంటే ఆరోగ్యం?" అతని మాటల వాడి వెనకాల కాలే అతని ఆంతర్యముంది. సుభద్రకు జరిగిన అన్యాయమున్నది. విరించికి అర్థమైంది. ఎవరేం చెయ్యగలరు? రఘు మగవాడు కాబట్టి తప్పించుకున్నాడు. వదిన ఎలా తప్పించుకోగలదు? కనబడ్డప్పుడల్లా మాట్లాడుకోవడాలు, ఆడపడుచుగా ముత్తైదువులుగా కూర్చుని వాయినాలు అందుకోవడాలు అన్నీ మామూలే. ఇప్పటికీ వదిన చిన్నక్క కాళ్ళకు దణ్ణం పెడుతుంది. పండగనాడు భర్త కాళ్ళకు దణ్ణం పెడుతుంది.

తనలో జీవిని అంతర్ముఖం చేసుకుని తనకు జీవితేచ్ఛను చంపేసిన ఈ మనుషులకు అనువు వంచి నమస్కరింపచేసే ఈ వ్యవస్థలో ఏదో గొప్ప ఔన్నత్యమన్నా ఉండాలి. పర్వర్టిజం అన్నా ఉండాలి. మా ఇంటి మరో కోడలు లక్ష్మి. ఆమెకు ఏ సెంటిమెంటూ పెద్దగా లేదు. అందుకే వదినలా ఏ బాధ్యతా, ఏ నిందా కూడా మొయ్యదేమో? కానీ, సుభద్ర అంటే ఆరాధించిన రఘు మరి లక్ష్మిలాంటి సరిగ్గా వ్యతిరేకమైన అమ్మాయిని ఎలా ఇష్టపడ్డాడో?

"చిన్న వదిన ఎలా దొరికిందన్నయ్యా?" గబుక్కున అడిగేశాడు ఆలోచనలలోనుంచి.

"సింపుల్. అందరికీ సుభద్రలు దొరకరుకాబట్టి" నోట్లో సిగరెట్టు పెట్టుకుంటూ, ఒకచేత్తో కారు డ్రైవ్ చేస్తూ అన్నాడు.

అవాక్కైపోయాడు విరించి. ఏమిటి వీడి ఉద్దేశ్యం? అంటే, వదిన చెయ్యని నేరానికి శిక్ష అనుభవించింది తనవల్లే కాబట్టి, తన చుట్టూ అభేద్యమైన కోట కట్టుకుని, అందులో ఎవర్నీ అడుగుపెట్టనీయకుండా ఒంటరిగా అందులో కుమిలిపోతున్నాడా వీడు? అందుకే భార్యగా అధికారాలు చెలాయించే అమ్మాయి, తన మనసు గురించి ఆలోచించని అమ్మాయిని చేసుకుని తనకు తను శిక్ష విధించుకున్నాడా? తల దిరిగిపోయింది విరించికి ఏదో అడుగుదామనుకునేలోపల.

"దిగు స్టేషన్ వచ్చింది. అందర్నీ అడిగానని చెప్పు" కారు రివర్స్ చేస్తూ వెళ్ళిపోతున్న అన్నగార్ని చూస్తూ నిలబడిపోయాడు విరించి.

**ఈ కథంతా** గుర్తుకువచ్చింది విరించికి. అలా పడుకున్న సుభద్రవంక కన్నార్పకుండా చూశాడు. కళ్ళకింద చారలు, తలలో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు, నీతి తాలూకు కోటలో నిద్రపోతున్న ఆత్మ. పిల్లలు లేని ఆ మాతృమూర్తికి అందరిమీదా ఆప్యాయతే. ఇప్పటికీ ఆమె మారలేదు. సహనం పోలేదు. పక్షవాతం వచ్చిన అత్తగారికి, కీళ్ళవాతం వచ్చిన మామగారికి సేవచేస్తూనే ఉన్నది. చేస్తున్న ప్రతిపనీ పూజలా చేస్తోంది. ఈ అనంత జీవనయాత్రలో ఇది ఒక మజిలీ అని ఆమె అనుకోవడం లేదేమోకానీ, ఆమె జీవన విధానం మాత్రం అదే

"నువ్వు ఏదన్నా ఉద్యోగం చెయ్యరాదూ?" అని వదిన కేకలెయ్యగానే, ఎవరో స్నేహితుడి రికమండేషన్ మీద ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా జీవితం ప్రారంభించి, ఒక పేరెన్నికగన్న పత్రికలో స్థిరపడ్డాడు.

"విరంచీ! కాఫీ తాగుదాం రా" అని పిలిచాడు రాఘవ. అతను సబ్ ఎడిటర్ అయినా దాదాపు 'ఈ తరం' పత్రికకు జీవనాడిలాంటివాడు. అతనంతే మహా ఆకర్షణ విరించికి. అతనిలోని మేధావి అంటే కొంచెం భయం కూడా. ఏదో రాసి, నాలుగు డబ్బులు జేబులో వేసుకుని పోకుండా చాలా విషయాలు చర్చనీయాంశాలుగా చేసి పాఠకుల ముందు పెట్టి ఒక్కొక్కసారి చిక్కుల్లో ఇరుక్కుంటాడు కూడా అతను. కానీ, దేనికీ భయపడడు. మేరు సమాన ధీరుడు. తక్కువ మాట్లాడి, ఎక్కువ చెబుతాడు.

కాఫీ తాగుతూ రాఘవ టేబుల్ మీదకు ఒంగి చూశాడు. ఆత్మలు ఉన్నాయా లేవా అని వచ్చేవారానికి చర్చనీయాంశం కాబోలు తయారు చేస్తున్నాడు.

"ఏమిటిసార్ ఈ గోల? దిక్కుమాలిన ఆత్మలు ఉంటేమనకేల? పోతే మనకేల?" అన్నాడు సాగదీస్తూ విరించి.

నవ్వేశాడు రాఘవ.

"అందుకే నువ్వంటే నాకిష్టం"

"దేనికి? దిక్కుమాలిన ఆత్మలు అన్నందుకా?"

"కాదు నువ్వు ఏది చెబుదామనుకుంటావో, సరిగ్గా దానికి రివర్స్‌లో మాట్లాడతావు"

"అదేం గొప్పకాదు. అసలు ఏది ఆలోచిస్తున్నామో దానికి వ్యతిరేకంగా మాట్లాడేవాళ్ళు, మనకు గురుతుల్యులు, హిపోక్రసీలో డాక్టరేట్ ఉన్నవాళ్ళు చాలామంది ఉన్నారు."

సన్నగా నవ్వేశాడు రాఘవ. ఇంతలో ఎవరో యువకవి వచ్చాడు.

రావడమే చాలా దూకుడుగా వచ్చాడు. కుర్చీ బర్రున లాగి కూర్చున్నాడు. అతన్ని చూడగానే ఫైలులోనించి ఏదో కాగితాలు తీసి ఇస్తున్నాడు రాఘవ.

విరించి చుట్టూ చూశాడు. మామూలు చెక్కబల్లలు, కొన్ని గాడ్రెజ్ కుర్చీలు, వాటిమీద ఏ మాత్రం కళాత్మకంగా లేని రబ్బరు స్టాంపులు, జీవంలేని ఫైళ్ళు, వాటి మీదకు వంగి నిరాసక్తిగా పనిచేస్తున్న మనుషులు - కానీ వీళ్ళందరి సమ్మేళన శక్తి నుంచి ఒక గొప్ప పత్రిక వెలువడుతోంది. దాని వెనకాల మేధస్సు రాఘవలాంటివారిది.

"మేం అచ్చేసుకోం అంటే ఎలా సార్? నేను నా కవిత్వాన్ని శ్రీశ్రీకి అంకితం చేశాను. ఆయన పోయిన సంవత్సరమిది.." అరుస్తున్నాడతను గట్టిగా.

"సారీ! దానికీ, దీనికీ సంబంధం లేదు.."

"ఎందుకు బాగోలేదసలు?" మొహం నిండా కండలు చించుకుంటూ అడిగాడు. అతన్ని పరీక్షగా చూశాడు విరించి. మంచి ఖరీదైన పాంటు షర్ట్, వేలికి రవ్వల ఉంగరం, కారాకిళ్ళీ, షోగ్గా కనిపించాలనే ప్రయత్నం. చేతిలో ఆకలి కవిత్వం.

రాఘవ ఏం చెబుతాడో చూద్దామని అతనివంక చూశాడు.

"అది పబ్లిష్ చెయ్యడానికి అనువుగా లేదు."

"ఆ విషయం చెప్పడానికి మీరెవరు? అసలు ఏమిటి లోపం?" సంస్కారం మరిచి, అది పత్రికా ఆఫీసు అని కూడా తెలియకుండా అరుస్తున్నాడతను.

రాఘవలో అణుచుకున్న కోపం తీక్షణమైపోయింది. "మీరు రాసినది కవిత్వం కాదు. మాటల్ని పేర్చడం. మొదటి లైనుకూ, తరవాతి లైనుకు అసలు సంబంధం లేదు. అందులో హృదయముంటే కవిత్వమౌతుంది. కానీ, మీరు రాయాలని రాసినట్లుంది. పేరు కోసరం కలాన్ని రుధిరాగ్ని, రుతురక్తం, ఎర్రసూర్యుడు - లాంటి పదాలతో భ్రష్టం చెయ్యొద్దు. మాదేకాదు ఏ పత్రికా వేసుకోదు."

"ఆ విషయం చెప్పడానికి మీరెవరు? ఎవరూ వేసుకోకపోతే నేను స్వంతంగా అచ్చేసుకుంటాను. ఎవరు కాదంటారు? అయినా, శ్రీశ్రీకి అంకితమిచ్చిన కవితను మీరు కాదన్నారని అల్లరి రేపగలను నేను" ఉద్రేకంతో చేతులూ బారలు చాపుతూ అంటున్నాడతను.

ఒళ్ళు మండిపోయింది విరించికి.

"శ్రీశ్రీ మీకు తెలుసా?"

"ఆఁ!"

"ఎలా?"

"ప్రతి విప్లవ కవికీ ఆయన ఆదర్శ పురుషుడు"

"విప్లవం అంటే ఏమిటి?"

"అన్యాయానికి ఎదురు తిరగడం. ఏం చిన్నపిల్లాడిని అడుగుతున్నట్లు అడుగుతున్నారు?" గట్టిగా అన్నాడు.

ఆ హాల్లో అందరూ అవాక్కై వింటున్నారు. గుండుసూది పడితే వినబడేటంత నిశ్శబ్దమైపోయింది.

"ఇంతవరకు మీరు ఏ అన్యాయాలకు ఎదురు తిరిగారు?"

"అంటే?"

"పోనీ. శ్రీశ్రీ రాసిన కవిత్వం ఎంత వచ్చు? ఏ పతితలకు, బాధాసర్పదష్టులకు సహాయం చేశారు మీరు? ఎవరి కన్నీళ్ళు పంచుకున్నారు? ఏ మానసిక దుఃఖాన్ని ఓదార్చారు? ఆచరించిన పని చెప్తే మంత్రంలా పనిచేస్తుంది. దానికి అక్షరం సౌందర్యాన్ని ఇస్తుంది. అప్పుడది కవిత్వమౌతుంది. కనీసం ఆయన కవితను అందంగా కాపీ కొట్టడం కూడా రాదే మీకు" ఉద్రేకంతో ఊగిపోతున్నాడు విరించి.

మెల్లిగా అతని భుజం మీద చెయ్యి పడింది. రాఘవ నవ్వుతూ అతన్ని చూశాడు. అందులో ప్రశంస ఉంది. ఉద్రేకం తగ్గించుకోమనే అర్థింపు ఉంది. ఇది బాధ్యతాయుతమైన ఆఫీసు అన్న మందలింపు ఉంది.

తగ్గిపోయాడు విరించి.

"మీ పత్రిక కాబోతే మరొకటి" విసురుగా ఫైలు తీసుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడాకవి.

విరించి దగ్గరకు వచ్చి నిలబడ్డాడు విశ్వనాథం. ఆయన ఆ పత్రిక మూలగ్రల్లో ఒకడు. ఆయన కళ్ళల్లో తెలియని ఆనందం. ఆయనా, శ్రీశ్రీ మంచి స్నేహితులు. ఆయన పోయిన దుఃఖం ఆ కవిమిత్రుడి హృదయంలో ఆరని మంటగా మిగిలిపోయి ఒక గొప్ప ఎడిటోరియల్ రాయించింది.

"విరించీ! కృష్ణుడు గోవర్ధన గిరి ఎత్తినప్పుడు దాని కిందికి గోవులూ చేరాయి, పాములూ చేరాయి అంటారే. అలాగే వీళ్ళ సంగతీనూ" అన్నాడాయన. మెల్లిగా వెళ్ళి సీటులో కూర్చున్నాడు.

వాతావరణంలో ఇంకా బరువు తగ్గలేదు. ముఖ్యంగా రాఘవ ఉద్రేకం అణుచుకోవడం వల్ల మరింత గంభీరమైపోయాడు. అదేనేమో అతని అందం. మనిషి నిజమైన స్థిరమైన సౌందర్యానికి కారణం జ్వలించే మేధస్సు. విశాలమైన ఫాలభాగం, మత్తుగా ఉండే కళ్ళు, సన్నటి పెదవులు. అతను ఇలా ఉంటాడు అని చెప్పలేం. ఏవేషం వేస్తే ఆ వేషానికి సరిపోయే గొప్ప మోల్డింగ్ ఉన్న ముఖం అతనిది. అతను మరి అంతేనో, నటిస్తాడో కానీ చాలా సింపుల్‌గా కనబడతాడు.

అలా చూస్తూ గబుక్కున నవ్వేశాడు విరించి. ఆశ్చర్యంగా తలెత్తాడు రాఘువ.

"గురువుగారూ! మీకొక విషయం తెలుసా? ఇవ్వాళ మిమ్మల్ని వెతుక్కుంటూ ఒక అమ్మాయి వచ్చింది"

వాతావరణం చల్లబడింది.

"నన్నా? ఎందుకు?"

"ఆ... ప్రేమిద్దామని"

మొదట అర్థంకాక, తరవాత చటుక్కున నవ్వేశాడు రాఘువ.

"తీరికలేదని చెప్పండి.."

"గొప్ప అపరాధం సార్. వనిత తనంతతావలచి వచ్చిన..."

"ఇంతకీ ఏమిటి విషయం?"

"నిజంగానండీ"

"రేపు మళ్ళీ వస్తుందిగా నువ్విలా అన్నావని చెపుతాలే"

"సార్..సార్ చీరెయ్యగలదు. అదేం లేదు. మీ ఎడిటోరియల్స్ అవీ చదివిందిట.

మిమ్మల్ని చూడాలని వచ్చింది పాపం" రాగయుక్తంగా అన్నాడు.

"చేతిలో ఏదన్నా ఫైలు.."

"ఉందండీ.. పర్సు, ఫైలు"

"అయితే ఎవరో అభ్యుదయ రచయిత్రి"

"ఛా పాపం" చాలా జాలిగా అన్నాడు.

"ఎవరికట?" తలెత్తి నవ్వుతూ అన్నాడు రాఘువ.

"పొండి గురువుగారూ ఏదో గొప్ప థ్రిల్ క్రియేట్ చేద్దామనుకుంటే.."

"నాకా థ్రిల్ ఉన్నవాళ్ళం పత్రికలకు సబ్ ఎడిటర్లమేమిటయ్యా! ఈ సీటుకుంది విలువ. మాకు కాదు. అదంతే. ఊం! ఇంకా ఏమిటి విశేషాలు?"

విరించి ఏదో ఒకటి చెపుతాడు. లేకపోతే విరించే కాడు.

కౌముది

"సార్! 'లేచిపోవుట' మీద మీ అభిప్రాయం ఏమిటిసార్?" చాలా సిన్సియర్‌గా అడిగాడు.

అప్పుడే టైం అయిందని చాలామంది సీట్లు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు.

"ఎందుకుట? ఎవరు ఇప్పుడు నీతో ఆ పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నారు?"

"మా పక్కింటి సుమైతాంగి"

"అదేం పాపం?"

"మంచి ఉద్యోగం. షిఫాన్ చీరలు, సెటిల్‌మెంటు ఉన్న ఉద్యోగం. థ్రిల్ లేదుట పాపం. ప్రేమిద్దామని ప్రయత్నించింది. నేను కొరుకుడు పడలేదు. పోనీ పెళ్ళి చేసుకుందామని ప్రయత్నం"

"ఏది.. నిన్నే?"

"ఆఁ నాకన్నా ఏడేళ్ళే పెద్దది సార్. అయినా షేక్స్‌పియర్ చేసుకోలే"

"మధ్యలో ఆయనెందుకు కానీ, మరి లేచిపోవడం అంటావేమిటి?"

"అదా?! సుమైతాంగినికి మనం లొంగుతే మా ఇంట్లో టాప్ లేచిపోవడం సార్."

పెదవి నొక్కిపట్టి నవ్వుతున్నాడు కళ్ళతో రాఘవ. అతని కళ్ళల్లో విరించి అంటే ఉండే ఆప్యాయత వెలుగుతోంది.

"అది సరే సార్. ఆదివారం మా ఇంట్లో రచయితల మహాసభ. రూం చిన్నది. కాబట్టి అడ్డమైనవారిని తీసుకురావద్దని ప్రార్ధన" చెప్పి పోబోయాడు విరించి.

"విరించీ! ఇవ్వాళ నీకొక వింతవ్యక్తిని చూపిస్తాను. ఆశ్చర్యపోతావు"

తన గదిలో ఉన్న రెండు కుర్చీలూ ఇంటిగల బామ్మగారిని కాపాడమని అప్పచెప్పి, ఆవిడనే వేడుకుని రెండుచాపలు అడిగి తీసుకుని, ఎదురుపడ్డ సుమైతాంగి కళ్ళజోడులోనించి ఇచ్చే సందేశాల్ని తప్పించుకోడానికి భరత నాట్యం చేసినంత పనిచేసి గదిలో పడ్డ విరించి, ఎదురుగా కూర్చునివున్న రాఘువ మాటలకు ఉలిక్కిపడ్డాడు.

"మీకూ, నాకూ కూడా వింతగా కనిపించే వ్యక్తా సార్? మనిషే?" తలమీద దుమ్ము దులుపుకుంటూ ఆశ్చర్యంగా అన్నాడు విరించి.

ఆకాశం అప్పుడప్పుడే చల్లబడదామని ప్రయత్నిస్తోంది. అరవ మామి వాళ్ళింట్లో సందె ముగ్గు వేస్తున్నారు. దాహం తీరిన నేలలో ఏదో మాదకత.

"ఎవరు సార్ ఇంతకీ?" చాపలు సర్దేసి, మంచి నీళ్ళు తెచ్చేసి, అప్పు అడిగిన ఫ్లాస్క్ నిండా కాఫీ పోసేసి మెల్లిగా అడిగాడు విరించి.

"చూద్దువుగానిగా .. బైదిబై. నీ పర్మిషన్ లేకుండా ఈ నీ సభకు ఆహ్వానించేశాను మరి.. నిన్నే చెప్పావు కూడా"

"దాన్దేముంది సార్. పుష్పక విమానం ఈ గది. ఇంతకీ ఎవరు సార్?"

"నమస్కారం..." రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తున్నదామె గుమ్మం దగ్గర నిలబడి.

"సార్. ఈవిడే."

"రండి.. ఈమె ఉమ. ఈ మధ్యే కొంచెం పేరు తెచ్చుకుంటున్న రచయిత్రి. ఇతను విరించి. జర్నలిస్టు. నా ఫ్రెండ్ ఈ రూం ఇతనిదే.' పరిచయం చేశాడు రాఘువ.

అటే చూస్తున్నాడు విరించి. ఈవిడనే నిన్న చూసి రాఘువకు చెప్పింది. 'బతికిపోయాను. తెలియక ఏమైనా కూశాను కాదు' అనుకున్నాడు.

ఆ తరవాత మరొక ఎనిమిది మంది రచయితలు ప్రవేశించారు. అందులో యాభై ఏళ్ళ పైబడ్డ ఒకామె తప్ప మిగతా వాళ్ళంతా రచయితలే. ఆవిడకు ఆ భేదం లేనట్లుంది. హాయిగా ఉంది. ఎటొచ్చీ ఉమ సమక్షంలో బోలెడంత ఇబ్బంది పడ్డారు మిగతావాళ్ళు. ఏ మాత్రం ఇబ్బందిగా ఉన్నా, బైటకు చూపెట్టకుండా హాయిగా ఉన్నది ఉమ.

భలే పిల్ల అనుకున్నాడు విరించి.

ఏవో గేయాలు, మాటల గాయాలు, మధ్య మధ్య రాజకీయ పార్టీ గోలలు, టీలు, కేకలు, ఒక క్రూర రచయిత కవితాగానం - అది చాలా బావున్నా ఆవిషయం చెప్పేవారు లేరు. "నేటి స్త్రీలు పురుషుల దురహంకారం" అనే టాపిక్ మీద రెండు పేజీలు చదివారు ఆ పెద్దవయసు రచయిత్రి. అక్కడున్న మిగతా పురుషులంతా నోరు మెదపకుండా విన్నారు. ఈ ఫార్స్ అంతా ఇంతింత కళ్ళతో చూస్తూ కూర్చున్న ఉమ ఒక్కమాట మాట్లాడలేదు. ఈవిడ ఏమిటసలు? అని అలా చూసేస్తున్నాడు విరించి.

మెల్లిగా అందరూ శలవు తీసుకుని కదిలారు. "మీరు చలంగారి జీవితం మీద ఏదో సమీక్షలాంటిది రాశారు. అందులో రమణ మహర్షితో వారి అనుబంధం వివరించడం అంత అవసరమా అన్నట్లు రాశారు. నాకేం నచ్చలేదది" సూటిగా రాఘవను చూస్తూ అన్నది ఉమ.

ఉలిక్కిపడ్డాడు విరించి. ఆశ్చర్యంగా ఆవిడను చూశాడు. చెవులకేవో రాళ్ళు పెట్టుకున్నట్లుంది. మెరుస్తున్నాయి. గుండ్రటి బొట్టు, కాటుక కళ్ళు, పెద్ద జుట్టు ముక్కుపుడక పెట్టుకుంటే ఎందుకో వదిన గుర్తుకు వచ్చిందతనికి.

**రాఘువ** మామూలు తెల్లబట్టల్లో అతి సాధారణంగా కనబడుతున్నాడు. కానీ, దాని వెనకాల ఏదో కనబడని కాంతి. ఇంటలెక్చువల్ అంటే ఇతనేనా? అతని చూపుల్లో అల్లరి ఉంది. ఎందుకింత మోకరీ ప్రపంచం అంటే ఇతనికి? అర్థం కాలేదు. అతన్ని అర్థం చేసుకుందామని చాలాసార్లు ప్రయత్నించాడు. కానీ ఒక పట్టాన కొరుకుడు పడడతను.

"మాట్లాడరేం?" మళ్ళీ అడిగింది ఆమె.

"తప్పంటారా?" నవ్వుతూ అడిగాడు.

"తప్పు, ఒప్పు సమస్య అక్షరాలకు లేదు. అవి స్వేచ్ఛావిహంగాలు. సర్వేశ్వరుడికి రూపమే ఉంటే అక్షరాలు ఆయన అంతర్ బహిర రూపాలు"

"మరి?"

"చలం జీవితాంతంలో నమ్మిన ఒక గొప్ప తాత్వికదర్శనానికి, భగవాన్‌తో అనుభవాల పరంపరకు అసలు అస్తిత్వం లేనట్లు మీరు ముఖ్యంగా మీరు రాయడమేమిటి అని?"

గదిలో ఒక్క క్షణం నిశ్శబ్దం మృదువుగా మోగింది. ఏ మాత్రం డిసిప్లిన్‌లేని ఈ బ్రహ్మచారి గదిలో ఈమె పాచి గోడమీద వెన్నెల్లా ఉంది అనుకున్నాడు విరించి.

"నాకు తెలిసిన చలం - నా తెలుగు దేశానికి తెలిసిన చలానికి మొదట్లో ఈ గందరగోళం అక్కరలేదు. కానీ, ఆ తరవాత ఆయనలో ఈ అన్వేషణ ఒక మలుపులో ప్రారంభమయింది. ఈ పాంచభౌతిక శరీరం, దాన్లో శాశ్వతాత్మ వగయిరా మెటాఫిజికల్ కబుర్లు చెప్పడానికి చలమే అక్కరలేదు, చాలామంది ఉన్నారు. దేశాన్ని తన అద్భుతమయిన భాషతోనూ, తాత్కాలికమయినప్పటికీ

సౌందర్యపూరిత భావనతోనూ కదిలించిన చలం, అన్నేళ్ళు రమణాశ్రమంలో ఉండి. తనుగా ఏం కనిపెట్టాడు? ఏమిటి ఆయనను కదిలించింది? కానీ విశ్వేశ్వరుణ్ణి మ్లేచ్ఛుడొకరకంగా, శంకరులు ఒకరకంగా, సామాన్యుడు ఒకరకంగా చూశారు. విశ్వేశ్వరుడొక్కడే చూసింది, బతికింది చలం కాబట్టి, చలంగా భగవాన్‌ను సమీక్షించి మనకేం మిగల్చలేదే అని నా బాధ. మిగతా అందరిలా మతం మత్తులో, తత్వమసిలో మునిగిపోయి మిగతావారి మాటలతో తన ఆలోచనలు రూపుదిద్దుకున్న ఆయనకన్నా, తెలిసిన అనుభవాలతోనో, ప్రతిరోజుకొక మార్పుతో ఎదుగుతున్న జ్ఞానంతోనో, దేశంలో ఒక వర్గంవారి రక్తంలో వెచ్చని ఆవిరి, గుండెల్లో గాడ్పులు తెచ్చిన 'చలం' కావాలి నాకు" సూటిగా స్పష్టంగా చెపుతున్నాడు రాఘవ.

గదిలో ఏదో నిశ్శబ్దం మళ్ళీ ఆవహించింది. విరించికి తెలిసీ రాఘవ ఇన్ని మాటలు మాట్లాడ్డం ఇదే మొదటిసారి.

"మీరు భగవంతుణ్ణి నమ్మరా?"

పొడుగాటి జడ ముందుకు వేసుకుని, మడిగాళ్ళ మీద కూర్చుని అడుగుతున్న ఆ అమ్మాయిని చూసి "బాబోయ్" అనుకున్నాడు విరించి. అతని దృష్టిలో సాధారణంగా అలా ఉండే ఆడపిల్ల 'మీకు ఏ సినిమా హీరో అంటే ఇష్టం? మీ ఫేవరెట్ క్రికెటర్ ఎవరు?' అని అడగాలి మరి.

"అసలు భగవంతుడు అంటే ఏమిటి? మీరు ఏర్పరచుకున్న ఈ భావాల రమ్యహర్మ్యాలనుంచి కొంచెం బయటపడితే, ఆలోచించే అవకాశం ఉంటుందేమో"

"పోనీ మీరు చెప్పండి"

"ఎక్కడున్నాడని ఈ భగవంతుణ్ణి మీరంతా ఇంత పాపాలభైరవుణ్ణి చేసేస్తున్నారు? అహం బ్రహ్మోస్మి అనేమాట నమ్మదలచుకుంటే అంతా భగవత్స్వరూపులే. మరి ఈ అసహ్యతంతా ఏమిటి? సర్వవ్యాపితత్వం, సనాతనత్వం, కనబడుతూ కూడా కనబడనట్లుండడం వగైరా ఊహలన్నీ భగవంతుడైతే, ప్రస్తుతం విద్యుచ్ఛక్తి భగవంతుడవ్వాలి. ఈ గుణాలన్నీ దానికీ ఉన్నాయిమరి. భగవంతుడి చుట్టూ ఏవో చీల్చలేని పొరలు కప్పి, జనాన్ని భయపెట్టడం కన్న నా దృష్టిలో భగవంతుడు ప్రతి గొప్పకళలోనూ, ఉన్నతాత్ముడైన వ్యక్తిలోనూ, సౌందర్య పూరితమైన భావనలోనూ రూపుకట్టుకుంటాడు. ఐన్ స్టీన్ క్వాంటమ్ థియరీ తరవాత కూడా మనుషులు మా దేముడు, మీ దేముడు అని నరకాల్ని సృష్టించుకుంటున్నారంటే, ఈ మూఢత్వం నించి విడిపోవడం వాళ్ళకిష్టమైనా లేకుండా ఉండాలి లేదా సాహసమైనా లేకుండా ఉండాలి. విశ్వవ్యాప్తమైన దాన్లో తన సజీవతను ప్రతిబింబింపచేసుకుని, తనలో సర్వ ప్రపంచాన్నీ పునర్జీవింపచేసుకునే ప్రతిభావంతమైన థియరీ ఉన్నదని ఎవరికి తెలుసు? అవన్నీ చదవండి. ఆ తరవాత భగవంతుడి గురించి మాట్లాడండి" చిన్న పిల్లలకు హోం వర్క్ ఇచ్చి, పుస్తకం మూసేసే టీచర్‌లా ఆపేశాడు రాఘవ.

"ఇన్ని తెలిసిన మీరు, ఇవన్నీ ఎందుకు చెప్పకూడదు?"

"ఎవరికి? వినేవారు ఎవరు? ఎవరికి కావాలి అసలూ. ఇంత మెటీరియల్ ప్రపంచంలో ఏ అనుబంధం మీరు చెప్పే మనుషులకు సంధీకృతం ఆపుతుందని అడుగుతున్నారీ ప్రశ్న? ఈ నా థియరీ నేను చదివిన చదువు, సర్వం మా ఆఫీసులో చెక్కబల్లలకి అంకితమై, ఎంతవరకు వినోదాన్ని కళాత్మకంగా సృష్టించి పేపర్ సర్క్యులేషన్ పెంచగలమో తెలుసుకుని తద్వారా నా జీతం పెంచుకోడానికి ఉపయోగపడుతోంది. ఎంతవరకూ నా కుటుంబ స్థాయిని ఆర్థికపరంగా సంఘంలో పెంచగలమో అనేదాన్నిబట్టి నా మనుష్యులు నాకు ఖరీదు కడుతున్నారు. ఆలోచింపచేసేది. అదేదైనా చాలా తక్కువ మందికి కావాలి. తమ జీవన సుఖాలను గమ్యంలేని ప్రయాణాలుగా నిర్వీర్యపరిచి ఎదురు నిలబడి యుద్ధం చెయ్యనిది, కాలక్షేపానికి నాలుగు కొటేషన్స్ వాడుకోగలిగినది అయిన సూడో ఇంటలెక్చువాలిటీ ప్రతిఫలించే సాహిత్యంకావాలి కానీ, ఆలోచింపచేసి, తన అస్థిత్వాన్ని మహా భయంకర సంచలిత జ్ఞానసాగరాల్లో ముంచితేల్చే ఏ తత్వం,

ఏ శాస్త్రం, కళా, కావ్యమూ ఎవరికీ అక్కర్లేదు. కావాలి అనుకునేవారు ఉంటారేమో కానీ వాళ్ళను వేళ్ళమీద లెక్కవెయ్యవచ్చు. సర్వేశ్వరుడి అస్థిత్వాన్ని గురించి మాట్లాడక, ప్రతి వ్యక్తి సర్వేశ్వరత్వాన్ని పొందే మార్గం చూపెట్టిన బుద్ధుణ్ణి దేముణ్ణి చేసి, ఆయన చెప్పింది కాలగర్భంలో కలిపేసిన తెలివిగలవారు ఈ జనం. సోక్రటీస్ బతికుంటే ఆలోచింపజేస్తాడేమోనని భయపడి బలవంతంగా చంపేసింది ఈ జనం. శంకరుల అన్నపూర్ణాష్టకం చదివి కోరికలు తీరతాయని దీపం పెట్టే ఈ జనం, ఆయన చెప్పిన మిగతావి ఏమి అనుసరిస్తున్నారని? ఆయన మాయావాదాన్ని ఖండించే ఈ తెలిసీ తెలియనివారు జగత్తు మిధ్య భగవంతుడు సత్యం. భగవంతుడే జగత్తు అన్న వాదంలో మూడోమాట మర్చిపోయి భంగపడుతున్నారు. అందుకని, ఈ జనాన్ని తట్టి లేపడంకన్నా జోకొట్టడం సులభం. అది అంతే"

గోడకు చారగిలబడి రెండుకాళ్ళూ చాపి అవాక్కై వింటున్నాడు విరించి. ఏదో సరదాకి, కాలక్షేపానికి, రచయితల్లో మనుష్యుల్ని చూసి నవ్వుకుందామనే దిక్కుమాలిన కోరికతోటి పెట్టిన ఈ మీటింగ్ ఇవ్వాళ చాలా గొప్పమలుపు తిరుగుతోంది. అందులో ఒక వ్యక్తి స్త్రీ అవడం మరీ తమాషాగా ఉంది. కానీ పర్యవాసం?

రాఘవగారూ మనుషులందరూ ఒక లెవెల్లో ఉండరు. సృష్టిలో మానవత్వం అనేది కేవలం మిధ్యావాదం. ఎక్కడుందది? ఔన్నత్యం ఉన్న ఏ వ్యక్తీ తన కిందిమెట్టుమీద ఉన్నవాడిని చూసి నవ్వుకోడు. నవ్వుకుని హేళన చేసేవాడెపుడూ ఉన్నతుడవడు. జాలిపడతాడు. చేయూతనివ్వడానికి ప్రయత్నిస్తాడు. జెక్ ఫిలాసఫీలు, అణువును విచ్ఛేదన చేస్తే ఏర్పడే పరమాణువుల సముదాయం, వాటి మధ్య ఆకర్షణ, వికర్షణల స్వరూపం హిందూ మిథాలజీలో కాస్మిక్ ఎనర్జీకి ప్రతిపాదితమైన నటరాజనృత్యం అని తెలిసీ నటరాజును పూజ చెయ్యఖ్ఖరలేదు. కేవలం ఏదో నమ్మకంతోనో, ఆర్తితోనో ప్రారంభం అయ్యే ప్రతిపనీ తరవాత సత్యాన్వేషణకు దారితీయవచ్చుగా! అటువంటివారికి మీబోటి మేధావి వర్గం చేయూత ఇవ్వచ్చుగా?"

ఖంగుమంటోంది ఉమ కంఠం. ఆమె గొంతులో మృదుత్వం పదును వున్నది.

రెండు చేతులూ కట్టుకుని ఆమెవంకే చూస్తున్నాడు రాఘవ. ఏమిటీమె? ఏం చెబుదామని ప్రయత్నిస్తోంది? అతని ఆలోచనా తరంగాలు ఆమెను తాకినట్లున్నాయి.

"సారీ! మిమ్మల్ని ఇంప్రెస్ చేద్దామని మాట్లాడ్డంలేదు. చాలాసార్లు మీ సమీక్షలు, పుస్తకాలు చదివాను. మీరు చాలా గొప్పగా చదువుకున్నవారు. కానీ ఏదో సినిసిజంతో కొట్టుకుపోతున్నారనిపించింది. ఈ వాదన కూడా కరెక్ట్ కాదేమో నేనే వేటినో కొన్ని సిద్ధాంతాలను హేతువాదాలకు అందని వాటిని నమ్మి ప్రపంచాన్ని తిరగాబోర్లా చూస్తున్నానేమోనని అనుమానమొచ్చింది. కొన్ని వందల పుస్తకాలు చదవడం కన్నా ఒక సజీవమైన వ్యక్తితో, నా సబ్జెక్ట్ అర్థమైన వ్యక్తితో వాదించి చాలా నేర్చుకోవచ్చనిపించింది. అందుకే, మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను."

మాట్లాడలేదు రాఘవ. గాలిలోనించి పక్కింటి అరవమామి పోట్లాట వినిపిస్తోంది. దూరంగా ఎక్కడో రైలుకూత, కారు ఆగిన చప్పుడు. వీటన్నింటి మధ్యా విరామ సంగీతంలా అప్పుడప్పుడూ కోయిల కూస్తోంది.

కానీ, ఇదంతా నేపథ్యమే. విరించికి ఊపిరి అందడంలేదు. మహా సరదాగా ఉన్నది. కాస్త భయంగానూ ఉన్నది. వాతావరణం ఏదో తెలియని కొత్తకాంతితో ఎల్క్ట్రిఫై అయిందనిపించింది. తెలియని తెగింపు వచ్చింది.

"ఉమగారూ మీరేం చదువుకున్నారు?"

"ప్రైవేట్‌గా ఎమ్.ఏ చేస్తున్నాను"

"సబ్జెక్ట్"

"లిటరేచర్"

"మీరు రచయిత్రులు కదా వెంటనే తప్పుగా అర్థం చేసుకోకండి అడిగితే"

"అడగండి."

"మీకు పెళ్ళైందా?"

"ఎందుకిప్పుడా ప్రశ్న?"అని అడగలేదు ఉమ. తలెత్తి సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది. ఆ చూపులో ఏముందో తెలియదుకానీ, రాఘవకు వెన్నెముకలో ఏదో తెలియని చల్లదనం.

చేతిలో ఏమన్నా ఉంటే వేసి మొహం పగలకొడుతుందేమోనని పక్కకు తప్పుకోవాలనిపించింది విరించికి.

వెంటనే ఒక్కసారి నవ్వేసి "లేదు సరే వస్తాను. మరొకసారి కలుసుకుందాం. నమస్తే" మెల్లిగా లేచి, కుచ్చెళ్ళు సుతారంగా దులుపుకుని వెళ్ళిపోయింది. గాలిలో తేలే ఆమె అందెల సవ్వడి వింటూ స్థబ్దులై కూచుండిపోయారు ఇద్దరూ.

ఉన్నట్లుండి ఒక్కసారి గట్టిగా నవ్వేశాడు రాఘవ.

"ఎందుకు గురువుగారూ నవ్వుతున్నారు?" అంటూ తనూ నవ్వాడు విరించి.

"మనిద్దరం ఒక మహాప్రమాదం నుంచి తప్పుకోడానికి ప్రయోగించిన చాలా మామూలు ట్రిక్‌ను తలుచుకుని.."

"సార్! ఇంతకీ ఆవిడ ఎవరన్నారు?"

"ఏమో? నాకూ తెలియదు. ఇల్లాగే ఒక మీటింగ్‌లో పరిచయమైంది. ఆవిడ నవల ఒకటి మన పత్రికలో వేశాంలే"

"సార్.. ఆ నవల ఎలా ఉంది?"

"ఏమో చాలా సెంటిమెంటల్ అనుకున్నాను అప్పుడు. మరొకసరి చదవాలి. చాల ఇండిపెండెంట్ టైప్‌లా ఉన్నది. ఎక్కడైనా ఉద్యోగం చేస్తోందేమో? పద అలా బైటకి వెళ్దాం" చాలా మామూలుగా అని బైటకు వెళ్ళారు ఇద్దరు.

కానీ, ఇద్దరూ దారిలో ఏమాత్రం తర్కించనిది, నిమిషం మర్చిపోనిది ఒకటే.. 'ఉమ'

ఇంటికి వెళ్దామని బయలుదేరాడు రాఘవ. అతను ఆఫీసు ముందునుంచే వెళ్ళాలి. వాకిట్లో గూర్ఖా. చీకట్లో రేపు ప్రసవించబోయే సాహిత్యాన్ని, రాజకీయాల్ని కడుపులో దాచుకుని నిద్రపోతున్న ఏదో ఊహకందని రూపంలా ఉన్నది 'ఈ తరం' ఆఫీసు ఒక్క క్షణం తారట్లాడాడు.

"కౌన్?" అరిచాడు గూర్ఖా.

సమాధానం చెప్పి లోపలికి వెళ్ళాడు. లైట్లు లేసి ఏదో ఫైల్ వెతికాడు.

అందులో ఒక కటింగ్ దొరికింది.

ఉమాదేవి.. 22 ఏళ్ళు. వీణ వాయిస్తారు. వగైరా వివరాలున్నాయి. "సాహిత్యంలో స్పందన ఉండాలని నమ్ముతారు" ఈ ఒక్క విషయం తప్ప, ఆ నీరవ నిశీధిలో ఆ జీవంలేని నల్లటి అక్షరాలు మరేం మాట్లాడలేక పోయాయి.

ఆలోచిస్తూ బయటికి అడుగువేశాడతను.

"ప్రతి పరిచయం స్నేహం అవ్వాలని, ప్రతి స్నేహం చాలా గొప్పదవ్వాలని ఎక్కడున్నది సార్? స్నేహం గొప్పదే కాదనను. 'ఇందుకు' అని తెలియని స్నేహం మటుకు చాలా ప్రమాదకరమైంది" అన్నాడు విరించి.

రాఘువ, విరించి రామకృష్ణా లంచ్ హోంలో కాఫీ తాగుతున్నారు చాలా పురాతనమైన ఆ హోటల్‌కు చాలా గొప్ప చరిత్ర ఉన్నది. బైటనించి వచ్చే కదంబవాసనలు, లోపలినించి వచ్చే మసాలా దోశల వాసనలూ కలగాపులగం అయిపోయి వింత మాదకత ఉంటుంది గాలిలో, అక్కడ కాఫీ చాలా ప్రసిద్ధి.

వారిద్దరి సబ్జెక్ట్ 'ఉమ'. ఆ మొదటి పరిచయం తరవాత నాలుగుసార్లు కలిశారు. ప్రతి కలయికలోనూ రాఘువలోని మేధావిని చూసి ఉమ చూపే ఆరాధన చాలా నిష్కల్మషంగా ఉండేది. అన్ని పొరలు విడదీసి అతనికి అలా దగ్గరైనవారు ఎవరూ లేరు. అందుకని అతని దృష్టిలో ఉమ కేవలం అడ్మైరర్‌గా ఆగిపోలేదు.

గొప్ప రచయిత, ఒక గొప్ప పత్రికకు ఎడిటర్ అయిన రాఘువ లోపల ఒక మొగవాడు. జీవితంపట్ల ఉదాసీన భావం ఉన్న వ్యక్తి ఉన్నాడు. అందుకే అతని అలౌకిక తార్కిక జ్ఞానం అతడి జీవితానికి ఉపయోగించలేదేమో? ఉమ ఏదో తెలుసుకోవాలి అని ప్రశ్నించినప్పుడల్లా, అతను ఆమెను వాదనతో నోరు కట్టించేవాడు. అందులో అతనికి ఏదో ఇగో శాటిస్‌ఫాక్షన్.

"దెయ్యాలు ఉన్నాయా అనే శీర్షిక నిర్వహించినంత మాత్రం చేత మా ఆఫీసులో కుర్చీలూ, బెంచీలూ కూడా దెయ్యాలేనని నమ్మాలనే సిద్ధాంతం ఏం లేదు. ఏదో పొట్టకూటికి ఉద్యోగం చేస్తున్నాంకానీ, ఇదంతా ట్రాష్ అనే వాళ్ళు మా మధ్యే ఉన్నారు. మనుషుల్ని కొనగలరేమోకానీ, వాళ్ళ ఆలోచనలను కొనలేరుగా" అన్నాడు రాఘువ ఉమ ఆ సబ్జెక్ట్ ఎత్తినప్పుడు

"నాకు మాత్రం హనుమంతుడి దండకం వచ్చు. నేను విపరీతంగా నమ్ముతాను" నిజాయితీగా ఒప్పుకున్నాడు విరించి. అతను పొలం గట్ల మీద ఉండే మోహినీ పిశాచాల గురించి, కొరివి దెయ్యాల గురించి వినే ఉన్నాడు.

"భయం బేస్‌గా కొన్ని నమ్మకాలు పూజింపబడతాయి. అప్పుడప్పుడు పాపం భగవంతుడు కూడా ఆ కోవలోకి చేర్చబడతాడు. అది కాదు సబ్జెక్ట్. అసలు ఈ విషయం మీద ఇంత డిస్కషన్ నిర్వహించే మీరు నిజాయితీగా ఎందుకు ఆలోచించరు? మీరు నమ్మని విషయాలు, ఆలోచించడానికే వ్యతిరేకించే విషయాలు ఎదుటివాళ్ళ నెత్తిమీద రుద్దుదామని ఎందుకు ప్రయత్నం? సిన్సియారిటీ లేని ఈ పనివల్ల ప్రయోజనం ఏమిటి?"

ఆమె అడుగుతున్న ప్రశ్నకు జవాబు చెప్పదలుచుకోలేదతను. మామూలుగా అయితే 'ఒక థియరీనో, ధర్మాన్నో, న్యాయసూత్రాన్నో కేవలం కొన్ని వాక్యాలుగా మార్చి ప్రచురిస్తే ప్రజలు దాన్ని చాలా మాటరాఫ్ ఫాక్ట్‌గా తీసుకుంటారు. చర్చనీయాంశం చేస్తే ఆలోచించడం ప్రారంభించి ఒకరినుంచి ఒకరు చాలా నేర్చుకుంటారు' అని సమాధానం చెప్పేవాడేమో కానీ కాసేపు ఆమెను ఏడిపిద్దామనిపించింది.

"ఒక నిజం అది నిజమేనని నిర్ధారింపబడినపుడు అది దాని ఔన్నత్యాన్ని కోల్పోతుంది అన్నాడు గదా ఆస్కార్ వైల్డ్" అని తప్పించుకున్నాడు.

మాట్లాడకుండా వెళ్ళిపోయింది ఆమె. ఆ తరువాత పదిహేను రోజులు కనబడలేదు.

రాఘువలోని గొప్ప వ్యక్తిత్వం తను అద్దెకుండే 250రూపాయల ఇంట్లోకి వెళ్ళగానే మారిపోతుంది. తప్పదు. తల్లికి మందులు, తెలివిగా ప్రవర్తించాలనుకునే భార్య తీసుకునే అతి జాగ్రత్తలు అలవాటైపోయాయి. కానీ ఎందుకో ఉమ 'హాంటింగ్ మెమరీ' అయిపోయింది. అయినా, ఆడపిల్లకు అంత తెలివి ఏమిటసలు అని విసుక్కున్నాడు.

సెలవులు వచ్చాయని పిల్లల్ని స్నేక్‌పార్క్‌కు తీసుకు వెళితే అక్కడ చూపించిన నాగుపాము ఎండలో మిలమిలా మెరుస్తూ పడగ విప్పడం చూశాడు. ఉమ గుర్తుకు వచ్చింది.

అష్టలక్ష్మి గుడి పై ప్రాకారం మీద నుంచి అస్తమిస్తున్న సూర్యకాంతిలో మెరుస్తున్న అమ్మవారిని చూసినప్పుడు ఉమే గుర్తుకు వచ్చింది.

కలుసుకోవడం తప్పదనిపించింది. కానీ కనీసం ఆమె ఆహ్వానించలేదు. అడ్రస్‌కూడా లేదు. దానికోసం ప్రయత్నిస్తే దొరక్కపోదేమో కానీ అభిమానం అడ్డు వచ్చింది.

"అయినా, ఆడపిల్లకు అంత ఆలోచనా, ఆ గోలా ఏమిటి విరించీ అన్నాడొరోజు ఆపుకోలేక.

"**ఉండకూడదా** గురువుగారూ! పైగా రచయిత్రి కదా?"

"నా మొహం" రకరకాల నవలా వైతరుణల్లో మునిగి విసుగెత్తిపోయినవాడు అతను.

ఆ తరవాత ఏదో రిఫరెన్స్ కోసరం థియసాఫికల్ లైబ్రరీలోకి వెళితే కనబడింది ఆమె.

ఆ చల్లటి చెట్లనీడలో ఆధ్యాత్మికత స్పందించే పాలరాతి గోడల నీడల్లో, కొన్నివేల మందికి జ్ఞానప్రదానం చేసి అంతర్ముఖుల్ని చేసిన ఆ నిశ్శబ్ధ సంగీతంలో మళ్ళీ వారి స్నేహానికి లయకుదిరింది.

"ఇక్కడ బౌద్ధారామం చూశారా? చాలా బావుంటుంది" లోపలికి వెళుతూ, నడిపించింది.

అక్కడి అలౌకిక సౌందర్యం, ఆ కొలను, వెదురుపొదలు అతనిలో కవిని, సౌందర్యారాధకుడిని నిద్రలేపాయి. మాట్లాడుతున్న ప్రతిమాటలో స్వవిషయాలు రాకుండా జాగ్రత్తపడ్డారు ఇద్దరూ. ఏమి కావాలో అవి వద్దనుకోవడం ఇద్దరికీ సుఖం.

"రండి. మిమ్మల్ని డ్రాప్ చేసి వెళతాను" అంటూ తన ఫియట్ డ్రైవింగ్ సీటులో కూర్చునేదాకా, ఆమె అంతస్తు అతని ఆలోచనల్లోకి కూడా రాలేదు.

"ఒద్దు" అంటూ నడిచివెళ్ళిపోయాడతను. ఆ తరవాత జీవితాన్ని మోకరీగా, ప్రేమను కేవలం ఎగోఫీలింగ్‌గా చిత్రీకరించే రాఘవ "నిజం చెప్పు నేస్తం. నీకేం కానా నేను?" అని కవిత్వం రాశాడు.

"గురువుగారూ ఏం బాగాలేదు విషయం. పెళ్ళైన మీకు ఈ బాధేమిటి?" విరించి కొంచెం సీరియస్‌గానే అన్నాడు.

"పర్యవసానాలు లేని స్నేహాలు సుఖం విరించీ ఇందులో ఇచ్చుకోవడాలు, పుచ్చుకోవడాలు, దాచుకోవడాలు, పోగొట్టుకోవడాలు ఉండవు."

"నా బొంద" అని వెళ్ళిపోయాడతను.

ఆ తరవాత ఆమెను షాపింగ్ సెంటర్‌లో తల్లితండ్రుల మధ్య పొందిగ్గా నడుచుకుంటూ నగల దుకాణంలోకి వెళ్ళడం చూశాడు. పలకరించలేదు. ఆమె అలంకరణ ఆమె ఎంత గొప్పదో చెప్పాయి. 'ఇల్లాంటి పిల్ల విరించి గదికి అలా వచ్చిందే' అనుకున్నాడు.

"నా పెళ్ళండీ" అంటూ ఇన్విటేషన్స్ తీసుకుని వచ్చి స్టాఫ్‌కంతా పంచింది. చందనం కార్డుమీద బంగారు అక్షరాలు. ఆమె తండ్రిపేరు చదవగానే ఉలిక్కిపడ్డాడు విరించి. ఆయన లైన్స్ క్లబ్‌మెంబరు. ఇన్‌కంటాక్స్ ఆఫీసరు. "ఓరి నాయనో" అని ఆశ్చర్యంగా చూశాడు ఆమె వంక. మామూలుగా నవ్వుతూ వెళ్ళిపోయింది.

"చేసుకోబోయే ఈ అభాగ్యుణ్ణి తన ఇన్టలెక్చువాలిటీతో చంపుతుంది కాబోలు గురువుగారూ" అనబోయి రాఘవ మొహంలో 'ఇది అని చెప్పలేని భావాన్ని చూసి నోరు మూసుకున్నాడు.

పెళ్ళికి వెళ్ళకూడదనుకుంటూనే ఆఖరి క్షణంలో వెళ్ళారు. "స్నేహానికి సంకేతం పుష్పగుచ్ఛమే"నని పాడుకుంటూ బొకే పట్టుకొచ్చేశాడు విరించి.

ఏం కొనాలా అని వెతికాడు రాఘువ.

"అయినా, వాళ్ళ పెళ్ళికి మనమేమిటి సార్ ఇవ్వడం? ఏమివ్వగలం అయినా? ఓ ఊదివత్తి స్టాండు కొని, ఒక రెండు రూపాయలిచ్చి పెద్ద పేకేజి చేసి తీసుకువెళ్ళడమే" అని ఉచిత సలహా ఇచ్చాడు విరించి. మాట్లాడలేదు రాఘవ. సన్నటి ఉల్లిపొరలాంటి పేపర్లోనించి మిలమిలా వెండి లేసులా మెరుస్తున్న పాంజేబు పట్టాలు తీశాడు. వేలికి, పట్టాకు సన్నటి వెండి చైనుతో కలిపి, ఏదో పాతకాలపు రాజకుమార్తె నగలా ఉన్నది అది.

ఏదో అనబోయి నోరు మూసుకున్నాడు విరించి. పెళ్ళికొడుకు నల్లగా ఉన్నాడు. హుందాగా ఉన్నాడు. కానీ ఆ పెళ్ళిపందిరి, వాతావరణం ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. ఒక్కసారి హోదా, డబ్బు, నగలు, మర్యాదలు ఝల్లున మీదబడినట్టై, భోజనాలు కూడా చెయ్యకుండా పారిపోయివచ్చేశారు. అన్నింట్లోకి భరించలేనిది ఉమ అలంకరణ. ఒక లక్షరుపాయల నగలు, ఐదువేల రూపాయల చీరతో ఉమను ఉమగా చూడలేకపోయారు. పెళ్ళి పందిరినించి బైటకురాగానే ఏదో ఉపద్రవంనించి బైటపడ్డట్టైంది.

"ఎన్ని కబుర్లన్నా చెప్పనీయండి గురువుగారూ. ఆడపిల్లలు హోదాలకు, డబ్బుకు లొంగిపోతారు. మనకు తెలిసిన స్నేహమయి ఉమకు, ఆ పెళ్ళికూతురు ఉమకు ఏమన్నా సంబంధం ఉందీ?" ఓ రోజు విరించి ఆఫీసు అయిపోయిన తరవాత ఊసుపోకకు రాఘువతో అలా మాట్లాడుతూండగానే.

'ఉమ' చచ్చిపోయిందని తెలిసింది.

ముందు మామూలుగా ఉన్నా తర్వాత తలుచుకుని, తలుచుకుని ఏడ్చాడు విరించి, శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు రాఘువ. అతని దుఃఖం మానసికమైనది. అందుకే తేరుకుని విరించిని సముదాయించాడు.

ఆఖరిసారిగా ఉమ మృతదేహాన్ని చూద్దామనుకుని కూడా భరించలేమని రాలేదు ఇద్దరూ.

ఆ తరవాత రిజిస్టర్డ్ పోస్ట్‌లో ఉత్తరం అందింది విరించికి. ఒక వారం ఆలోచించి తరవాత రాఘువకు చెప్పాడు. చెప్పకూడదనుకుంటూనే చెప్పాడు. ఆ ఉత్తరం విశ్వజననీయమైంది. ఒక్క విరించికో, రాఘువకో సంబంధించిందికాదు. అందులో తను విపరీతంగా గౌరవైంచిన 'ఉమ' సందేశముందు. అది ప్రపంచానికి తెలియాలన్న తపన ఉంది. అందుకే అది పబ్లిష్ చెయ్యాలని పట్టుదలమీద ఉన్నాడు విరించి.

## 8

జరిగిందంతా తన భాషలో చెప్పి గటగటా గ్లాసెడు మంచినీళ్ళు తాగాడు విరించి. అతనివంకే చూస్తూ జరిగినదంతా ఊహించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు శంకరం.

ఈ జరిగిన విషయం ఏదీ ప్రతిరోజూ ఉమకు దగ్గరగా ఉన్న తల్లికి, తండ్రికి, చెల్లెలికి అర్థంకాదు. చెప్పినా ప్రయోజనం ఉండదు. వాళ్ళ జీవన సరళివేరు. ఉమ ఆలోచనా విధానం వేరు. ఈ ఉత్తరం చూస్తే సినిమాలోలాగా "అమ్మా ఉమా! నిన్ను అర్థం చేసుకోలేకపోయాం తల్లీ" అని ఒక్క అరుపు అరిచి వసుంధరకానీ, బావగారుకానీ, రమ కానీ విరుచుకుపడిపోరు. పైగా ఆ పిల్లను మరింత తిట్టుకుంటారు.

అయినా రెసెప్షన్‌లో చక్కటికోటు, బటన్ హోల్‌లో రోజా పువ్వు పెట్టుకున్న రంజిత్, ఉమను ఎంత బాధ? ఊహించుకోను కూడా లేకపోయాడు శంకరం.

పొడుగాటి జడతో పొందిగ్గా, ఏ సిద్ధాంతాన్నో చర్చిస్తూ ఆ చల్లటి థియసాఫికల్ సొసైటీ నీడల్లో గడిచే వెన్నెల బొమ్మ ఉమ. దానికేం కావాలో కూడా తెలియదే ఎవరికీ ఈ ఉత్తరం చూసేదాకా? 'ఏం పెళ్ళిళ్ళవి? గోబీ ఎడారిలో పశువుల మందనీ, స్త్రీలనూ కూడా

ఆర్థికస్థాయికి చిహ్నంగా, వ్యాపారానికి కేంద్రంగా చూశారంటే అనాగరిక చరిత్ర అని తిట్టే ఈ సమాజం ఇప్పటికి మాత్రం ఏం ఎదిగిందని? అయినా ఇప్పుడేం చెయ్యాలి?

"సార్! ఏమిటి ఆలోచన?" విరించి అడిగాడు. శంకరం తేరుకున్నాడు.

"చూడు విరించీ మా అమ్మాయి ఇలా ఉంటుందని, ఇలా ఆలోచిస్తుందనీ కూడా మావాళ్ళెవరికీ తెలియదు. ఈ ఉత్తరం నీది కాబట్టి ఏం చెయ్యడానికైనా నీకు హక్కుందనుకో. నాకు ఒక్క నాలుగైదురోజులు టైం ఇవ్వకూడదూ. ఆలోచించి చెప్తాను" అన్నాడు.

ఆలోచించాడు విరించి. "సరేసార్.. మీ ఇష్టం కానీండి. కానీ దీని మట్టుపెట్టమని మాత్రం చెప్పకండి సార్. నిజంగా మీకు ఉమగారు నాకు తెలిసినంతగా తెలిసి ఉంటే అలా మాత్రం చెప్పరు సార్" అతని కళ్ళల్లో అంతలో నీటితెర.

'ఉమా! ఏమిచ్చి ఈ ఆప్యాయత కొనుక్కున్నావమ్మా' అనుకున్నాడు శంకరం.

విరించి వెళ్ళిన తరవాత బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి మెల్లిగా చెప్పులు వేసుకుని రామేశంగారింటికి వెళ్ళాడు శంకరం. వెళ్ళేటప్పుడు ఉత్తరం తీసుకువెళ్ళడం మర్చిపోలేదు.

"ఈ కథలో మనకెక్కడో తెలియని లింకు ఉంది. ఆమెలో కనబడని నిర్వేదనం ఉన్నది. అది ఇది అని చెప్పగల జ్ఞానం ఉన్నది. కానీ తట్టుకుని నిలబడే శక్తికోల్పోయింది. ఎందువల్ల?" రామేశంగారు పచార్లు చేస్తూ బైటకు మాట్లాడుకుంటున్నారు. "థింకింగ్ అలౌడ్"

ఆ ఉత్తరం చూసిన తరవాత నిజానికి శంకరానికి అర్థమైంది చాలా కొద్ది విషయం. అతని లౌకికమైన బుర్రకు మిగతాదేం అర్థంకాలేదు సరికదా తికమకగా కూడా ఉంది. అందుకే మనసు వద్దంటున్నా మెదడు వెళ్ళమందనిపించి రామేశంగారి దగ్గరకు వచ్చాడు.

"ఇంతకీ ఏం చేద్దాం అంటారిప్పుడు? ఆ విరించి చూడబోతే చాలా పట్టుదలగా ఉన్నాడు"

"చూద్దాం" ఆలోచిస్తూనే లోపలికి వెళ్ళి మజ్జిగ తెచ్చి ఇచ్చారు రామేశంగారు.

"ఇప్పుడే వస్తాను" అని చెప్పి మళ్ళీ లోపలికి వెళ్ళారు. శంకరం చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

చిన్న రేకుల షెడ్డు అది. వెనకాలది వంట వసారా కాబోలు ముందు వెదురు తడికతో అడ్డంకట్టారు. రాధామాధవం తీగ ఇంటిమీదికి పాకుతోంది. పసుపురాసిన తులసికోట, గన్నేరు మందారంచెట్లు, లోపలనించి అగరవత్తుల సువాసన వాతావరణం ప్రశాంతంగా ఉంది.

కూర్చుని కూర్చుని "ఏం చేస్తున్నాడీయన లోపల?" అని లోపలికి అడుగుపెట్టాడు శంకరం.

వంట వసారాలో ఈశాన్యం మూల కాబోలు చక్కగా ముగ్గులు వేసివున్న అరుగు, దానిమీద జపాకు సుమాలతో అలంకరించిన అమ్మవారు జ్యోతికాంతులీనుతున్నాయి. అగరవత్తులు ధూపనైవేద్యం చేస్తున్నాయి. అనాలోచితంగానే చేతులు జోడించాడు శంకరం.

ఆ పీఠం ఎదురుగా పద్మాసనం వేసుకుని ధ్యానంలో ఉన్న రామేశంగారు. ఎందుకో ఆ దృశ్యం ఎంత ఇదిగా ఆలోచిద్దామనుకున్నా శంకరానికి మనస్సుకు తాకింది.

మెల్లిగా కళ్ళు తెరిచారు ఆయన. ఏదో అలౌకిక తేజస్సు.

'నేను లేనిపోని ఆలోచనలతో సతమతమౌతున్నానా ఖర్మ' అని తనను తాను తిట్టుకున్నాడు శంకరం.

"రండి బైట కూర్చుందాం." అంటూ లేచారు.

"అర్థాంతరంగా ఈ ధ్యానం ఏమిటండీ? ఈ సమస్యకు పరిష్కారమేమిటా అని..."

మెల్లగా ఆపమని ఎడం చేత్తో సౌంజ్ఞ చేశారు. ఆయన దృష్టి ఎక్కడో ఉన్నది.

"బాబుగారూ! ఆమె కొంత తెలుసుకుని కొంత తెలుసుకోకుండా పోయారు. అంతఙ్ఞానం కావలసి అల్లాడుతోంది బిడ్డ. చనిపోయినవాళ్ళకు కావలసినదేమిటో"

"ఆ క్రతువూ అదీ చేశారుకదండీ బోలెడు ఖర్చుపెట్టి" అన్నాడు శంకరం మధ్యలో.

తమాషాగా నవ్వారు రామేశంగారు ఏదో పసిబిడ్డను చూసి నవ్వినట్లు.

'అడ్డమైనవీ భరించడానికే వచ్చాను నేను. కానీయ్' అనుకున్నాడు మనసులో శంకరం.

"బాబుగారూ! మళ్ళీ చెబుతున్నాను. మనం జ్ఞానం, పలుకు, క్రియ మూడూ సంధీకృతమైతే కానీ ఏ క్రతువూ యజ్ఞం కాదండీ. ఉట్టి తంతే పిల్లల బొమ్మల పెళ్ళిలాంటిది ఈ ఖర్చు, ఈ ఆడంబరం, మంత్రార్ధం తెలుసుకోని ఈ మనుషులు వీళ్ళిచ్చేవి ఆ దివ్యులకు సరిపోవండి. వారికి కావలసినది ఇచ్చాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి సంధీకృతం బడిన ధ్యానం కానీ, మరొకటి కానీ కావాలి.

ఒక పని చెయ్యండి. మీరు మనస్ఫూర్తిగా, మరో రకమైన ఆలోచనలు రానీయకుండా మీరు దైవము అనుకుని ధ్యానించే శక్తిని తలుచుకుని ప్రార్ధించండి. ఆవిడ తారట్లాడే ఆ లోకాల్లోదారి దొరకాలని, సత్యం తెలుసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకోండి. నేనూ ప్రార్ధిస్తాను ఆ బిడ్డ కోసరం."

గడ్డం కింద చెయ్యిపెట్టుకుని ఆయన్నే చూస్తూ కూర్చున్నాడు శంకరం. మయసభలో దుర్యోధనుడు "రానేల వచ్చితిని పో." అనే డైలాగులు గుర్తుకువచ్చాయి అతనికి.

'నేను ఎంత వెర్రివెధవను కాబోతే ఈ ఛాందసపు పిచ్చివాణ్ణి వెతుకుతూ వచ్చాను? అయినా ఈయన ఏం పరిష్కారం చెపుతాడని వచ్చాను?' తనని తాను తిట్టుకుని మెల్లిగా వెళ్ళిపోదామని లేచాడు శంకరం.

"బాబుగారూ నేను చెప్పేవన్నీ చాలా అర్ధరహితంగా ఉన్నాయి కదా మీకు? నమ్మలేక వెళ్ళిపోతున్నారు. అసలు ఈ పిచ్చివాడి దగ్గరకు ఎందుకు వచ్చానా అని ఆలోచిస్తున్నారు. అవునా?"

థాట్ రీడింగ్ కాబోలు. గాడిద గుడ్డు అనుకుని గిర్రున వెనక్కి తిరిగి "అవునండీ ఏమిటి మరి ఈ గోలంతా? ఈ ఉత్తరం, ఈ సమస్యలు ఇవన్నీ ఎక్కడ బయట పడి మావాళ్ళ కుటుంబం ఎక్కడ అల్లరి అయిపోతుందోనని నేను బాధపడుతూ ఉంటే, చచ్చి ఉట్టెక్కిన దాన్ని గురించి ఆలోచించమంటారేమిటి? అది పోయింది. ఆ కథ అయిపోయింది. అంతే" అన్నాడు ఖరాఖండీగా.

"చచ్చిపోగానే ఆ కథ అంతే అని ఎందుకంటారు బాబుగారూ. జీవి, పరలోకం.."

"నా పాడె, పచ్చిబద్దలు. ఈ శాస్త్రాలన్నీ కట్టిపెట్టండి. ఒక పక్క సైన్సు ముందుకు వెళ్ళి పెద్ద పీఠం అలంకరిస్తూంటే, ఈ శోష ఏమిటి? ఏ సైంటిస్టూ ఇంతవరకు ఆత్మల గురించి మాట్లాడలేదు మరి. చూసిన వాటితోనూ, ఉన్నవాటి తోనే ఛస్తూంటే, చూడని వాటి గోలేమిటి మళ్ళీ?"

"మీకే సైంటిస్ట్ గురించి తెలుసు?" సూటిగా చూస్తూ అడిగారు. ఆయన కళ్ళల్లో ఏదో కాంతి వలయం.

ఆలోచించాడు శంకరం. ఏదో పేపర్లో చదివి, 'వాళ్ళు చంద్రమండలంలో దిగారు. వీళ్ళు ఏదో అణుశక్తిని ఛేదించారు' అవడమే కానీ, అతనికి ఎవరూ పెద్దగా తెలియదు. అయిన ఈ ఛాదస్తపు బ్రాహ్మడికి మాత్రం ఎవరు తెలుసని? చదువుకున్న ఇంగ్లీషంతా ఈయన ఈ పూజలు, మంత్రాల్లో పడి ఎప్పుడో గుంటదవ్వి గంట వాయించి ఉంటాడు. అలా అనుకోగానే, ధైర్యం వచ్చి "మీకు మాత్రం ఎవరు తెలుసండీ?" అన్నాడు.

కుర్చీలో స్థిరంగా కూర్చుని, కళ్ళజోడులోంచి పరీక్షగా చూస్తూ "మీకు డాక్టర్ మీకు పేరు తెలుసా? జార్జ్ డబ్ల్యు మీక్ చనిపోయినవారి గమ్యం మీద గొప్ప పరిశోధన చేసిన మహా మేధావి. మృత్యువు మాములు మనిషి అనుకునేటంత భయంకరమైనదికాదనీ,

అమృతతత్వానికి తీసుకు వెళ్ళగల శక్తి దానికి ఉందనీ, ఈ జన్మలో చేసిన పాపపుణ్యాలకు పైలోకాల్లో బేరీజు ఉంటుందనీ ఒప్పుకున్న సైంటిస్టులు ఎంతమందో తెలుసా?

"విలియమ్ బ్రాన్‌డాన్ అనే ఆయన మృత్యువు తరవాత, మరి నాలుగు పుస్తకాలు ఎడిత్ ఎల్లిస్ అనే ఆయన ద్వారా 1935-36లో రాయించాడు తెలుసా మీకు?

"థియరిటికల్ ఫిజిక్స్‌కు, తూర్పు దేశస్థుల ఆధ్యాత్మిక తత్వాలకు మధ్య చాలా అనూహ్యామైన స్పందన ఉన్నదని నమ్మిన వెర్నర్ హైనన్‌బర్గ్ తెలుసా మీకు?"

"క్వాంటమ్ థియరీకి, మన ఆధ్యాత్మికతకు మధ్య సంబంధము బలీయమైనదని, అణివిచ్ఛేదంలో జ్వలించిన కాంతిపుంజాల బిందు రూపాల్ని రేఖారూపాలుగా దిద్దితే మన నటరాజ రూపాన్ని పొందిందని రుజువు చేసిన ఫ్రిట్ ఆఫ్ కాప్రా తెలుసా మీకు?"

అలా మాట్లాడుతున్న రామేశంగారి మాటల్లో జ్ఞానపుంజాలు పురులు విప్పుకున్నాయి. ఆయన మేధస్సు దైవీకమైన తేజస్సుగా మారి ఒక్కసారి వాతావరణాన్ని ఉద్దీపింపచేసింది. ఆయనలో 'అహం' జ్ఞానాగ్నిలో మాడిపోయిందేమో మాటలో క్రియలో ఎక్కడా లఘుత్వం లేదు.

శంకరం ఏం మాట్లాడలేకపోయాడు. అతను ఇన్నాళ్ళూ చాలా తెలివిగా, లౌక్యంగా బతుకుతున్న జీవన విధానానికి, రామేశంగారు మాట్లాడుతున్న ఈ అలౌకికమైన పంథాకి మధ్యలో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు. చీకటి గదిలోకి ఒక్కసారి ఏడూ కిటికీలను తెరుచుకుని వెలుతురు వచ్చినట్లైంది. ఆలోచిస్తున్నాడు. ఈయననైతే ఛాందసుడిగా తీసెయ్యచ్చు. వాళ్ళంతా పిచ్చి వెధవలు కారుగా?"

"సరే రామేశంగారూ ఈ విషయాలన్నీ నా బోటివాళ్ళ జీవన విధానంలో ఎక్కడా తగలవు. దేముడు, మడి ఆచారం, గుళ్ళు, సంస్కృతంలో ఉండే మంత్రాలు అన్నీ లౌకికంగా మనకెంత ఉపయోగమనే కానీ, మరొక రకమైన జ్ఞానానికి ఇవన్నీదారులని నాకు తెలియదు. కానీ వాటి వెనకాల ఉన్న ఈ భగవంతుడేమిటసలు? ఇన్ని మైక్రో స్కోపులు, టెలిస్కోపుల్లో ఎక్కడా అంతు చిక్కడే ఆయన.

గట్టిగా నవ్వేశారు రామేశంగారు.

"వెనకటికి మీలాంటివాడే 'వీణ అంతా విరక్కొట్టి చూశాను సంగీతం కనబడలేదు' అన్నాడట. అలా ఉంది బాబుగారూ. కాస్మిక్ ఎనర్జీ మానిఫెస్ట్ అవడానికి, నామరూపాలు పొందడానికి కావలసిన వాతావరణం ఏర్పడినప్పుడు తప్పకుండా అది జరిగి తీరుతుంది. హిరణ్యకశిపుడికి స్థంభంలో కనబడ్డాడన్నా అదే మరొకటైనా అదే. కానీ, సృష్టిశక్తి ఒక మతం పరిధుల్లో కట్టుబడదు. మనిషి బుర్రకు అందదు. ధ్యానానికి, యోగానికి అందాలి అంతే."

"రామేశంగారూ మీరెప్పుడైనా దేముణ్ణి చూశారా?" గబుక్కున చిన్న పిల్లాడిలా అడిగాడు శంకరం.

"ఎక్కడ లేడండీ? మీలో, నాలో, సర్వసృష్టిలో కాంతిగా, గాలిగా, తేజస్సుగా, ప్రాణశక్తిగా ఓహ్ ఎక్కడ లేదా శక్తి?"

ఆయన గుండ్రని కళ్ళల్లో నీళ్ళు. ఒంట్లో ఏదో పులకరింత శంకరం ఒళ్ళు ఝల్లుమన్నది.

"మరి ఎలా గుర్తించాలండీ దాన్ని?"

"బాబుగారూ మన చుట్టూ రేడియో శబ్దతరంగాలు, టి.వి తాలూకు కాంతి తరంగాలు నిరంతరం వ్యాపించే ఉన్నాయి. అయినా ట్రాన్స్‌మీటర్ ఆన్ చేస్తే కానీ లయ కుదిరి మీకు పాటగానో, ఛాయాచిత్రంగానో రావడంలేదు. మనలో ట్రాన్స్ మీటర్‌ను ట్యూన్ చెయ్యగలిగిన రోజు ఈ సమస్య ఉండదు"

రాధామాధవం పూలకొమ్మ కదులుతోంది. లోపలినుంచి రామేశంగారి భార్యగారి బరువైన మట్టెల శబ్దం దూరంగా గాలికి కదిలే మామిడిచెట్టు హోరు ప్రకృతిలో ఏదో మధురిమ చూడగలిగిన చూపు, వినగలిగిన మనసు ఉంటే..

'ఇదేమిటి? రామేశంగారి పిచ్చి నాకూ ఎక్కుతోంది ఏమిటి?' అనుకున్నాడు శంకరం.

"మనకు వచ్చే క్లయిర్ వాయిస్‌లు, క్లయిర్ ఆడియన్స్‌లు ఇవన్నీ మనకున్న చూసేశక్తి, వినే శక్తి తాలుకు ఎదుగుదలే బాబుగారూ! గుర్తింపు అంతే"

"బాబుగారూ మీకా శక్తులు ఉన్నాయా?" విస్మయంగా అడిగాడు శంకరం.

"ఉన్నాయా, లేవా అన్నది ప్రశ్నకాదు. నమ్మి నేను దీక్షతో ఆచరిస్తున్న ఈ నాయోగంలో ఆ శక్తులన్నీ కొన్ని భాగాలు. కానీ ఎప్పుడైతే మనలో 'తనయందు, నిఖిల భూతములయందు ఒక భంగి' అనే తత్వం చచ్చిపోతుందో, ఎప్పుడు అసూయా, ద్వేషం, స్వార్థం నిద్రలేస్తాయో, ఈ వచ్చిన కొద్ది శక్తుల్నీ మన స్వార్థం కోసరం ఉపయోగించుకోవడం ప్రారంభిస్తాము. అక్కడితో ఈ సాధన గమ్యం చేరకుండానే ఆగిపోతుంది. తెలియక కొందరు బాధపడుతూంటే, తెలిసీ అజ్ఞానంలో కొందరు పడుతున్నారు. ఈ నిరంతర పాంథశాలలో మన మజిలీ శాశ్వతమనుకోవడం ఎంత పిచ్చితనం? ఈ కాస్త నిరీక్షణలో మరిన్ని పాపాలు చేసి, మరొక జీవితానికీ, కర్మకు కారకులవడం ఎంత అన్యాయం.

మన తెల్లషర్టు మీద ఎవరైనా ఇంకు పోస్తే భరించలేం. కానీ, తెల్లకాయితంలా, శుభ్ర వస్త్రంలా ఉండే జీవితాన్ని మనమే అలికి అసహ్యం చేసుకుంటున్నాం తెలియక. ఎంత ఘోరం ఎంత అజ్ఞానం" ఆయన గొంతులోని నిర్వేదంలో చరాచర ప్రపంచం కోసరం పడే బాధ ఉంది. దాని అజ్ఞానం పట్ల జాలి ఉంది.

చీకటి పడుతోంది. శంకరం ఏం మాట్లాడలేదు. రామేశంగారి మాటలు అతని మీద పనిచేస్తున్నాయి. కానీ, ఏదో చీల్చలేని తెర ఆలోచించనీయడంలేదు. ఈ గోలంతా నాకెందుకు అని దులుపుకు పోదామనిపిస్తోంది. కానీ, వద్దన్నా రామేశంగారు, ఉమ ఉత్తరం అతని మనసును, బుద్ధిని ఆలోచించేట్లు చేస్తున్నాయి.

"నేను వెళుతున్నాను" అని లేచాడు శంకరం.

"ఇవిగో ఇవి తీసుకు వెళ్ళండి"

ఆయన చేతుల్లో ఏవో పుస్తకాలు. ఏ భగవద్గీతో, దేవీ పురాణమో ఇస్తాడేమోరా బగవంతుడా అనుకుంటూ తీసుకున్నాడు అతను.

"మీకు తెలుగులో చెప్పేవాటికన్నా ఇంగ్లీషులో చెప్పేవి రుచిస్తాయి. పైగా పరాయివాళ్ళు చెబితే మనకు బాగుంటుంది చూడండీ" చిన్నపిల్లాడిలా హాయిగా నవ్వుతూ పుస్తకాలు చూపించారు. ఏవేవో ఇంగ్లీషు పుస్తకాలు.

అవి తీసుకుని గుమ్మం దాటుతూ వెనక్కు చూశాడు శంకరం. చేతులు కట్టుకుని అతనివంకే చూస్తున్నాడు రామేశంగారు. ఆయన కళ్ళల్లో ఏదో శక్తి ఉన్నది. ఏమిటది? సూదంటురాయిలా అతన్ని ఆకర్షిస్తోంది. కొంపతీసి, హిప్నటైజ్ చెయ్యడమంటే ఇదేనా? బగవంతుడనే మత్తు కాబట్టి, ఇది "డివైన్ హిప్నటిజం" అయి ఉండాలి.

'దేముడా! నువ్వంటూ నిజంగా ఉంటే నీకు రామేశంగారిలాంటి వ్యక్తులు చాలా అవసరం' అనుకుంటూ బయటకు వచ్చాడు శంకరం.

రాగానే చదవడం ప్రారంభించిన ఆ పుస్తకాలు చాలావరకు శంకరం కాలాన్ని తినేశాయి. మంచో, చెడో అతని బుర్ర ఆలోచించడం ప్రారంభించింది. ఎందుకో రామేశంగారు చెప్పినట్లు ప్రతిరోజూ పదినిమిషాలు ఉమ కోసరం ప్రార్థించడం ప్రారంభించాడు. నిజానికి ఆ ధ్యానం ఎలా చెయ్యాలో కూడా అతనికి తెలియదు. రామేశంగారినే అడగాలంటే అభిమానం అడ్డువచ్చింది.

ఈ ఉత్తరానికి లౌకిక పరిష్కారం ఏమిటని అడగబోతే ఇందులో ఇరికించాడాయె. పైకి చెప్పలేడుగానీ, శంకరానికి ఎంత మేనకోడలైనా, ఇలా పిలిస్తే వచ్చి తనను పట్టుకుంటుందేమోనన్న భయం చాలా ఉంది. అందుకని శుభ్రంగా ఆంజనేయస్వామి పటం ముందు నిలబడి, హనుమాన్ ఛాలిసా చదివేసుకుని, ఆ తరవాత -

"అమ్మా ఉమా! ఎక్కడున్నావో కానీ, నా ప్రార్థనవల్ల నీకు ఆత్మశాంతికలగాలమ్మా నా దైవప్రార్థన నీకు దారి చూపాలి" అని ప్రార్థించడం ప్రారంభించాడు.

"ఆఁ ఈ కాసిని మాటలకే ఆత్మశాంతా, నా మొహమా? అలాంటప్పుడు ఈ బ్రాహ్మలు, ఈ మంత్రాలు, ఈ ఖర్చు ఇవన్నీ ఎందుకట?" అని తను చేస్తున్న పనిని తనే శంకించుకుని విమర్శించుకోబోయేవాడుకానీ, "జాగ్రత్త. మనస్ఫూర్తిగా చెయ్యండి" అన్న రామేశంగారి మాటలు వినిపించేవి. ఒక రకంగా ఉమ అంటే అదివరకున్న అభిమానం, ఉమ అంటే ఏమిటో తెలిసిన తరవాత ఇప్పుడు ఏర్పడ్డ ఆప్యాయత అతని ధ్యానానికి ఏకాగ్రత ఇచ్చాయి.

ఈలోపల "ఏం చేద్దాం సార్?" అంటూ రెండుసార్లు వచ్చివెళ్ళాడు విరించి.

ఏం చెప్పాలి?

"ఆదివారం, అమావాస్య వచ్చాయి. రండి. అమ్మాయి పేరన ఎవరైనా బీద ముత్తైదువుకు చీర, జాకెట్టు దానం చేద్దాం" అన్నారు రామేశంగారు వచ్చి ఒకరోజు.

ఈ తమాషా ఏమిటి అనుకుంటూ బయలుదేరాడు శంకరం. ఆయనే చీర, మిగిలిన సామాగ్రి ఏమిటేమిటో కొన్నారు.

"అయ్యో! ఆ ఖర్చంతా మీకెందుకండీ?" అన్నాడు శంకరం.

"బాబుగారూ ఈ 'నీలు', 'నాలు' మన పరిధుల్లోవి. ఒక్కసారి ఆ బిడ్డకోసరం ప్రార్థించడం ప్రారంభించిన తరవాత చీకట్లో తారాడుతున్న ఆమెకు 'ఆ పెంజీకటి చాటు ఏకాకృతి' అర్థమయ్యేదాకా ఆమె నా బిడ్డే పదండి" అన్నారు.

శంకరం ఏనాడూ మేనకోడలుకు పట్టుమని పదిరూపాయల జాకెట్టు గుడ్డపెట్టలేదు.

'మరి ఈయనేమిటి? ఈ ఆధ్యాత్మికతలోనే ఈ ఆర్ద్రత, భావన ఉంటాయా?' అనుకున్నాడు.

సముద్రపు ఒడ్డున ఏదో క్రతువుచేసి దానమిచ్చాడు ఆయన. అంత ఖర్చూ ఆయనదే కాబట్టి చూస్తూ కూర్చున్నాడు శంకరం.

మరునాటి సాయంత్రం విరించి వచ్చాడు.

"సార్! ఉమగారి లెటర్ గురించి మర్చిపోదాం. పబ్లిషింగ్ వద్దు" అన్నాడు.

"అదేం?" అన్నాడు శంకరం.

"ఏంలేదుసార్" నట్టుతూ అని, "అది కలో లేక నా భ్రమో తెలియదు సార్.. ఆమె నాకు కనబడ్డారు" అన్నాడు.

"ఎప్పుడు?" కుర్చీలో నిటారుగా కూర్చుంటూ అడిగాడు శంకరం.

"నిన్న కనబడి 'విరించీ నాకిప్పుడు చాలా అర్థమౌతోంది. ఏదో కొత్తదారి అర్థమౌతోంది. భావాలు, బాధలు, ఆ దేహం, గేహం వాటి తాలూకువి. తెలుసుకోవలసినది చాలావుంది. వెళ్ళిపోతున్నాను నేను. ఈ ఉత్తరంతో పనైపోయింది' అని నా పుస్తకాల టేబుల్‌కు ఆనుకుని చెప్పింది సార్. ఏమిటో నాకేం అర్థంకావడం లేదు."

"నా మొహం. నీ ఊహ అయ్యుంటుంది" కొట్టిపారేస్తూ అన్నాడు శంకరం.

"సార్! నా ఊహే అయితే, నా ఆలోచనతో జతపడాలి, సరిపడాలి. వ్యతిరేకంగా ఎందుకు చెపుతుంది?"

"విరించీ ఉమ ఆత్మకు శాంతి కలగాచేని ప్రార్థించు. నీకుండే ప్రేమతో పిలిస్తే తప్పకుండా జరుగుతుంది"

విరించి మాట్లాడలేదు కాసేపు. అతని కళ్ళల్లో నీరు.

"మీరు ఆత్మలు, ఈ తుక్కా దూగరా నమ్ముతారా సార్?" అని ఆ కుర్ర జర్నలిస్ట్ దుమ్ము దులిపితే, తనకు తెలిసిన మిడిమిడి జ్ఞానంతో ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు శంకరం.

"సార్! నిజంగా నేను ప్రార్థిస్తే ఆమెకు ఏదన్నా మేలు జరుగుతుందంటే, తప్పకుండా చేస్తాను సార్. వస్తాను" అన్నాడు.

"విరించీ"

ఆగాడు.

"రాఘవ ఎలా ఉన్నాడు?"

"ఎలా ఉంటాడు? చాలా మారాడు సార్. ఆ సినిసిజం, ప్రపంచం అంటే ఉన్న మోకరీ తగ్గిపోయింది. తనకు తెలిసిన దానికి నిజాయితీ జోడించి చెబుదామనే ప్రయత్నంలో పడ్డాడు. ఉమ రాశారుగా. నిజాయితీ అయిన కావలసిన సాధన సంపత్తిని సమకూర్చుకుంటాడు. టెస్ట్‌ట్యూబ్, ఆసిడ్స్ ఒక పరిశోధనకు అవసరమయితే నా మార్గానికి ఈ సాధన సంపత్తులు అవసరం అంతే"

విప్పారిన కళ్ళతో చూస్తూ ఉండిపోయాడు శంకరం. మెల్లిగా విరించి సంగతి చెప్పాడు.

తీసుకువచ్చిన పుస్తకాలు ఇచ్చేస్తూ, "బాబుగారూ ఇన్ని చదివినమీదట వీటన్నింటికీ ఎక్కడో లింకు ఉందనిపిస్తోంది. ఏమిటో నా బుర్రకు అందడం లేదు. తెలుసుకునేదాకా ఏ కర్మకాండలు చేసినా ఫరవాలేదు. తెలిసిన తరవాత ఈ క్రతువులు వృధా అన్న థియరీ ఏమిటి? మరి మీ ఆదివారం అమావాస్య తర్పణం ఏమిటి?"

దూరం నుంచి ఇంటివారి అమ్మాయి వీణావాయిద్యము, ఎక్కడో వడ్రంగి పనివాళ్ళ సందడి - ఇవన్నీ దాటి రామేశంగారి గొంతు ఖంగుమన్నది.

"ఒక్కొక్కడు ఒక్కొక్క మార్గాన్ని ఆ జ్ఞానప్రదాతను కలుసుకోడానికి ఎన్నుకుంటారు. నేను వేదకర్మలకు అలవాటయిన కుటుంబంలో పుట్టాను. ఈ పద్దతులకు అలవాటు పడ్డాను. కానీ ఈ తంతు యజ్ఞంగా, కేవలం ఉచ్చాటన మంత్రంగా మారటానికి మధ్య ఒక గొప్ప ప్రక్రియ ఉన్నది. అది 'నిన్ను నువ్వు తెలుసుకోవడం' ద్వార సంక్రమిస్తుంది. ఆ ప్రక్రియ మాత్రం అన్నిమతాలకూ, అన్ని సిద్ధాంతాలకూ ఒకటే.

"ప్రతినమ్మకంలో దుష్టత్వానికీ, దైవత్వానికీ మధ్య ఉన్న సుదూర మార్గాన్నిదాటే పద్దతి తెలిసే విధానం ఉంటుంది. మనిషి చచ్చిపోవడంతో సమస్య ఆగిపోవడంలేదు. కాజ్ అండ్ ఎఫెక్ట్ థియరీ ప్రకారం మళ్ళీ పుట్టుక, అనుభవం ఉన్నది. పెద్దవాడైన మనిషి చనిపోయినా చెడ్డతనం మర్చిపోవడంలేదు. అందుకని చంపవలసిన దేమిటంటే అజ్ఞానాన్ని, దానికి కారణభూతమైన అహంకారాన్ని"

శంకరం ఊపిరి పీల్చడం మర్చిపోయి వింటున్నాడు.

"ఊం! దీపంతో భగవద్గీత చదవచ్చు. ఒళ్ళూ కాల్చుకోవచ్చు. అజ్ఞానం సర్వజగతికీ సృష్టికీ ఎంత ప్రమాదమో తెలియజెప్పడానికి ఈ పురాణాలు పుట్టాయి. కానీ, మన ఖర్మ. మన విషయం తప్పించి, కథలు జ్ఞాపకం పెట్టుకుంటాము. దేవీ భాగవతం చదివితే, మనకు శ్రీదేవీ శక్తి ఎలా లక్ష్మీ సరస్వతీ, పార్వతి గాయత్రి, రాధ, సావిత్రులుగా రూపాంతరం పొందిందో తెలుసుకుంటాం. కానీ, మళ్ళీ రాధ కృష్ణుడి మేనత్తని, దేముడు కాబట్టి ఏ వెధవ పనులు చేసినా సరిపోయె అని వెకిలిగా మన ఈ దిక్కుమాలిన సంబంధాలు వాళ్ళకి అంటగట్టి ఆనందిస్తాం. లక్ష్మీ సరస్వతిలలో బీజాక్షర సంపుటీకరణంలో మార్పు తప్ప శక్తిభేదలేదని చదువుతూనే, వాళ్ళిద్దరు అత్తాకోడళ్ళనీ, వాళ్ళకు పడదనే కవి చమత్కారం రుచించినట్లు నిజం రుచించదు.

అర్థంకాదు. అసలు నా ఉద్దేశ్యం ఏమిటంటే, దైవత్వాన్ని, మనస్థాయికి దించి, మాలో నువ్వూ కలిశావు అనే వెకిలి ధంభత్వం మనలో ఉన్నది. ఘోరమైన పతనానికి ఇంతకన్నా నిర్వచనం ఏమిటి? ఈ జీమూతం తొలగాలంటే మనస్సును ప్రాభావితం చేసే మహాశక్తి గురురూపంలోనే, మరొక రూపంలోనో వచ్చి మనసు తట్టి లేపితేకానీ, ఈ మృత్యుసమాన నిద్రావస్థలోనుంచి లేవము. అందుకే ఎవరిదారి ఏదైనా, ప్రక్రియ ఏదైనా, వెనకాల ఆశయం 'సత్యాన్వేషణ' కావాలి."

శంకరానికి ఎందుకో ఉమ చెప్పిన ఏ మిధ్యా ఆడంబరం లేని థాట్ కావాలి. అన్నమాట గుర్తుకు వచ్చింది. ఏమిటిదంతా? జీవితంలో యాభై ఐదు సంవత్సరాలు అసలు ఇటువంటి విషయాలు 'మనకెందుకులే' అనే గడిపేశాడు తను. దానివలన తనేం నష్టపోలేదు. ప్రాపంచికంగా కానీ, తనది గుడ్డివాడి ప్రపంచం. సౌందర్యం కనిపిస్తేగా పోయిందన్న బాధ. ఇప్పుడు.

"బాబుగారూ జీవిత సంధ్యాకాలంలో ఉన్నవాడిని. ఇప్పుడేవో నేర్చుకుని, చదువుకుని చేసే ఓపికాలేదు. తెలియవుకూడా. ఏదో జడుదిలా నిద్రిస్తున్న నన్ను మీరు అనవసరంగా నిద్రలేపారు. ఇప్పుడీ తపన ప్రారంభమైంది. ఏం చెయ్యను నేను?"

ఖంగుమని సమాధానం ఇచ్చారు రామేశంగారు.

"ధ్యానం చాలు. అన్ని ఆలోచనలను ఆపేసి, నిశ్శబ్ధ స్పందనలోనుంచి వినిపించే ఆత్మజ్ఞానాన్ని అర్థం చేసుకోండి. ఒక్కసారి మీలో ఏడుపొరల వెనకాల ఉన్న ఆత్మను నిద్రలేపి, నిజమైన శక్తి ఏమిటో తెలిస్తే సృష్టిలో ప్రతి ఒక్కటీ గురువే అవుతుంది. దత్తాత్రేయులకు వెన్నెల, సూర్యుడు, పక్షి, చెట్టు, పుట్ట తదితరమైనవన్నీ కలిపి ఇరవైనాలుగుమంది గురువులట.

'నా ఉచ్ఛ్వాసనిశ్వాసలు, స్నానం నడక, మాట అన్నీ నీ పూజలే తల్లీ' అన్నారు సౌందర్యలహరిలో. అన్నింటినీ హృదయంతో అర్థం చేసుకుని, మేధస్సుతో ఆలోచించండి.

'కుపుత్రో జాయేత కృచిదపి కుమాతా నభవతి" (తల్లీ! చెడ్డబిడ్డ ఉంటాడేమో కానీ, లోకాన చెడ్డ తల్లి ఉండదు కదా) అన్నారు కళ్ళంబడి నీళ్ళతో జ్ఞానచక్షువులకు కనబడే శక్తికి నమస్కరిస్తూ.

శంకరంగారి దగ్గర నుంచి నేరుగా వచ్చిన విరించి, తండ్రికి జబ్బుగా ఉన్నదన్న టెలిగ్రాం చూసి రైలు ఎక్కాడు.

మానవత్వానికి జడత్వం నించి ఒక ప్రేరణ కావాలి. అది ఏ రూపంలో జరుగుతుందో చెప్పలేం. ఉమ స్నేహమాధుర్యంతో విరించి ఈ జీవన నాటకాలకి సమీక్షకుడయ్యాడు.

అతను వెళ్ళేటప్పటికే తండ్రిపోయాడు.

పదమూడు రోజుల ఖర్మ. మంచం మీదనుంచి లేవలేని తల్లికి వైధవ్యం.

"పార్వతీదేవిలాంటి అత్తయ్యను ఇలా చూడలేనయ్యా?" అని వెక్కి వెక్కి ఏడుస్తోంది సుభద్ర. ఆమె వంకే చూస్తూ కూర్చున్నాడు విరించి. అతనికీ కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి. ఈ దుఃఖం ఎంత గొప్పది? ఎంత పవిత్రమైనది? ఎంత క్షాళన దీనివల్ల? వదిన దుఃఖంలో అమ్మ తప్పులూ, అమ్మ పెట్టిన బాధలు చోటు చేసుకోవు. అనుకున్నాడు.

రఘు, అతని భార్య వచ్చారు.

చాలా మాటరాఫ్ ఫాక్ట్‌గా చితిదగ్గర రెండు చేతులూ కట్టుకుని నిలబడి చూస్తున్నాడు అతను.

"వీడికి అసలు ఫీలింగ్స్ ఉండవా?" అనిపించింది విరించికి.

"ఎందుకురా! ఫీలవ్వనిది చెప్పే హిపోక్రసీ నాకులేదు. ఫీలయ్యేవి చెపితే ప్రపంచానికి అక్కర్లేదు. పైగా ఊరుకోదు. లెటిట్ గో టు హెల్" అన్నాడు.

రఘు భార్యలో కనబడే సున్నితత్వం వెనకాల ఏదో తెలియని కాఠిన్యమున్నది. ఆ మృదుత్వం లేత చిగురాకు వంటిదికాదు. ఉలిపిరి కాగితంలాంటిది. ఏది ముట్టుకున్నా సున్నితంగా ఉండాలని, మునివేళ్ళు తప్ప మరే అవయవాలు పని చెయ్యనట్లు ప్రవర్తించాలనే తపన ఉన్నది ఆమెలో. అది అందరూ చూడాలనీ, అందులో ఈ అనాగరికత మధ్య తనకొక ప్రత్యేకత కావాలనుకునే 'ఈగో' ఉన్నది.

సుభద్ర చిక్కిపోయింది. నల్లబడుతోంది. కాటుక కళ్ళ కిందికి నీలినీడలు వచ్చేస్తున్నాయి. కచ్చిక, బూడిదతో అంట్లు తోమిన చేతులకు అప్పుడప్పుడు గోరింటాకు తప్ప మరే అనులేపనం లేదు. వేలుముడి తప్ప ఈమధ్య జడకూడా వేసుకోవడం లేదు. ఈ ఇల్లాలు మరొక ఆడదాని కష్టాలు ఆలోచిస్తోంది. చిన్న వదినకు ఈవిడ అంటే ఇష్టంలేదు, అయిష్టంలేదు. వదినంటే తన భర్తకు ఎంత గౌరవమో తెలుస్తుందా ఈమెకు ఎప్పుడైనా? ఆ అవకాశం ఈ జన్మకు రాదు. కొన్ని అంతే. ఎందుకో 'ఉమ' గుర్తుకు వచ్చింది విరించికి. వదినకు చెప్పాలనిపించింది.

బంధువులంతా ఎక్కడివాళ్ళక్కడ సర్దుకున్నారు.

"వాడు నీ మాట వింటాడు చెప్పవే" అత్తగారు సతాయిస్తోంది దేన్నిగురించో సుభద్రను.

"ఆ ఒక్కటీ అడక్కండి నన్ను. నాకు తెలియదు" అని వెళ్ళిపోయింది సుభద్ర. ఎంతో సహనంగా ఉండే ఆమె మాటల్లో అణుచుకున్న ఆవేశం వినిపించి ఉలిక్కిపడి, తల్లిగదిలోకి వెళ్ళాడు విరించి.

"ఏమిటమ్మా?"

"చూడరా! ఆ రఘుగాడు పెళ్ళాం మాటవిని ఆ నాలుగెకరాల కొండ్రా అమ్ముకుపోతాడట. ఇక్కడ ఇంటికి వచ్చేది ఒళ్ళో బెట్టనా, దళ్ళో పెట్టనా అన్నట్లుంది. ఆ నాలుగెకరాల అయివేజు ఉంటే కాస్తకాలం హాయిగా గడుస్తుంది. వాడేదో గడిస్తున్నాడు. వాడి పెళ్ళాం తరపున బోలెడాస్తి. వాణ్ణి నోరుదెరిచి అడగవే అంటే నిక్కుతోంది. ఏం చూసుకుని ఆ విరగబాటు? కాట్లో ఒక కాలున్నదాన్ని నా కోసరమా?"

తలుపుకు ఆనుకుని ఆవిడనే చూస్తున్నాడు విరించి.

"అమ్మ" ఈ పదానికి అర్థమేమిటసలు? ఎంత పరోక్షంగా వదిన చేత అడిగించి పని జరిపించుకోవాలనుకుంటోంది? ఆ మనస్థత్వంలో ఎంత వెలితి? ఎంత మురికి? ఇప్పటికీ కోడలిమీద నమ్మకమూలేదు, ఇష్టమూ లేదు. కానీ, ఆవిడ ఆత్మాభిమానాన్ని తను సులభంగా తాకట్టు పెడదామనుకుంటోంది నాలుగెకరాల కోసరం ఏం మనుషులూ? నిజం 'ఉమ' రాసింది. థాట్‌లో లేని నిజాయితీ నిజాయితీ థాట్‌లో ఉంటే అన్నీ సజావుగా ఉంటాయి. అసహ్యమనిపించి, మారుమాట్లాడకుండా బయటకు వచ్చేశాడు.

ఆ సాయంత్రం పొలం అమ్మడానికి బయానా తీసుకున్నాడు రఘు.

పొలాల గట్లమీద నడుస్తున్నారు ఇద్దరన్నదమ్ములు. పెద్దన్నయ్య పనిమీద పక్కఊరుకి వెళ్ళాడు. ఇంటి పరిస్థితి చెప్పాలనుంది విరించికి. కానీ పత్రికలో ఉద్యోగం చేస్తూ నెలకు ఏ వందో ఇంటికి పంపే తనువాడిని ఆలోచించరా అని ఏమని అడగగలడు? అయినా చెప్పాలి.

"ఇంటి పరిస్థితి బాగాలేదురా"

మాట్లాడలేదు రఘు.

"ఈ పొలం కూడా అమ్మితే వాళ్ళు మరీ రోడ్డున పడతారేమో"

ఆలోచిస్తున్నాడు రఘు.

"మధ్యాహ్నం అమ్మ అంటోందిరా"

"విన్నాను" ఆ గొంతులో రాయికుండే కాఠిన్యం ఉంది.

"ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు విరించి.

"వదినను అమ్మ నన్ను అడగమనడం ఒరేయ్" అంటూ గిరున తిరిగి "మీరందరూ వెధవ కాయితాలు ఖరాబు చెయ్యడమేకానీ ఈ పరిస్థితులకు నిప్పుపెట్టే ఒక ఉద్యమం లేవదీయరాదుటరా. ఆ ముసలావిడ నన్ను అడ్డంపెట్టుకుని వదినను పెట్టిన నరకం, నోట్లో నాలిక లేనట్లు కనబడే అన్నయ్య పెట్టిన చెర నాకు తెలియదనుకుంటున్నావురా! అప్పుడు చెయ్యని తప్పుకు ఆవిడకు నరకం చూపెట్టారు. ఇప్పుడు ఆనాటి నా బలహీనతను ఆసరా చేసుకుని లొంగదీద్దామని ప్రయత్నిస్తున్నారు. ఆవిడ సుభద్ర కాబట్టి సరిపోయింది. ఛీ! వాళ్ళకు తల్లి, తండ్రి, అక్క, తమ్ముడు ఈ గౌరవాలిచ్చి ఇంకా ఆలోచించమంటున్నావా?"

మాట్లాడలేదు విరించి. కొన్ని కొన్ని అసహ్యాకరమైన పరిస్థితుల గురించి ఆలోచించడంకన్నా ఎదుర్కోవడం సులబం.

"కానీ వదినే సర్దలేక చచ్చిపోతుందిరా. ప్రతి సంవత్సరం అక్కయ్యల రాకపోకలు, పెట్టుబళ్ళు, అమ్మకు మందులు..ఏమిటో"

"ఒరేయ్ నేనిచ్చేది వదినకు ఉపయోగిస్తుంది అంటే ఈ క్షణం వదిలి వెళ్ళిపోతాను. వచ్చిన నాటినుంచి చూస్తున్నాను. ఆవిడకు లెక్కకు నాలుగు చీరలున్నాయిరా. మనిషిని చూశావా ఖాళీగా ఒక్క క్షణం కూర్చుంటే పాపం అన్నట్లు ఈ దిక్కుమాలిన దుర్వాసన కొట్టే కొంపకు సుగంధ లేపనాలు అద్దుదామని చందనపు కట్టెలా అరుగుతోంది. ఈ పదిరోజులుగా ఇరవై ముప్పైమందికి వండి వారుస్తోంది. నా డబ్బు ఆవిడను ఈ కష్టాల్లోనించి తప్పిస్తుందంటే ఇప్పటికిప్పుడు రాసిస్తా. లాభంలేదురా. ఈ దిక్కుమాలిన పరిస్థితులు, ఈ ముడతలు పడికుంచుకుపోయిన మనుష్యులు మారరు. భస్మం...భస్మం అయిపోవాలి. అంతే" అతడిమాటల్లో ఆవేశం. అణుచుకుని లావాలా బైటపడే ఆ ఆవేశం ఎంత భయంకరమైనదో తెలుసు విరించికి.

ఏం మాట్లాడలేదతను. నది ఒడ్డున నడుస్తున్నారు. ఊరంతా మురికిచేసినా ఎందుకో జనం ఆ ఒడ్డు ఊరికి దూరంగా ఉందనేమో వదిలిపెట్టారు.

సాయంత్రపు సూర్యకిరణాల్లో ఎండ తళుక్కుమంటోంది. "పందికొక్కు తవ్విన మట్టిలో గాజుముక్కల్లా ఆలోచనలు" ఎక్కడో చదివిన మాటలు గుర్తుకువచ్చాయి విరించికి.

నదిపై పున్నాగపువ్వులు తేరుకట్టాయి. ఈ నదిలోనే రఘు వదిన పూజకు పూవులు కోయబోయి దెబ్బలు తగిలించుకున్నాడు. అప్పుడవన్నీ ముళ్ళకంచెలు. ఇప్పుడా ప్రదేశమంతా ఏవో పేరు తెలియని పసుపు పూవులు. ఎదురుగా ఉన్న రాయిని ఫతేలుమనితన్నాడు రఘు. అతని పెదవి బిగింపులో కచ్చ, అతనిలో అణచిపెట్టిన లావాగాడ్పులు, గుండెల్లో మంటలు. బైట ప్రపంచంలో బిజినెస్‌మాన్‌గా చాలా లౌక్యుడిలా ప్రవర్తించే రఘులో ఇంత మానసిక సంఘర్షణ, ఆవేదన ఏమిటసలు? ఏ మహాకవో, కళాకారుడో ఈ గుణాలతో ప్రభావితుడయ్యాడంటే అది వేరు. అసలు వీడి జీవితానికి, ఆలోచనలకు సామరస్యం ఏమిటి?

"ఎప్పుడో ఇవన్నీ వదిలిపెట్టి పేరు తెలియని ఊరులో నేనెవరో తెలియకుండా బతికేస్తాను చూడు" ఏదో చెప్తున్నాడు రఘు. ఎక్కడో చదివిన వాక్యాలు గుర్తుకువచ్చాయి విరించికి. మనిషిలో ఏడు శరీరాలు ఉంటాయిట. ఇతనిలో ఈ రఘు నిజం. కానీ ఈ కబుర్లూ, ఈ సెంటిమెంట్లూ, ఈ నది ఒడ్డున ఊహలు మేటలు వేసే చోటునే. ఊళ్ళో ప్రవేశించగానే ఎకరాల రేటు, పాలిస్టర్ షర్ట్ ఖరీదులు, ఇంపోర్టెడ్ వస్తువుల మోజు మళ్ళీ మామూలు రఘు. ఆ రఘూ నిజమే. పరిస్థితుల ప్రభావం వల్ల ఒక మనిషి బయటకు వచ్చి మిగతా రూపాలు అడుక్కు వెళ్ళిపోతాయి. అందుకే సాంగత్యం ఉంటుంది సంగతంతా అంటారు

ఎన్నోభావ సంఘర్షణలను కంపోజ్ చేసి ఫ్రేముల్లో ఇరికించి 'కాలం' గా కుదించడం చూసిన విరించికి ఇప్పుడు ఇవి ఏవీ కొత్తగా అనిపించవు. ఈ ఇద్దరు రఘులూ నిజమే. ఈ ఇద్దరేమిటి? ఇంకా ఎన్ని స్వరూపాలు లోపలనించి విస్తరించి రూపు కట్టుకోబోయి

ఆగిపోతాయో? అసలు ఏది నిజం? ఇవన్నీ ఎక్కడివి? మనస్సు చాలనలోనివా? ఏది శాశ్వతం? ఈ క్షణమేనా? దానిమీద పాత అనుభవాల నీడలు, రేపటి కలల తెరలు లేకపోతే ఈ క్షణం. ఈ క్షణంగా ఏమిటసలు?

ఎందుకో రాఘవ గుర్తుకు వచ్చాడు విరించికి. సరిగ్గా ఇక్కడే పట్టుజారిపోబోయిన రాఘవ 'ఉమ' అనే ఒక ఫినామినన్‌తో మార్పు చెందాడు. ఉమ పోయిన తరవాత రాఘవలో మార్పేమిటో అతనే ఎనలైజ్ చేసుకోలేదేమో అతని చుట్టూ ఉన్న చాలామందికి తెలియదుకూడా. దగ్గరతనం అసలు మనిషిని తెలుసుకోడానికి చాలాసార్లు ఉపయోగించదు. ఒక పదిసార్లు కలుసుకుని, కొన్ని గంటలు మాత్రం చూసిన ఉమకు తెలిసిన రాఘవ, పదిహేనేళ్ళుగా అతనితో కలిసి కాపురం చేస్తున్న భార్యకు తెలియదు.

పాపపుణ్యాలు, తత్వాలు - అతను వీటన్నిటినీ మించిపోయి ఆలోచిస్తున్నాడిప్పుడు. తిరిగి చూసినా అర్థం చెప్పుకోలేని అనుభవాల మధ్యగా దూసుకువచ్చే కిరణాలతో స్వప్న జగత్తులోని నీహారికలకు అమృతత్వాన్ని ప్రాప్తింపచేస్తున్నాడు. అతని గాయం కనబడనిది. అతని కన్నీళ్ళు రూపం లేనివి. దుఃఖం అంతం లేనిది.

అన్నదమ్ములిద్దరూ ఎవరి ఆలోచనతో వారు ఇంటికి చేరారు. పశువుల కొట్టం నుంచి బయటకు వస్తూ -

"అన్నం పెడతాను రండయ్యా" అంటూ లోపలికి వెళ్ళింది సుభద్ర.

వంటింట్లో గోడకానుకుని ఏదో ఇంగ్లీషు నవల చదువుతోంది లక్ష్మి. గదిలోనుంచి దుర్గమ్మగారి మూలుగు.

నిద్రగన్నేరు మత్తులో జోగాడుతోంది.

ఈ ఇంట్లో ఏదో వెలితి ఏమిటది? ఎవరి జీవితాల్లో వెలితి వారికి చిల్లిపడ్డ డప్పుల మోతలో ఏదో అపశృతిద్వారా తెలుస్తుంది. ఇది అని తెలియదు. ఆలోచిస్తూనే అన్నానికి కూర్చున్నాడు విరించి.

"వదినా!"

"ఏమిటయ్యా?" అప్పడాలు చేసుకుంటూ అన్నది సుభద్ర. ఉన్న అప్పడాలు, వడియాలు తోడికోడలు మూటకట్టి ఇచ్చింది. "పల్లెటూరి తిళ్ళు అనుకోకమ్మా! మా రఘుకు ఇష్టం" అని పులిహోర, గోంగూర ఇచ్చింది. ఇప్పుడు మళ్ళీ తమకోసరం కాబోలు.

"ఏమిటయ్యా చెప్పవేం?"

"నీకు ఒక అమ్మాయి గురించి చెప్పాలి."

తలెత్తి చూసి సన్నగా నవ్వింది.

"ఎవరయ్యోయ్" అన్నది. ఆ పల్లెటూరి మాటలో ఎంత చనువు, ఎంత పరిహాసం ఉన్నదో విరించికి తెలుసు.

"అమ్మాయి అనగానే ఇంకే ఆలోచనా రాదేం వదినా?" నవ్వుతూ అన్నాడు.

"ఛా! అది కాదయ్యా! పోనీ" ఎలా ఆలోచించాలా చెప్పు" మళ్ళీ నవ్వుతూ అన్నది.

"ఉమ అని."

"ఊఁ!"

"నీకెలా చెప్పాలో తెలియడంలేదు. ఆ అమ్మాయి, నాకూ రాఘవకూ, మాకేమిటి చాలామందికి మంచి స్నేహితురాలు."

"స్నేహం అంటే?" ఓరగా చూస్తు అంది సుభద్ర.

బిత్తరపోయాడు విరించి.

ఎక్కడినుంచో ఆవుదూడ 'అంబా' అని అరిచింది. పెద్ద వంటింటి మూలబోర్లించిన కుండలో ఎలుక దూరి బైటికి రాలేక అవస్థపడుతోంది. అటే చూస్తున్నాడు విరించి.

తన మాటలలో ఎంత వెలితి ఉందో, ఉమను గురించి చెప్పాలంటే పదజాలమెంతో సరిపోదో ఏమర్థం కాలేదు.

"వదినా! ఆవిడ అందరిలాంటి ఆడపిల్లకాదు"

ఇక ఆ తరవాత తను చెప్పేవి చెప్పేశాడు. ఆవిడ స్నేహంలో తీయదనం, రాఘవలాంటి సినిక్‌ను మార్చిన మంచితనం, అసలు ఆవిడ జీవన పోరాటంలో థాట్‌ను పాడుచేసుకోకండి. నెగిటివ్ థింకింగ్‌కు అలవాటు పడకండి' అని రాసిన ఉత్తరం. ఇంత చెప్పిన మనిషి బతుకు పోరాటంలో, సర్వప్రాపంచిక సుఖాలు ఉండీ చచ్చిపోవడాన్ని అందులో పైగా మృత్యువును జీవితానికి మరొక ద్వారంగా, అవతలి ఒడ్డుగా, కాటర్ పిల్లర్ స్టేజినుంచి మారే సీతాకోక స్థితిలా తీసుకున్న స్థిత ప్రజ్ఞత్వం ఆవిడ పెళ్ళి ఒక భయంకరమైన నిజంగా మిగిలిపోవడం అన్నీ తన భాషలో చెప్పాడు.

నిజంగా గుండెలు నిండి పొంగినప్పుడు ఆనందమవనీ, దుఃఖమవనీ అది తప్పకుండా మరొక స్పందించే హృదయాన్ని కదిలిస్తుంది. తప్పదు.

సుభద్ర కళ్ళల్లో నీళ్ళు.

"పాపం అంత అందమైన పిల్ల, అంత డబ్బున్న పిల్ల ఆవిడముందు నాబోటిదాని కష్టాలు ఏపాటివయ్యా. విరించీ. నాకప్పుడప్పుడు ఏమనిపిస్తుందో తెలుసా? ఇదేదీ శాశ్వతంకాదని, ఏదో నాటకమాడి గడిపేస్తున్నామనీ అనిపిస్తుంది" సుభద్ర అలా మాట్లాడ్డం సాధారణంగా జరగదు. ఆమె అలా ఆలోచిస్తుందని కూడా చాలా మందికి తెలియదు.

"నిజం వదినా! ఉమ తన జీవితంలో ఇష్టమొచ్చిన సీనులో ఆత్మహత్య చేసుకుని మనకు క్లైమాక్స్ చూస్తున్నామనే సంతోషం మిగిల్చింది. యాంటీ క్లైమాక్స్ ఆమె బతుకుంటే జరిగుండేది. 'రచన వేరు. అది ప్రపంచం కోసరం. జీవితం వేరు - అది నా కోసరం" అనుకునే చాలా మందిలో ఆమె ఉండదు. తను నమ్మింది, చెప్పింది, ఆలోచించింది ఒకటే. అయినా బతకలేకపోయింది. ఎక్కడున్నది లోపం? ఈ వ్యత్యస్త పాదారవిందుడి అస్తావిస్తపు లోకంలో ఆమె చేసిన తప్పు అదేనా?

"వదినా! నువ్వు దేవుణ్ణి నమ్ముతావా?"

"ఏమోనయ్యా నా నమ్మకాలు నావి. వదిలేయ్. పనుంది లోపల" అంటూ లేచింది సుభద్ర.

ఒక్క క్షణం తీరికలేని ఈ మనిషి ఏమిటి యంత్రమా? ఏదో నమ్మకాలు, పాపపుణ్యాలు వీటి గురించిన మత్తు నరనరాల్లో స్పందించకపోతే, ఈ ఇంటికి ఒక సుభద్ర అగరవత్తిలా, హారతి కర్పూరంలా అంకితమైపోదు.

ఆలోచనలు కట్టిపెట్టి లేచాడు విరించి.

గాలి మామూలుగానే వీస్తోంది. ప్రపంచంలో చెప్పుకోదగ్గ మార్పులేదు. సూర్యుడి ఉదయం, అస్తమయం మామూలే. సిద్ధాంతులు, అతివాదులు, మితవాదులు, తాత్వికులు, వేదాంతులు, మత గురువులు ఎవరి సిద్ధాంతాలు వారు ప్రచురిస్తూనే ఉన్నారు. కొందరు నమ్మినవి చెపితే, కొందరు మరికొందరి కోసరం చెప్తే కొంతమంది ప్రపంచాన్ని వంచించడానికి చెపితే ఏ రకమైతేనేం ప్రతి ఒక్కరి ఆలోచనా, అందులో బలమైన ఆలోచనా సరళిగల ప్రతి వ్యక్తి ఆలోచనా కనబడని రూపు దిద్దుకుని ప్రపంచ వాతావరణాన్ని మారుస్తూనే ఉన్నది.

1999కి ప్రళయం అని ఒకరంటే, రేపే మనదేశంలో పెట్రోలు పడుతుందని మరొకరి ప్రయత్నం. చేస్తున్న పనిని ఏదో తెలియని నిర్దేశికత్వంతో చేసుకుని పోతూనే ఉన్నాడు రాఘువ. అతనికి పెరిగిన జీతంతో, హోదాతో, పెద్ద ఇంట్లోకి మారి, వాయిదాల మీద ఫ్రిజ్ కొనాలని ప్రయత్నిస్తోంది అతని శ్రీమతి. ముద్దబంతిపూవులాంటి పిల్లను పెళ్ళి చేసుకుని పుట్టిన బంగారు తల్లికి 'ఉమ' అని పేరు పెట్టుకున్నాడు విరించి.

"చచ్చినవారికేడ్చెదరు. చావనివారికి భంగి. అంతా ఇంతే. సముద్రంలో ఒక నీటిబుడగ ఉదయించింది. కొన్నేళ్ళు సూర్యరశ్మిలో మిలమిలా మెరిసింది. మళ్ళీ అందులోనే లయించిపోయింది. ఇదంతా అంతే."

భార్య చితికి నిప్పుపెట్టి నిర్వేదనం నిండిన కళ్ళతో, తడిబట్టలతో నిలబడి అన్నారు రామేశంగారు.

ఆమెగారి అస్థికలతో ఇహ తిరిగి రానని చెప్పి రైలెక్కారు ఆయన.

"అనంతమయిన ప్రయాణం. దుఃఖపడకండి. ఇదొక మజిలీ. మరొక ప్రయాణానికి సంసిద్ధులమవ్వాలి. అంతే" దుఃఖపడుతున్న శంకరాన్ని ఓదారుస్తూ అన్నారు. అతని జీవితంలో ఎన్నో మూసిన కిటికీలను తెరిపించి, ప్రపంచాన్ని, సృష్టిని మరొక డైమన్షన్‌లో చూపించిన వ్యక్తి.

వసుంధర, ఆమె భర్త మారలేదు. ఉమ భర్త రంజిత్ ఎవరో షేక్‌తో కలిసి కొన్ని కోట్ల ప్రాజెక్ట్‌లో వాటాదారయ్యాడని తెలిసి మళ్ళీ అతనికి రమనిద్దామని ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉమలా సెంటిమెంటల్ ఫూల్‌ని కాదు. తనకేం అభ్యంతరంలేదని అన్నది రమ.

లక్ష్మణ్ మారలేదు. అతనికి మరొక వందరూపాయలు జీతం పెరిగింది.

ఉమ చనిపోయిన పరిస్థితులను మరింత విపరీతంగా వర్ణించి "నవలా సాహిత్యంలో ఒక విప్లవ వనిత" అని బిరుదు ఇచ్చి, ఆమె రాసిన నవలలు, గేయాలు హాట్‌కేక్స్‌లా అమ్ముడు పోయేటట్లు చేసుకుంటున్నాడు ఆమె పబ్లిషర్. రాయల్టీ విషయంలో హెచ్చు తగ్గులు వచ్చి ఉమ తండ్రి అతనిపై దావా వేశాడు.

థియసాఫికల్ సొసైటీలో వెదురు చెట్లు అన్నీ వేణువులవ్వడంలేదు. కానీ అక్కడి వాతావరణంలో విశ్వసంగీతం వినిపిస్తూనే ఉన్నది.

గాలి మామూలుగానే వీస్తోంది. సూర్యుడు మర్యాదగా ఉదయించి అస్తమిస్తూనే ఉన్నాడు.